thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 338 | కరీంనగర్ శుక్రవారం, 13 ఫిబ్రవరి 2026 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## త్వరలో మీడియా కౌన్సిల్ ఏర్పాటు

న్యూఢిల్లీ : దేశంలో డిజిటల్ వేదికలు, ప్రసార మాధ్యమాలు, సోషల్ మీడియా యాప్‌లు భారీ సంఖ్యలో పుట్టుకొస్తున్నాయి. వీటి నియంత్రణ ప్రభుత్వాలకు సంక్లిష్టంగా మారింది. ఈ నేపథ్యంలో మీడియా కౌన్సిల్ అనివార్యమని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కేంద్రానికి ఇటీవలే నివేదించింది. ముద్రణ, ప్రసార, డిజిటల్ మీడియాలు అన్నింటినీ ఒకే గొడుగు కిందకు చేర్చేందుకు కొత్తగా మీడియా కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది. ప్రస్తుతం డిజిటల్ వేదికలు ఐటీ చట్టం, 2021 కింద ఉన్నాయి. ప్రింట్ మీడియాను ప్రెస్ కౌన్సిల్ నియంత్రిస్తున్నది. టీవీ చానళ్లు కేబుల్ టీవీ నెట్‌వర్క్ చట్టంలోని మార్గదర్శకాల ప్రకారం నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో వీటన్నింటినీ మీడియా కౌన్సిల్ ఏర్పాటు ద్వారా ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని స్టాండింగ్ కమిటీ స్పష్టం చేసింది.

# నేడు కేంద్ర కేబినెట్ ప్రత్యేక భేటీ- ఇదే చివరిదీ: ఇకపై..



కేంద్ర కేబినెట్.. శుక్రవారం ప్రత్యేకంగా సమావేశం కాబోతోంది. సౌత్ బ్లాక్ లో జరిగే ఈ సమావేశానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దీనికి అధ్యక్షత వహించనున్నారు. ఇదే చివరి భేటీ కాబోతోండటం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ సందర్భంగా కేంద్ర కేబినెట్ పలు అంశాలపై చర్చించనుంది. కొన్ని ప్రతిపాదనలు, తీర్మానాలను ఆమోదించే అవకాశం ఉంది. చివరి సమావేశం కావడం వల్ల దాదాపుగా మంత్రులందరూ దీనికి హాజరు కావాల్సి ఉంటుందని ప్రధానమంత్రి కార్యాలయం సూచించింది. ఇదే చివరి భేటీ కావడానికి కారణాలు లేకపోలేదు. ఇకపై ప్రధానమంత్రి కార్యాలయం రీలొకేట్ కాబోతోంది. సౌత్ బ్లాక్ కు వీడ్కోలు పలకబోతోంది. ఇక్కడి నుంచి సేవా తీర్థ్ కు తరలి వెళ్లనుంది పీఎంఓ. శుక్రవారం మధ్యాహ్నం సేవా తీర్థ్ కు షిఫ్ట్ అవుతుంది. ఈ నేపథ్యంలో- సౌత్ బ్లాక్ లో చివరిసారిగా సమావేశం కావాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఈ భేటీతో అయిదు దశాబ్దాలకు పైగా కేంద్రబిందువుగా కొనసాగుతూ వచ్చిన సౌత్ బ్లాక్ కు తెరపడుతుంది. ఈ తరలింపునకు ముందు ప్రధాని నరేంద్ర మోడీ తన చివరి క్యాబినెట్ సమావేశాన్ని సౌత్ బ్లాక్‌లోనే నిర్వహిస్తారు. క్యాబినెట్ భేటీ అనంతరం మంత్రులు, అధికారులు సేవా తీర్థ్‌కు చేరుకుంటారు. సౌత్ బ్లాక్ నుండి కిలోమీటరు లోపే ఈ సేవా తీర్థ్ కాంప్లెక్స్ నిర్మితమైంది. పీఎంఓ, క్యాబినెట్ సెక్రటేరియట్, జాతీయ భద్రతా సలహాదారు కార్యాలయం, ఉన్నత స్థాయి ప్రతినిధుల ఇండియా హౌస్.. వంటివి ఇందులో కొనసాగుతాయి..

ఇకపై. పీఎంఓ 1947లో చిన్న సచివాలయంగా ప్రారంభమైంది. 1931లో నార్త్ బ్లాక్‌తో నిర్మితమైన సౌత్ బ్లాక్ భారత పాలనలో అనేక కీలక ఘట్టాలను చూసింది. జవహర్‌లాల్ నెహ్రూ హయాంలో మొదటి క్యాబినెట్ సమావేశం ఇక్కడే జరిగింది. 1964లో 'అలోకేషన్ ఆఫ్ బిజినెస్ రూల్స్' కింద ప్రధాని సచివాలయానికి చట్టబద్ధత లభించగా, ఇందిరా గాంధీ హయాంలో అధికార పరిధి గణనీయంగా పెరిగింది. 1977లో మొరార్జీ దేశాయ్ ప్రభుత్వం ప్రధానమంత్రి కార్యాలయంగా మార్చింది. సేవా తీర్థ్.. కేంద్ర పరిపాలన పునర్నిర్మాణ ప్రయత్నాల్లో కీలక మైలురాయి. మున్ముందు రక్షణ, విదేశాంగ మంత్రిత్వ శాఖలు సౌత్ బ్లాక్ నుండి షిఫ్ట్ కానున్నాయి. పరిపాలనను ఆధునీకరించి సామర్థ్యం పెంచే విస్తృత కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయాలను తీసుకుంది.




## 114 రఫేల్ యుద్ధ విమానాలు, 6 పీ8ఐ విమానాలకు గ్రీన్‌సిగ్నల్

న్యూఢిల్లీ: ఫ్రాన్స్ నుంచి 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించిన కీలకమైన డిఫెన్స్ డీల్‌కు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రూ. 3.25 లక్షల కోట్ల విలువైన డీల్ ఇది. ఈ డీల్‌కు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని డిఫెన్స్ కౌన్సిల్ ఆమోదం తెలిపినట్టు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. భారత నావికా దళం కోసం 6 పీ8i విమానాలను కొనుగోలు చేసే డీల్‌ను కూడా ఆమోదించినట్టు తెలిపాయి. రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు డీల్‌తో భారత వాయుసేన పోరాట సామర్థ్యం మరింత పెరుగుతుంది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ఈనెల ద్వితీయార్థంలో భారత్ పర్యటనకు రానున్నారు. ఈ సందర్భంగానే డిఫెన్స్ డీల్‌పై సంతకాలు జరిగే అవకాశాలున్నాయి. డీల్ ప్రకారం 18 రఫేల్ జట్లను 'ఫ్లై-అవే కండిషన్'లో నేరుగా తీసుకువస్తారు. తక్కిన 96 విమానాలు ఇండియాలో అసెంబుల్ చేస్తారు. 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమంలో భాగంగా స్థానికంగా తయారీ, అసెంబెల్ కోసం రఫేల్ మాతృ సంస్థ డసో ఏవియేషన్, భారత్‌లోని ప్రైవేటు రంగ సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకుంటారు.

# నెగ్గేదెవరు... తగ్గేదెవరు..!?

## మున్సిపల్ ఎన్నికల్లో గెలుపుపై ప్రధాన పార్టీల ధీమా!!



# నేడే మున్సిపల్ ఓట్ల లెక్కింపు!

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ముగియగా, ఇప్పుడు అందరి దృష్టి ఫలితాలపై పడింది. ఈ నేపథ్యంలో విజయంపై ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేషన్లలో క్లీన్ స్వీప్ చేయడంతో పాటు వందకు పైగా మున్సిపాలిటీల్లో విజయం సాధిస్తామని హస్తం లీడర్లు లెక్కలు వేసుకుంటున్నారు. అన్ని మున్సిపాలిటీల్లో గట్టి పోటీ ఇచ్చామని చెప్తున్న బీఆర్ఎస్.. కనీసం 30 చోట్ల గులాబీ జెండా ఎగురవేస్తామని భావిస్తున్నది. ఈసారి ఉత్తర తెలంగాణపై స్పెషల్ ఫోకస్ పెట్టిన కమలం పార్టీ రెండు నగరపాలక సంస్థలతో పాటు 15 పురపాలక సంస్థలను సొంతం చేసుకుంటామని విశ్వాసం వ్యక్తం చేస్తున్నది.

**అధికార కాంగ్రెస్‌లో జోష్..** రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు ఎన్నికలు జరగ్గా.. మెజారిటీ వార్డులు, డివిజన్లలో త్రిముఖ పోటీ కనిపించింది. ఇందులో మెజారిటీ ఓట్లు తమకే వచ్చాయని కాంగ్రెస్ చెబుతున్నది. పోలింగ్ ముగిసిన తర్వాత మంత్రులు, ఎమ్మెల్యేలు తమ ఏరియాల్లో జరిగిన ఓటింగ్ సరళిపై ఆరా తీశారు. వార్డుల వారీగా లెక్కలు తీసి.. మెజారిటీ స్థానాల్లో విజయం సాధిస్తున్నామనే నిర్ణయానికి వచ్చారు. వంద మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో విజయం సాధిస్తామని వారు భరోసా వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్‌కు పట్టున్న జిల్లాల్లోని మున్సిపాలిటీల్లో సైతం కాంగ్రెస్ జెండా ఎగరేవేస్తామని చెబుతున్నారు. బీజేపీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లోని పట్టణాలు సైతం తమ ఖాతాలో చేరుతాయని ధీమాగా ఉన్నారు.

**ఓటింగ్ శాతంపై బీఆర్ఎస్ ఫోకస్...** మున్సిపాలిటీల్లో చైర్మన్ పదవులు దక్కించుకోవడం కంటే ఓటింగ్ శాతం పెంచుకోవడంపైనే ఈసారి బీఆర్ఎస్ ఫోకస్ పెట్టినట్లు కనిపించింది. అందులో భాగంగా ఏకగ్రీవాలు కాకుండా తమ పార్టీకి చెందిన బలమైన అభ్యర్థులను బరిలోకి దించింది. దీంతో మెజార్టీ పట్టణాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు బలమైన పోటీ ఇచ్చారు. కొందరైతే అధికార పార్టీకి దీటుగా పోల్ మేనేజ్‌మెంట్ చేశారు. దీంతో దాదాపు 30 మున్సిపాలిటీల్లో గులాబీ జెండా ఎగరవేస్తామని ఆ పార్టీ లీడర్లు అంచనా వేస్తున్నారు.

**కొత్త ఊపులో బీజేపీ..** మున్సిపల్ ఎన్నికలను ఈసారి బీజేపీ సీరియస్‌గా తీసుకున్నది. ఉత్తర తెలంగాణలో మెజారిటీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఉండటంతో ఆ ఏరియాల్లోని మున్సిపాలిటీలపై ప్రధానంగా ఫోకస్ పెట్టింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులకు సమానంగా ప్రచార తీరు, పోల్ మేనేజ్‌మెంట్ వ్యూహాలను అమలు చేసింది. దీంతో నిజామాబాద్, కరీంనగర్ కార్పొరేషన్లలో మేయర్ పదవిని సొంతం చేసుకునేందుకు కావాల్సిన మెజార్టీ వస్తుందనే ధీమా ఆ పార్టీ కేడర్‌లో కనిపిస్తున్నది. అలాగే, ఉత్తర తెలంగాణలోని 15 మున్సిపాలిటీల చైర్మన్ పదవులను సొంతం చేసుకుంటామని కమలం నేతలు లెక్కలు వేసుకుంటున్నారు.తెలంగాణలో ఉత్కంఠ రేపిన మున్సిపల్ ఎన్నికల పోలింగ్ బుధవారం ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ ముగిసిన వెంటనే వెలువడిన 'పీపుల్స్ పల్స్' ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు రాజకీయ వర్గాల్లో పెను సంచలనం సృష్టిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా అధికార కాంగ్రెస్ పార్టీ తన ఆధిపత్యాన్ని చాటుకోబోతుందని, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌కు ఈ ఎన్నికలు గట్టి దెబ్బ కానున్నాయని సర్వే అంచనా వేసింది. కార్పొరేషన్లలో కాంగ్రెస్ జైత్రయాత్ర మొత్తం 7 మున్సిపల్ కార్పొరేషన్లలో ఐదింటిని కాంగ్రెస్ కైవసం చేసుకునే అవకాశం ఉ ందని పీపుల్స్ పల్స్ వెల్లడించింది. మంచిర్యాల, రామగుండం, నల్గొండ, మహబూబ్‌నగర్, కొత్తగూడెం కార్పొరేషన్లలో కాంగ్రెస్ జెండా ఎగురవేయనుంది. నిజామాబాద్, కరీంనగర్ కార్పొరేషన్లలో బీజేపీ అత్యధిక స్థానాలు గెలుచుకుని పట్టు నిలుపుకోబోతోంది. ఆశ్చర్యకరంగా ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ ఒక్క కార్పొరేషన్‌ను కూడా గెలుచుకోలేకపోవచ్చని సర్వే పేర్కొంది. మున్సిపాలిటీల్లోనూ అదే జోరు రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీ 68 నుంచి 76 స్థానాలను గెలుచుకునే అవకాశం ఉందని అంటే దాదాపు 70 శాతం మున్సిపాలిటీలు హస్తగతం కానున్నాయని అంచనా. రామగుండం, మంచిర్యాల వంటి పారిశ్రామిక ప్రాంతాల్లో కాంగ్రెస్ తిరుగులేని ఆధిక్యం ప్రదర్శించబోతోంది. నిజామాబాద్, కరీంనగర్‌లో బీజేపీ తన బలాన్ని నిరూపించుకోగా కొన్ని చోట్ల ఎంఐఎం 'కింగ్ మేకర్' పాత్ర పోషించనుంది. ఉత్కంఠకు తెరపడేది అప్పుడే ఫిబ్రవరి 11న జరిగిన ఈ ఎన్నికల ఫలితాలు ఫిబ్రవరి 13న శుక్రవారం న వెల్లడికానున్నాయి. ఎగ్జిట్ పోల్స్ అంచనాలు నిజమైతే తెలంగాణలో కాంగ్రెస్ మరోసారి తన సత్తా చాటినట్టే. అయితే అసలు ఫలితాల్లో ఏవైనా అనూహ్య మార్పులు ఉంటాయా అనేది వేచి చూడాలి.



# ఎప్‌స్టీన్ మంటలు..

## జాతీయ రాజకీయాల్లో సంచలనం తప్పదా?

ప్రపంచ వ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తున్న ఎప్‌స్టిన్ సెక్స్ కుంభకోణం వ్యవహారం ఇప్పుడు భారత జాతీయ రాజకీయాల్లో సంచలనంగా మారింది. ఎప్‌స్టిన్ ఫైల్స్ లో కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీ పేరు ఉందంటూ ఇవాళ లోక్ సభలో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై హర్దీప్ సింగ్ స్పందించారు. తనపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఇంటర్నేషనల్ పీస్ ఇనిస్టిట్యూట్ బృందంలో భాగంగా తాను ఎప్‌స్టిన్‌ను కలిశానని క్లారిటీ ఇచ్చారు. ఒక్కసారే నేను ఎప్‌స్టిన్‌కు ఈమెయిల్ చేశానని, ఎప్ స్టీన్ ఐల్యాండ్ లో జరిగిన అనైతిక కార్యకలాపాలతో తనకు సంబంధం లేదని ఆసమయంలోనూ నేను మేక్ ఇన్ ఇండియా గురించే మాట్లాడానని స్పష్టంత ఇచ్చారు. ఇవాళ న్యూ ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన.. నిరాధార ఆరోణలు చేసే అలవాటు రాహుల్ గాంధీకి ఉందని హర్దీప్ సింగ్ ఫైర్ అయ్యారు.

**విదేశాల్లో తిరుగుతూ అప్పుడప్పుడు వచ్చేవాడిలా కాదు:** రాజకీయ వ్యవస్థలో రెండు రకాల నాయకులు ఉంటారని ఒక రకం నాయకులు బాధ్యతలు స్వీకరిస్తే మరొ రకం జీవితాలను ప్రజాసేవకు అంకితం చేసి దేశాన్ని మారుస్తారు. మేము రెండో రకం అన్నారు. పదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ గా ఉన్న భారత్ ను నాలుగో స్థానానికి తేగిగామన్నారు. దేశాన్ని త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుస్తామని చెప్పారు. కొందరు విదేశాల్లో తిరుగుతూ అప్పుడప్పుడు దేశానికి వచ్చే వాళ్లు ఉన్నారని ఆ నేతలు మాత్రం సభలో ప్రసంగాలు ఇచ్చి వెళ్లిపోతారని ప్రభుత్వం వివరణ ఇస్తుంటే వెంటనే వాకౌట్ చేస్తారని దుయ్యబట్టారు.

**దేశ రాజకీయాలను షేక్ చేయబోతోందా?:** ఎప్‌స్టిన్ ఫైల్స్ వ్యవహారంలో ప్రతిపక్ష, అధికార పక్షం మధ్య ప్రస్తుంత వ్యాగ్యుద్ధం నడుస్తోంది. ఈ ఫైల్స్ కారణంగానే ప్రధాని నరేంద్ర మోడీ యూఎస్ కు సరెండర్ అయ్యారని తత్ఫలితంగానే ఆ దేశంతో ట్రేడ్ డీల్ కుదిరిందని రాహుల్ గాంధీ సెంట్రల్ ను టార్గెట్ చేస్తున్నారు. అయితే కేంద్రం మాత్రం మన దేశ ప్రయోజనాలకు ఎలాంటి భంగం కలగకుండానే ఈ డీల్ కుదిరిందని వాదిస్తోంది. ఈ డీల్ వెనుక ఎలాంటి ఒత్తిళ్లు లేవని క్లారిటీ ఇచ్చింది. అయినా రాహుల్ గాంధీ మాత్రం ఎప్?స్టిన్ ఫైల్స్ లో ఉన్న మన దేశానికి చెందిన వారి పేర్లను ప్రస్తావిస్తుండటం హాట్ టాపిక్ గా మారింది. ఈ ఆరోపణలపై వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని రాహుల్ తేల్చి చెబుతున్నారు. ఇప్పటికే ఈ ఫైల్స్ పుణ్యమా అని యూకే వంటి అగ్రదేశాల్లోని రాజకీయాలు షేక్ అవుతున్నాయి. పలు దేశాల్లో రాజకీయ ముఖచిత్రాలు తారుమారు అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో మన దేశంలో దుమారం రేగిన ఎప్ స్టిన్ ఫైల్స్ ఎలాంటి పరిణామాలకు దారి తీయబోతోందని అనేది ఉత్కంఠగా మారింది.




## గ్రామ పంచాయతీలకు కేంద్రం శుభవార్త..

హైదరాబాద్: గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం కింద రూ.387 కోట్లని కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. మొదటి విడతగా ఇప్పటికే రూ. 259.36 కోట్లు విడుదలైన విషయం తెలిసిందే. తాజా విడతతో కలిపి మొత్తం నిధులు రూ. 646.36 కోట్లు విడుదలయ్యాయి. తెలంగాణకు 15వ ఆర్థిక సంఘం కింద సుమారు రూ. 3,000 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. గ్రామపంచాయతీ ఎన్నికలు పూర్తి చేసి, కేంద్రం కోరిన సమాచారాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ సమర్పించింది. ఇందుకు అనుగుణంగా విడతలవారీగా కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఇంకా సుమారు రూ. 2,400 కోట్లు విడుదల కావాల్సి ఉంది. గ్రామాల అభివృద్ధి కోసం పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని కేంద్రానికి తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు.




## కొత్త ఎయిర్‌పోర్టులపై కేంద్రమంత్రి రామ్మోహన్‌తో సీఎం రేవంత్ చర్చ

న్యూఢిల్లీ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో బిజీబిజీగా ఉన్నారు. ఇందులో భాగంగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడితో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. రాష్ట్రంలో నాలుగు కొత్త ఎయిర్‌పోర్టుల అభివృద్ధి కోసం అవసరమైన అనుమతులు, సహాయం కోరారు సీఎం. ఈ భేటీలో మామూనూరు , కొత్తగూడెం, అంతర్గాం, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులకు సంబంధించిన పలు అంశాలు చర్చకు వచ్చాయి. మామూనూరు విమానాశ్రయానికి భూ సేకరణ పూర్తి కావడంతో, అవసరమైన నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి వినతి చేశారు. అలాగే, కొత్తగూడెం ఎయిర్‌పోర్ట్ కోసం పాల్వంచలో స్థలం గుర్తించినందున, ఆబ్‌స్ట్రక్షన్ లిమిట్ సర్వే, ఫీజిబిలిటీ స్టడీలు త్వరగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. అంతర్గాం ఎయిర్‌పోర్ట్ కోసం ప్రత్యామ్నాయ స్థలం గుర్తించినట్లు తెలిపిన సీఎం.. వెంటనే అనుమతులు మంజూరు చేయాలని కేంద్రమంత్రిని కోరారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ విషయంలో అదనంగా 249.82 ఎకరాల భూమి కేంద్ర ప్రభుత్వానికి సిద్ధంగా ఉందని సీఎం తెలియజేశారు. ఈ ఎయిర్‌పోర్ట్ నిర్మాణాన్ని ఒక సంవత్సరంలో పూర్తి చేసి, ఎయిర్‌బస్ సర్వీసులు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.



## గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ శంకుస్థాపనకు రండి.. రాజ్‌నాథ్‌కు రేవంత్ ఆహ్వానం

ఢిల్లీ: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటన కొనసాగుతోంది. గురువారం ఉదయం రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో ఆయన భేటీ అయ్యారు. ఫిబ్రవరి చివరి వారంలో నిర్వహించే గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ శంకుస్థాపన కార్యక్రమానికి హాజరు కావాలని కేంద్రమంత్రిని సీఎం ఆహ్వానించారు. ఈసా, మూసీ నదుల సంగమ స్థలంలో దీన్ని చేపడుతున్నట్లు వివరించారు. మూసీ పునరుజ్జీవ కార్యక్రమంలో భాగంగా గాంధీ సరోవర్ ప్రాజెక్టును చేపడుతున్నామని తెలిపారు. బాపూఘాట్‌ను ప్రపంచ స్థాయి విద్య, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, పర్యావరణ చిహ్నంగా నిలపనున్నట్లు రాజ్‌నాథ్‌కు రేవంత్ వివరించారు.

## కార్మికుల కష్టంతోనే ఈ దేశం నడుస్తోంది: మహేశ్‌కుమార్ గౌడ్

హైదరాబాద్: కార్మికుల హక్కులను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. ఆ హక్కు మోదీకి ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. కొత్తగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆటో, ఆర్టీసీ యూనియన్లు, వివిధ వర్గాల కార్మికులు, రైతు సంఘాలు, ప్రజా సంఘాలు, సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల అనుబంధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన ఒక రోజు బంద్‌లో మహేశ్ గౌడ్ పాల్గొన్నారు. వీఎస్టీ నుంచి ఆర్టీసీక్రాస్ రోడ్ మీదుగా ఇందిరాపార్క్ వరకు భారీ ర్యాలీ తీశారు. అనంతరం ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహించారు. "కార్మికుల చెమట కష్టంతో ఈ దేశం నడుస్తోంది. కార్మికుల పరిపూర్ణమైన హక్కులను ప్రధాని మోదీ అదానీ, అంబానీలకు కట్టబెడుతున్నారు. దేశవ్యాప్తంగా సెంట్రల్ ట్రేడ్ యూనియన్ పిలుపుమేరకు కార్మికులు ధర్నా చేస్తున్నారు. ప్రధాని మోదీ ప్రభుత్వం పెట్టుబడి వ్యవస్థకు దారులు తెరిచింది. మోదీ, అమిత్ షాలను కేంద్రంలో రాహుల్ గాంధీ ధైర్యంగా ఎదుర్కొంటున్నారు. పేదల హక్కులను కాలరాయడమే కాకుండా..



నరేగా ఉపాధి హామీకి పథకానికి మహాత్మాగాంధీ పేరు తొలగించారు. కేంద్రం తీసుకువచ్చిన ఆ చట్టాలపై అసెంబ్లీలో చర్చిస్తాం. నాలుగు కోడ్‌ల రద్దు విషయంలో కాంగ్రెస్ పార్టీ కార్మికులకు సంపూర్ణ మద్దతు ఇస్తుంది. కాంగ్రెస్ పార్టీ కార్మికుల పక్షపాతి. ప్రధాని మోదీ దిగొచ్చి కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి. అప్పటి వరకు ఈ ఉద్యమం కొనసాగాలి" అని మహేశ్ గౌడ్ అన్నారు.




## రాహుల్‌పై సభా హక్కుల తీర్మానానికి కేంద్రం విముఖత..

ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై సభా హక్కుల తీర్మానానికి కేంద్రం విముఖత వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరుతూ బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే గురువారం లోక్‌సభలో 'సబ్‌స్టాంటివ్ మోషన్' దాఖలు చేశారు. రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయడమే కాకుండా, జీవితాంతం ఆయన ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం విధించాలని ఆయన డిమాండ్ చేశారు. బీజేపీ ఎంపీ ప్రవేశపెట్టిన ఆ తీర్మానంపై కేంద్రం విముఖంగా ఉన్నట్టు సమాచారం. అయితే రాహుల్‌గాంధీ బుధవారం చేసిన ప్రసంగం నుంచి కొన్ని వ్యాఖ్యలు తొలగించాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. 'జార్జ్ సోరోస్ వంటి శక్తుల సహాయంతో రాహుల్ గాంధీ దేశాన్ని ఎలా తప్పుదారి పట్టిస్తున్నారో వివరిస్తూ నేను ఈరోజు లోక్‌సభలో ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టాను. ఈ విషయాన్ని చర్చించాలని, ఆయన సభ్యత్వాన్ని రద్దు చేయాలని, ఆయన జీవితాంతం ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించాలని డిమాండ్ చేస్తున్నా' అంటూ దూబే అన్నారు. అమెరికా-భారత్ ట్రేడ్ డీల్ గురించి రాహుల్ గాంధీ బుధవారం లోక్‌సభలో తీవ్ర ఆరోపణలు చేశారు (దీబ్రీ జం జశీఅస్త్రతీవంం). ఈ ఒప్పందం ద్వారా భారత ప్రయోజనాలను పూర్తిగా అమెరికాకు తాకట్టు పెట్టారని ఆయన ఆరోపించారు. ఈ ట్రేడ్ డీల్‌ను రాహుల్ గాంధీ 'పూర్తి లొంగుబాటు'గా అభివర్ణించారు. భారతదేశ ఇంధన భద్రతను అమెరికాకు అప్పగించారని, రైతుల ప్రయోజనాల విషయంలో రాజీ పడ్డారని ఆరోపించారు. రాహుల్ గాంధీ ప్రసంగంపై బీజేపీ ఎంపీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.




## పక్కా ప్లాన్‌తో లీక్.. విదేశీ మార్కెట్‌లో నరవణె పుస్తకం..!

భారత సైన్యం మాజీ అధిపతి జనరల్ ఎం.ఎం.నరవణె రచించిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకం గురించి మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చాయి. రక్షణశాఖ అనుమతుల కంటే ముందే ఈ పుస్తకం గ్లోబల్ మార్కెట్‌లోకి ప్రవేశించినట్లు ఢిల్లీ పోలీసు వర్గాలు వెల్లడించాయి. ఇదంతా కుట్రపూరితంగానే జరిగినట్లు పేర్కొన్నాయి. ప్రచురణకు ముందే లీకైన ఈ 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకం.. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, జర్మనీ దేశాల్లోని ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లో విక్రయానికి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ లీకైన కాపీకి ఇంటర్నేషనల్ స్టాండర్డ్ బుక్ నంబరు (ఐఎస్‌బీఎన్) ఉండటం చూసి దర్యాప్తు బృందం అవాక్కయ్యింది. 13 అంకెల ఈ నంబరును సాధారణంగా అన్ని అనుమతులు పొంది పబ్లిష్, విక్రయాలకు పంపించే పుస్తకాలకు కేటాయిస్తారు. రక్షణశాఖ అనుమతులు రాకుండానే నరవణె పుస్తకానికి ఈ నంబరు ఉండటం పలు అనుమానాలు రేకెత్తిస్తోంది. "ఇది కేవలం పైరసీ చర్య మాత్రమే కాదు. రక్షణశాఖ అనుమతులు లేకుండా పుస్తకం మార్కెట్‌లోకి వచ్చేలా పక్కా ప్రణాళికతో, సమన్వయంతో ఈ లీక్ ఆపరేషన్ చేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది" అని ఢిల్లీ పోలీసు వర్గాలు తెలిపాయి. దీనిపై పబ్లిషర్ పెంగ్విన్ ఇండియాను ప్రశ్నించేందుకు దర్యాప్తు బృందం సిద్ధమైంది. అదే సమయంలో విదేశీ మార్కెట్లకు ఈ బుక్‌ను పంపించడానికి సంబంధించి డిజిటల్, ఆర్థిక లావాదేవీలను ట్రాక్ చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. అయితే, తాజా పరిణామాలపై రక్షణ మంత్రిత్వశాఖ ఇంకా స్పందించలేదు. చైనా దళాలతో భారత బలగాల ఘర్షణకు సంబంధించి వివాదాస్పద విషయాలను ప్రస్తావిస్తూ నరవణె రాసిన ఈ పుస్తకానికి రక్షణ మంత్రిత్వశాఖ నుంచి ప్రచురణ అనుమతి లభించలేదు. అయినా దీన్ని ఇటీవల ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లోక్‌సభకు తీసుకురావడం తీవ్ర చర్చనీయాంశమైంది. దీంతో ఈ లీకేజీ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఇప్పటికే దీనిపై ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి పెంగ్విన్ ఇండియాకు నోటీసులు జారీ చేశారు.

## భాజపా అభ్యర్థి ఆత్మహత్య.. నాకెలాంటి సంబంధం లేదు: మంత్రి వాకిటి శ్రీహరి



హైదరాబాద్: మక్తల్‌లో భాజపా అభ్యర్థి మహదేవప్ప ఆత్మహత్య విషయంలో తనకు ఎలాంటి సంబంధం లేదని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. తనపై చేస్తున్న ఆరోపణలు రుజువైతే దేనికైనా సిద్ధమని చెప్పారు. "మహదేవప్పకు నేను ఎప్పుడూ కాల్ చేయలేదు. అవసరమైతే కాల్ డేటా పరిశీలించండి. పోస్ట్‌మార్టం నివేదిక తర్వాతే అసలు కారణాలు వెల్లడవుతాయి. ఎన్నికల భయంతో ఆయన మృతి చెందినట్లు కుటుంబసభ్యులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ విషయంలో చట్టం తన పని తాను చేసుకెళ్తుంది"అని వాకిటి శ్రీహరి అన్నారు.

## మాదాపూర్‌లో మరో భారీ ఆపరేషన్.. రూ.2,200 కోట్ల భూమిని కాపాడిన హైడ్రా

హైదరాబాద్: మహా నగరంలో హైడ్రా మరో భారీ ఆపరేషన్ నిర్వహించింది. మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ సమీపంలోని మొండికుంటలో ఆక్రమణలను తొలగించి రూ. 2,200 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జాదారుల చెర నుంచి విడిపించింది. సర్వే నంబరు 53లోని మొండికుంటతో పాటు, సర్వే నంబరు 55లోని ప్రభుత్వ భూమి ఎకరాల కొద్దీ ఆక్రమణకు గురవుతోందని స్థానికులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి హైడ్రా క్షేత్ర స్థాయిలో విచారించింది. దాదాపు 11 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైనట్టు హైడ్రా అధికారులు గుర్తించారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఆలయాన్ని హద్దుగా చూపించి కబ్జాదారులు ఆక్రమణలకు పాల్పడినట్టు నిర్ధరించారు. ఆలయం హద్దుగా పలు షాపులు, మెకానిక్ షెడ్డులు, ఐరన్ స్టీల్ షాపు ఇలా పలు రకాల షెడ్డులు వేసి వ్యాపారాలు చేస్తున్నట్టు గుర్తించారు. 30కి పైగా ఉన్న షాపుల ద్వారా నెలకు రూ.లక్షల్లో అద్దె వసూలు చేస్తూ కబ్జాదారులు సొమ్ము చేసుకుంటున్నట్టు అధికారులు గుర్తించారు. కమిషనర్ రంగనాథ్ ఆదేశాలతో వాటిని తొలగించి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నారు. మొండికుంటతో పాటు.. అక్కడి ప్రభుత్వ భూమి ఆక్రమణలపై జనవరి 31న హైడ్రా విచారణ చేపట్టింది. రెవెన్యూ అధికారులతో పాటు.. కబ్జాలకు పాల్పడిన వారు కూడా సమావేశంలో పాల్గొన్నారు. వారి సమక్షంలోనే.. ఆక్రమణలు జరిగినట్టు రెవెన్యూ అధికారులు స్పష్టం చేశారు. ఎన్ఆర్ఎస్‌సీ శాటిలైట్ చిత్రాలను పరిశీలించి కూడా ఆక్రమణలు జరిగినట్టు నిర్ధరించారు. ఇదే విషయాన్ని హైడ్రా.. కబ్జాదారులకు వివరించింది. వారికి కొంత సమయం ఇచ్చిన హైడ్రా.. గురువారం ఆక్రమణలు తొలగింపు చేపట్టింది. వందల సంఖ్యలో ఉన్న తాత్కాలిక షెడ్డులను భారీ బందోబస్తు మధ్య హైడ్రా తొలగించింది. ఆక్రమణలు తొలగించిన చోట పార్కులను అభివృద్ధి చేయాలని స్థానికులు హైడ్రా అధికారులను కోరారు. చెరువును అభివృద్ధి చేసి సుందరీకరించాలని అభ్యర్థించారు.



## డిప్యూటీ సీఎం పవన్‌తో ఎమ్మెల్యే బాలకృష్ణ భేటీ

**అమరావతి: ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు బాలకృష్ణ భేటీ అయ్యారు. అసెంబ్లీలోని పవన్ ఛాంబర్‌లో ఆయన్ను కలిశారు. హిందూపురం నియోజకవర్గ సమస్యలపై ఆయనతో చర్చించారు. పవన్ కల్యాణ్‌ను ఆయన సోదరుడు, ఎమ్మెల్సీ నాగబాబు కూడా కలిశారు. గిద్దలూరు నియోజకవర్గ సమస్యలపై పవన్‌కు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు.**




సియాటెల్: అమెరికాలో పోలీసు అధికారి నిర్లక్ష్యం వల్ల తెలుగు విద్యార్థిని జాహ్నవి కందుల మృతి చెందిన కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆమె కుటుంబానికి 29 మిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో దాదాపు రూ.262 కోట్లు) పరిహారం చెల్లించేందుకు సియాటెల్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈమేరకు సిటీ అటార్నీ ఎరికా ఇవాన్స్ (అమెరికా కాలమానం ప్రకారం) ప్రకటన విడుదల చేశారు. "జాహ్నవి కందుల మృతి అత్యంత బాధాకరం. ఈ సెటిల్మెంట్‌తో ఆమె కుటుంబానికి కాస్తయినా ఉపశమనం లభిస్తుందని ఆశిస్తున్నాం" అని సియాటెల్ అటార్నీ తమ ప్రకటనలో పేర్కొన్నారు. అయితే, దీనిపై జాహ్నవి కుటుంబం తరఫు అటార్నీ నుంచి ఇంతవరకూ స్పందన రాలేదు. ఈ కేసులో పరిహార ఒప్పందం కోసం ఇరుపక్షాలూ గతవారం కోర్టులో దరఖాస్తు దాఖలు చేసినట్లు తెలిసింది.

**కేసు వివరాలివి..** ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాకు చెందిన జాహ్నవి (23) ఉన్నత చదువుల కోసం 2021లో అమెరికా వెళ్లారు. సౌత్‌లేక్ యూనియన్‌లోని నార్త్‌ఈస్ట్రన్ యూనివర్సిటీలో మాస్టర్స్ డిగ్రీలో చేరారు. 2023 జనవరి 23న రాత్రి ఆమె రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన పోలీసు పెట్రోలింగ్ వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన జాహ్నవి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదానికి కారణమైన పోలీసు అధికారి కెవిన్ డవే.. జాహ్నవి మృతిపై జోకులు వేయడం అప్పట్లో తీవ్ర వివాదాస్పదమైంది. 'ఆమె ఓ సాధారణ వ్యక్తి.. ఈ మరణానికి విలువ లేదు' అని పోలీసు అధికారి అన్న మాటలు ఆయన బాడీ కెమెరాలో రికార్డయ్యాయి. దీనిపై అప్పట్లో భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. కెవిన్ తీరుపై అమెరికాలోనూ విమర్శలు రావడంతో ఆయనను విధుల నుంచి తొలగించారు. ప్రమాదం జరిగిన ప్రాంతం 40ఎజూప్త్ర జోన్‌లో ఉంది. కానీ, కెవిన్ గంటకు 119 కిలోమీటర్ల వేగంతో వాహనం నడిపి జాహ్నవిని ఢీకొట్టగా.. ఆమె 100 అడుగుల దూరం ఎగిరిపడినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి.




దిల్లీ: ఏపీ మద్యం కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రాజ్ కెసిరెడ్డి దాఖలు చేసిన రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఏపీ మద్యం కుంభకోణం చాలా పెద్దదని.. అధికారులు కుమ్మక్కు కాకపోతే ఇలాంటివి జరగవని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. వారిని అరెస్ట్ చేయకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రభుత్వానికి రాజ్ కెసిరెడ్డి సలహాదారు మాత్రమేనని ఆయన తరఫు న్యాయవాది తెలపగా.. ఆ వాదనను సీజేఐ ధర్మాసనం తోసిపుచ్చింది. కెసిరెడ్డి సలహాదారు మాత్రమే కాదని.. మొత్తం స్కామ్‌కు ఆయనే ఆర్కిటెక్ట్ అని వ్యాఖ్యానించింది. పదవిలో ఉన్నవారి అండ లేకుంటే అధికారులు ఇలా చేయలేరంది. కెసిరెడ్డి జైలులో ఉండి ఇప్పటికే 10 నెలలు గడిచిపోయానని.. సప్లిమెంటరీ ఛార్జ్‌షీట్లు కూడా దాఖలు చేశారని ఆయన తరఫు న్యాయవాది తెలిపారు.


ఏం కాదని.. మరికొంతకాలం జైలులో ఉండనీయండని జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. కెసిరెడ్డికి రెగ్యులర్ బెయిల్ ఇచ్చేందుకు ధర్మాసనం ససేమిరా అంటూ పిటిషన్‌ను డిస్మిస్ చేసేందుకు సిద్ధమైంది. అయితే పిటిషన్‌ను ఉపసంహరించుకుంటామని కెసిరెడ్డి తరఫు న్యాయవాది పేర్కొనడంతో అనుమతించింది.

## సంక్రాంతి లక్కీడ్రా కేసు.. అంబటి రాంబాబుకు 14 రోజుల రిమాండ్



గుంటూరు: సంక్రాంతి సంబరాల లక్కీడ్రా కేసులో వైకాపా నేత అంబటి రాంబాబుకు(గూఎఫ్‌ఆ ఘుఎఘుఎబ) 14 రోజుల రిమాండ్ విధిస్తూ గుంటూరు ప్రిన్సిపల్ కోర్టు న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. వైకాపా హయాంలో మంత్రి హోదాలో సత్తెనపల్లి నియోజకవర్గంలో సంక్రాంతి సంబరాల పేరిట సాగించిన అక్రమ వసూళ్లపై నమోదైన కేసులో గుంటూరు ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి ఎం.కుముదిని బుధవారం పీటీ వారంట్ జారీ చేశారు. ఈ నెల 18లోగా కోర్టులో హాజరుపరచాలని ఆదేశించారు. దీంతో ఇవాళ రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి పీటీ వారెంట్‌పై తీసుకొచ్చి గుంటూరు కోర్టులో హాజరు పర్చారు. కేసు వివరాలు పరిశీలించిన న్యాయమూర్తి రాంబాబుకు 14 రోజుల రిమాండ్ విధిస్తూ ఆదేశాలిచ్చారు. కోర్టు ఆదేశాల మేరకు రాంబాబును రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. ఇదీ కేసు నేపథ్యం.. 2023 జనవరిలో అంబటి రాంబాబు మంత్రి హోదాలో సత్తెనపల్లిలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఇందుకోసం అక్కడి వాలంటీర్ల ద్వారా పింఛనుదారులకు నెలవారీగా ఇచ్చే పింఛను మొత్తం నుంచి రూ.200 చొప్పున మినహాయించుకుని రెండేసి లాటరీ టికెట్లు ఇచ్చారు. సంక్రాంతి రోజు లాటరీ తీసి బహుమతులు పంచారు. ఇది చట్టవిరుద్ధమని గుంటూరు జిల్లా జనసేన అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు గుంటూరు ప్రధాన సీనియర్ సివిల్ కోర్టులో ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు అప్పట్లో సత్తెనపల్లి పట్టణ పోలీసులు రాంబాబుతోపాటు మరికొందరిపై కేసు నమోదు చేశారు.

## విద్యాసంస్థల్లో వసతులకు ప్రతిపాదనలు.. త్వరలో పనులు పూర్తి: మంత్రి లోకేశ్



అమరావతి: రాష్ట్రంలోని పలు విద్యాసంస్థల్లో వసతుల కోసం ఆర్థికశాఖకు ప్రతిపాదనలు పంపామని.. త్వరలోనే పనులు పూర్తిచేస్తామని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులు సమాధానమిచ్చారు. పుట్టపర్తిలో ట్రిపుల్ ఐటీ ఏర్పాటు, పలు కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని అక్కడి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి కోరారు. దీనికి మంత్రి లోకేశ్ సమాధానమిస్తూ పుట్టపర్తిలో ట్రిపుల్ ఐటీ ప్రతిపాదన లేదని.. ఈ అంశాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

తిరుపతిలో భక్తుల రాక పెరిగినందున తాగునీరు మరింత అవసరమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. గాలేరు నగరి, హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా నీరు అందించే విషయాన్ని పరిశీలించాలని ఆయన కోరారు. దీనికి మంత్రి నిమ్మల రామానాయుడు సమాధానమిచ్చారు. పెరుగుతున్న జనాభా అవసరాలకు తగినట్లు నీటిసరఫరాను పెంచుతామని చెప్పారు. బొబ్బిలి నియోజకవర్గంలో లోచర్ల శివదావలస ఎత్తిపోతల పథకంపై ఎమ్మెల్యే బేబినాయన ప్రశ్నించగా.. వైకాపా హయాంలో టెండర్లు రద్దు చేసి పనులు నిలిపివేశారని మంత్రి రామానాయుడు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగుల బదిలీపై పోలవరం ఎమ్మెల్యే బాలరాజు ప్రశ్నించారు. దీనికి మంత్రి సంధ్యారాణి సమాధానం చెప్పారు. వైకాపా ప్రభుత్వ హయాంలో కోర్టు కేసుల పరిష్కారానికి చొరవ తీసుకోనందువల్ల సమస్యలు వచ్చాయన్నారు. దీనిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## తెదేపా ఎమ్మెల్యే కొలికపూడికి పల్లా శ్రీనివాస్ తీవ్ర హెచ్చరికలు



అమరావతి: తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్‌తో తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ సమావేశమయ్యారు. అసెంబ్లీ లాబీలో కొలికపూడితో ఆయన మాట్లాడారు. కొలికపూడి వ్యవహార శైలిపై విమర్శలు వస్తున్న నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఆదేశాలుగా ఆయనకు పల్లా తీవ్ర హెచ్చరికలు చేశారు. పార్టీ లేకపోతే వ్యక్తిగతంగా జీరో అనే విషయాన్ని గుర్తించి ప్రవర్తించాలని హితవు పలికారు. పార్టీ క్రమశిక్షణ దాటి ప్రవర్తిస్తే చూస్తూ ఊరుకునేందుకు సీఎం సిద్ధంగా లేరన్నారు. ఎన్నిసార్లు మందలించినా పద్ధతి మార్చుకోకుండా తప్పుల మీద తప్పులు చేస్తే పార్టీ.. ఎమ్మెల్యేగా గుర్తించడం మానేస్తుందని పల్లా శ్రీనివాస్ స్పష్టం చేశారు. వాట్సప్‌లో పిచ్చి స్టేటస్‌లతో ఎవరిపై పోరాటం చేస్తున్నారని పల్లా నిలదీశారు. అనుభవరాహిత్యంతో పొరపాట్లు జరుగుతున్నాయని కొలికపూడి ఆయనకు వివరణ ఇచ్చారు. సీనియర్లు తనకు మార్గనిర్దేశం చేయాలని కోరారు.




## చంద్రబాబు కుటుంబసభ్యుల ప్రతిభపై అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే

అమరావతి, ఫిబ్రవరి 12: ఏపీ శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి జనసేన పార్టీ తరఫున ధన్యవాదాలు తెలిపే సందర్భంగా ఆ పార్టీ నేత, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ కీలక వ్యాఖ్యలు చేశారు. మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌కు భారతరత్న వచ్చేలా కృషి చేయాలన్నారు.

ఎన్టీఆర్‌కు భారతరత్న ఇస్తే ఆంధ్రులకు, తెలుగు జాతికి గౌరవం చేకూరినట్టు అవుతుందని అన్నారు. దీనిపై తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని అసెంబ్లీని ఎమ్మెల్యే కోరారు.

**చంద్రబాబు కుటుంబసభ్యుల ప్రతిభపై..** అలాగే, చంద్రబాబు నాయుడు కుటుంబ సభ్యుల ప్రతిభను ప్రత్యేకంగా ప్రస్తావించారు ఎమ్మెల్యే. మంత్రి నారా లోకేశ్ కుమారుడు నారా దేవాన్ష్ చెస్ రంగంలో అద్భుత సాధన చేశారని తెలిపారు. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో 'ఫాస్టెస్ట్ చెక్‌మేట్ సాల్వర్'గా రికార్డు సృష్టించారని తెలిపారు. 9 చెస్ బోర్డులపై 32 పాన్‌లను 5 నిమిషాల్లో దేవాన్ష్ సాల్వ్ చేసి రికార్డు నెలకొల్పారని ఎమ్మెల్యే అన్నారు. నారా భువనేశ్వరికి 2025లో 'అవుట్‌స్టాండింగ్ డెయిరీ ప్రొఫెషనల్ అవార్డు'ను ఇండియన్ డెయిరీ అసోసియేషన్ ఇచ్చిందని అన్నారు. నారా బ్రాహ్మణికి గోల్డెన్ పీకాక్ ఎక్సలెన్స్ అవార్డు, మోస్ట్ పవర్‌ఫుల్ ఉమెన్ ఇన్ ఇండియా, యూకే కార్పొరేట్ ఎక్సలెన్స్ అవార్డులు లభించాయన్నారు. ఈ అవార్డులు నారా కుటుంబ సభ్యుల ప్రతిభకు అద్దం పడుతున్నాయని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు.

**ట్రిపుల్ ఇంజిన్ సర్కార్...** రాష్ట్రం.. 25 శాతం పెట్టుబడులతో పాటు దేశ గ్రోత్ రేటును అధిగమించినట్లు ఎమ్మెల్యే చెప్పారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల మధ్య సమన్వయంతో 'ట్రిపుల్ ఇంజిన్ సర్కార్'గా పనిచేస్తోందని కొనియాడారు. విద్యుత్ ఛార్జీల తగ్గింపు, సీఎంకు బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు వంటివి రాష్ట్రానికి గౌరవం తెచ్చాయన్నారు. విశాఖపట్నంలో సుమారు 5-6 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. విశాఖ ఉక్కు కర్మాగారం లాభాల బాట పట్టేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అత్యంత తక్కువ ఖర్చుతో రూ.5000 కోట్లతో 30 లక్షల ఎకరాలు సాగులోకి తీసుకొచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని చెప్పారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రూ.12 వేల కోట్లతో 4 వేల కిలోమీటర్ల రోడ్లు నిర్మించారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గవర్నర్ ప్రసంగానికి జనసేన తరఫున ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ధన్యవాదాలు తెలిపారు.




## నడిరోడ్డుపై గొడవ.. కారు బానెట్‌పై ప్రత్యర్థి ఉండగానే..

బెంగళూరు, ఫిబ్రవరి 12: నడిరోడ్డుపై ఇద్దరు డ్రైవర్ల మధ్య చోటుచేసుకున్న గొడవ దారుణానికి తెరతీసింది. ఓ కారు డ్రైవర్ .. గూడ్స్ వెహికల్ డ్రైవర్‌ను చంపడానికి ప్రయత్నించాడు. గూడ్స్ వెహికల్ డ్రైవర్ కారు బానెట్‌పై ఉండగానే ఓ కిలోమీటర్ వరకు దూసుకెళ్లిపోయాడు. ఈ సంఘటన కర్ణాటకలో బుధవారం చోటుచేసుకుంది. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బుధవారం మధ్యాహ్నం 12.45 గంటల ప్రాంతంలో ఓల్డ్ ఎయిర్‌పోర్టు రోడ్డుపై కారు, గూడ్స్ వెహికల్ ఢీకొట్టుకున్నాయి. దీంతో కారు డ్రైవర్ సురేశ్, గూడ్స్ వెహికల్ డ్రైవర్ నంజుండల మధ్య గొడవ మొదలైంది. గొడవ చినికి చినికి గాలి వానలా మారింది. ఒకరిపై ఒకరు దాడి చేసుకునే వరకు పరిస్థితి వెళ్లింది. కొద్దిసేపటి తర్వాత సురేశ్ తన కారు తీసుకుని అక్కడినుంచి వెళ్లిపోయే ప్రయత్నం చేశాడు. నంజుండ కారు బానెట్ మీదకు ఎక్కి నిలబడ్డాడు. ఆగ్రహానికి గురైన సురేశ్ కారును వేగంగా ముందుకు పోనిచ్చాడు. నంజుండ కారు బానెట్‌పై పడిపోయాడు. అయినా కూడా సురేశ్ కారును ఆపలేదు. వేగంగా అక్కడినుంచి దూసుకెళ్లిపోయాడు. నంజుండ ప్రాణ భయంతో కారు బానెట్ పట్టుకుని అలాగే ఉండిపోయాడు. కారు ఆపమంటూ కేకలు పెట్టాడు. సురేశ్ ఓ కిలోమీటర్ వెళ్లిన తర్వాత కారును ఆపాడు. ఈ దారుణం చోటుచేసుకున్న సమయంలో సురేశ్ భార్య కూడా కారులోనే ఉంది. ఆ కారు ఆమె పేరు మీదే రిజిస్టర్ అయి ఉంది. ఇక, ఈ సంఘటనపై నంజుండ హలసూరు పోలీసులను ఆశ్రయించాడు. సురేశ్‌పై ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుతం ఈ సంఘటనకు సంబంధించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వీడియోపై స్పందిస్తున్న నెటిజన్లు.. సురేశ్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అతడిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను డిమాండ్ చేస్తున్నారు.

## అమరావతి రాజధాని కాదు.. ఆంధ్రప్రజల భవిష్యత్: ఎమ్మెల్యే వెంకట్రాజు




అమరావతి, ఫిబ్రవరి 12: ఏపీ శాసనసభలో గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ ప్రారంభమైంది. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఈ చర్చను ప్రారంభించారు. ఈ ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించి 20 నెలలు అయిన సందర్భంగా, గవర్నర్ తన ప్రసంగంలో ప్రభుత్వ లక్ష్యాలు, విజయాలను ప్రస్తావించారని ఆయన అన్నారు. వైసీపీ హయాంలోని 'జంగిల్ రాజ్' నుంచి రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం బయటపడేసి స్థిరత్వం తీసుకొచ్చిందని వెంకట్రాజు పేర్కొన్నారు. రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు వంటి అనేక అంశాల్లో పురోభివృద్ధి కనిపిస్తోందని తెలిపారు. అనేక రంగాల్లో గణనీయమైన మార్పు వచ్చిందని గవర్నర్ ప్రసంగంలో పేర్కొన్నారని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని.. తనను తాను సామాజిక సేవకుడిగా ప్రకటించుకున్నారని ఆయన చెప్పారు. ఎడారి ప్రాంతాలను కూడా ఉద్యానవనాలుగా తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో విద్యా విధానం ఒడిదుడుకులు ఎదుర్కొందని.. గత ప్రభుత్వ పాలకుల వ్యవస్థల విధ్వంసం వల్ల అనేక కంపెనీలు రాష్ట్రం నుంచి వెళ్లిపోయాయని ఆయన విమర్శించారు. వైసీపీ హయాంలో మహిళల భద్రత, శాంతిభద్రతలు దారుణమైన పరిస్థితుల్లో ఉన్నాయని ఎమ్మెల్యే వెంకట్రాజు ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం 'సూపర్ సిక్స్' పేరుతో అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. అమరావతి రాజధాని మాత్రమే కాదని.. ఆంధ్రప్రజల భవిష్యత్తు అని ఆయన అన్నారు. నదుల అనుసంధానం, సాగునీరు అందజేయడానికి కృషి చేస్తున్నామని చెప్పారు. గవర్నర్ ప్రసంగానికి పూర్తి మద్దతు తెలియజేస్తున్నామని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పేర్కొన్నారు.

## జగన్ 'ఫిష్ ఆంధ్ర'.. అవినాష్ 'నాటుకోడి'..: తెదేపా నేత బీటెక్ రవి




పులివెందుల: ప్రతిపక్ష నేత హోదా లేదని మాజీ సీఎం జగన్ చెప్పడం ప్రజలను అవమాన పరచడమేనని పులివెందుల తెదేపా ఇన్‌ఛార్జ్ బీటెక్ రవి అన్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యేగా ప్రజల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాల్సిన బాధ్యత ఆయనపై ఉందని చెప్పారు. పులివెందులలో నిర్వహించిన మీడియా సమావేశంలో బీటెక్ రవి మాట్లాడారు. ఈ సందర్భంగా జగన్‌తో పాటు ఎంపీ అవినాష్‌రెడ్డిపై విమర్శలు చేశారు. "పులివెందుల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు త్వరగా పరిష్కారం కావాలంటే అసెంబ్లీలో మాట్లాడటం చాలా అవసరం. ఇక్కడి సమస్యలను గాలికి వదిలి ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు. అరటి రైతులకు గిట్టుబాటు ధర లేదని చంద్రబాబు ప్రభుత్వంపై వైకాపా నేతలు బురదచల్లే ప్రయత్నం చేశారు. ప్రస్తుతం ధరలు బాగా పెరిగాయి. టన్ను అరటికాయలకు రూ.26వేల ధర ఉంది. ఎంపీ అవినాష్‌రెడ్డిని మూడుసార్లు గెలిపించి పార్లమెంట్‌కు పంపిస్తే ప్రజలకు ఉపయోగపడే అంశాలపై మాట్లాడటం లేదు. నాటుకోడి ధరల అంశాన్ని అక్కడ ప్రస్తావించడంపై ప్రజలు నవ్వుకుంటున్నారు. పులివెందుల ప్రాంత అభివృద్ధికి పరిశ్రమలు, ప్రాజెక్టులు తీసుకురావడంలో జగన్ పూర్తిగా విఫలమయ్యారు. గతంలో జగన్ ఫిష్ ఆంధ్ర అంటే.. ఇప్పుడు అవినాష్ నాటుకోడి అంటున్నారు. అభివృద్ధి అంటే ఇదేనా?" అని బీటెక్ రవి నిలదీశారు.

చురకలు

## సంపాదకీయం

### అవిశ్వాసం తీర్మానంలో లోపాలు...తిరస్కరిస్తారా ?

లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా మీద అవిశ్వాసం తీర్మానం విపక్షాలు పెట్టాయి. దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత లోక్ సభ స్పీకర్ మీద అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడుతున్నారు. చివరిగా చూస్తే రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉండగా ఆనాటి లోక్ సభ స్పీకర్ బలరాం జక్కడ్ మీద విపక్షాలు అన్నీ కలసి అవిశ్వాసం పెట్టాయి. ఆ తీర్మానం వీగిపోయింది. కానీ అది చరిత్రలో నిలిచిపోయింది. మళ్ళీ ఇన్నేళ్ళ తరువాత ఓం బిర్లా మీద అవిశ్వాస తీర్మానం పెట్టే పరిస్థితి వచ్చింది.

**ఓం బిర్లా రికార్డు :** లోక్ సభ స్పీకర్ గా వరసగా రెండు సార్లు కొనసాగడం ఒక రికార్డుగా ఓం బిర్లాకు ఉంది. ఆయన 2019 నుంచి 2014 వరకూ ఒక టెర్మ్ లో విజయవంతంగా పనిచేశారు. దాంతో ఆయనకే మరోసారి చాన్స్ ఇవ్వాలని బీజేపీ అనుకుంది. అలా 2024 నుంచి మరోసారి ఆయన లోక్ సభ స్పీకర్ గా కార్యక్రమాలు నడుపుతున్నారు. గత టెర్మ్ లో కూడా సాగు నీటి చట్టాల మీద అనేక సెషన్లలో అధికార ఎన్ డీయే విపక్ష ఇండియా కూటమి మధ్య తీవ్రమైన గ్యాప్ ఏర్పడి సభా కార్యక్రమాలు మొత్తం వాయిదాలతోనే సాగాయి. అయినా ఓం బిర్లా మీద విపక్షాల చూపు పడలేదు, ఈసారి మాత్రం కేవలం ఇరవై నెలల వ్యవధిలోనే ఓం బిర్లా మీద అవిశ్వాసం అంటే ఆయన ఎంతో నొచ్చుకున్నట్లుగా చెబుతున్నారు. దాంతో ఇది కూడా రికార్డుగానే ఉంది. ఇక పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు అయితే ఇది లోక్ సభ స్పీకర్ ఆఫీసు గౌరవాన్ని తగ్గించడమే అని ఫైర్ అయ్యారు.

**లోపాలతోన్న నోటీసు :** ఇదిలా ఉంటే స్పీకర్ మీద విపక్షాలు ఇచ్చిన అవిశ్వాస తీర్మానం నోటీసులో ఎన్నో లోపాలు ఉన్నాయని లోక్ సభ ఆఫీసు గుర్తించింది. మామూలుగా అయితే ఈ నోటీసుని తిరస్కరిస్తారు. కానీ లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా మాత్రం అలా చేయవద్దని నోటీసులో ఉన్న లోపాలను సవరించాలని లోక్ సభ సెక్రటేరియట్ కి సూచించారు అని అంటున్నారు. ఇంతకీ నోటీసులో లోపాలు ఏమిటి అంటే కొన్ని విషయాలను కొన్ని సందర్భాలను అనేక సార్లు పదే పదే సభ్యులు ప్రస్తావించారు అని అంటున్నారు.

**సవరించిన తరువాత డేట్ :** ఇక లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా ఆ నోటీసుని సవరించిన తరువాత నిబంధనల ప్రకారం దానిని పరిశీలిస్తామని అధికారులకు చెప్పినట్లుగా తెలుస్తోంది. మార్చి 9 నుంచి పార్లమెంట్ రెండవ విడత బడ్జెట్ సెషన్ స్టార్ట్ అవుతోంది. దాంతో తొలి రోజునే స్పీకర్ మీద అవిశ్వాసం తీర్మానం చర్చ ఉంటుందని అంటున్నారు. ఒక రోజా లేదా రెండు రోజులా అన్నది కూడా నిర్ణయిస్తారు. ఆ మీదట ఫలితం బట్టి లోక్ బిర్లా తిరిగి స్పీకర్ చెయిర్ లో ఆశీనులు అవుతారు అని అంటున్నారు.

**ప్యానల్ స్పీకర్లతోనే :** ఇక ఓం బిర్లా బుధవారం నుంచి సభకు దూరంగా ఉండడంతో ప్యానల్ స్పీకర్లతో సభ నడుస్తోంది. బడ్జెట్ మీద చర్చకు ప్యానల్ స్పీకర్ చెయిర్ అనుమతించింది. ఓం బిర్లా తప్పుకున్న తరువాత చర్చకు విపక్షాలు కూడా అంగీకరించి ప్రసంగాలు చేయడం విశేషం. ఇక బడ్జెట్ మీద చర్చలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పాల్గొని రిప్లై ఇచ్చారు. ఇక ఎన్ డీయే నుంచి మంత్రులు హాజరైనా అగ్ర నేతలు అమిత్ షా రాజ్ నాథ్ సింగ్ లాంటి వారు అయితే సభకు రాలేదని అంటున్నారు.


## మహిళా శక్తి... భారత పురోగతికి పునాది - సమాజ మార్పుకు మహిళా చైతన్యం - ఫిబ్రవరి 13...జాతీయ మహిళా దినోత్సవం




భారతదేశ సామాజిక చరిత్రలో మహిళల పాత్రను, వారి సాధనలను, సమానత్వం కోసం సాగిన పోరాటాన్ని స్మరించుకునే ముఖ్యమైన సందర్భాల్లో జాతీయ మహిళా దినోత్సవం ఒక ప్రత్యేక స్థానం కలిగి ఉంది. ప్రతి ఏటా ఫిబ్రవరి 13న జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకోవడం ద్వారా భారత సమాజం మహిళా శక్తిని గౌరవిస్తూ, వారి కృషి దేశ నిర్మాణంలో ఎంత కీలకమో గుర్తు చేసుకుంటుంది. ఈ దినోత్సవం కేవలం ఉత్సవంగా మాత్రమే కాకుండా, మహిళల హక్కులు, అవకాశాలు, సవాళ్లు, సామాజిక న్యాయం వంటి అంశాలపై ఆలోచనకు ప్రేరేపించే వేదికగా నిలుస్తుంది. భారతదేశం వంటి వైవిధ్యభరిత దేశంలో మహిళల స్థానం, వారి పురోగతి, ఇంకా ఎదుర్కొంటున్న అడ్డంకులు --- ఇవన్నీ ఈ సందర్భంగా విశ్లేషించాల్సిన కీలక అంశాలుగా నిలుస్తాయి. భారతీయ సంస్కృతిలో మహిళను శక్తి స్వరూపిణిగా భావించే పరంపర ఎంతో పురాతనమైనది. వేదకాలంలోనే గార్గి, మైత్రేయి వంటి మహిళలు తత్వచింతనలో విశిష్ట స్థానాన్ని సంపాదించగా, మధ్యయుగాల్లో అనేక సామాజిక ఆంక్షలు మహిళల స్వేచ్ఛను పరిమితం చేశాయి. అయినప్పటికీ, భారత మహిళలు ప్రతి దశలోనూ తమ ప్రతిభను, పట్టుదలను చాటుతూ ముందుకు సాగారు. జాతీయ మహిళా దినోత్సవం ఆ చారిత్రక ప్రయాణాన్ని గుర్తు చేస్తూ, సమాన హక్కుల కోసం జరిగిన ఉద్యమాల ప్రాధాన్యాన్ని వెలుగులోకి తీసుకొస్తుంది. మహిళా విద్య, ఆర్థిక స్వావలంబన, రాజకీయ భాగస్వామ్యం వంటి అంశాలు సమాజ పురోగతికి ఎంత అవసరమో ఈ దినోత్సవం స్పష్టంగా తెలియజేస్తుంది. స్వాతంత్ర్య సమరంలో భారత మహిళల పాత్ర విశేషమైనది. సరోజినీ నాయుడు, అరుణ ఆసఫ్ అలీ, కస్తూర్బా గాంధీ వంటి మహనీయులు దేశ స్వాతంత్ర్యానికి తమ వంతు కృషి చేశారు. వారి త్యాగాలు, నాయకత్వం మహిళల సామాజిక చైతన్యానికి దారితీశాయి. స్వాతంత్ర్యం అనంతరం భారత రాజ్యాంగం మహిళలకు సమాన హక్కులను కల్పించడం ద్వారా సామాజిక న్యాయానికి పునాది వేసింది. అయినప్పటికీ, చట్టబద్ధమైన సమానత్వం ఉన్నప్పటికీ సామాజిక వాస్తవికతలో అసమానతలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ విరుద్ధ పరిస్థితిని సరిచేయడానికి ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, పౌర సమాజం సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉంది. ఆధునిక భారతదేశంలో మహిళలు విద్య, విజ్ఞానం, సాంకేతికత, వైద్యం, క్రీడలు, రాజకీయాలు, వ్యాపారం వంటి అనేక రంగాల్లో అద్భుత విజయాలను సాధిస్తున్నారు. అంతరిక్ష పరిశోధనల్లో నుంచి కార్పొరేట్ నాయకత్వం వరకు మహిళల ప్రతిభ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందుతోంది. అయినప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లో బాలికల విద్య, ఆరోగ్యం, పోషణ, ఉపాధి అవకాశాల విషయంలో ఇంకా అసమానతలు కనిపిస్తున్నాయి. లింగ వివక్ష, బాల్య వివాహాలు, గృహ హింస వంటి సమస్యలు సమాజానికి సవాలుగా మిగిలే ఉన్నాయి. జాతీయ మహిళా దినోత్సవం ఈ సమస్యలను బహిర్గతం చేస్తూ, పరిష్కార మార్గాలపై చర్చకు దోహదం చేస్తుంది. మహిళా సాధికారత అనేది కేవలం ఆర్థిక స్వాతంత్ర్యంతో పరిమితం కాదు; అది సామాజిక గౌరవం, నిర్ణయాధికారం, వ్యక్తిగత స్వేచ్ఛ, భద్రత వంటి అంశాల సమాహారం. మహిళలు కుటుంబం, సమాజం, దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, వారి కృషికి తగిన గుర్తింపు లభించడం చాలా సందర్భాల్లో కష్టసాధ్యమవుతోంది. ఈ నేపథ్యంలో జాతీయ మహిళా దినోత్సవం మహిళల శ్రమను, మేధస్సును, నాయకత్వాన్ని గౌరవించే సాంస్కృతిక చైతన్యాన్ని పెంపొందిస్తుంది. మహిళలపై ఉన్న మూఢనమ్మకాలు, సామాజిక పరిమితులను అధిగమించడానికి విద్య, చట్టబద్ధమైన అవగాహన, సామాజిక మద్దతు అత్యంత అవసరం. ప్రభుత్వ విధానాలు మహిళా సంక్షేమానికి కీలకంగా మారాయి. స్వయం సహాయక సంఘాలు, మహిళా ఉపాధి పథకాలు, ఆరోగ్య బీమా కార్యక్రమాలు, బాలికల విద్యను ప్రోత్సహించే పథకాలు మహిళల జీవన ప్రమాణాలను మెరుగు పరుస్తున్నాయి. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం ద్వారా రాజకీయ భాగస్వామ్యాన్ని పెంచడం కూడా ఒక ముఖ్యమైన ముందడుగు. అయితే, విధానాల అమలు సమర్థవంతంగా జరిగినప్పుడే లక్ష్యాలు నెరవేరేవు. అందుకే అవగాహన, పర్యవేక్షణ, సమాజ భాగస్వామ్యం కీలకం. మహిళలపై హింస, వివక్ష వంటి సమస్యలను నిర్మూలించడానికి కేవలం చట్టాలు సరిపోవు; సామాజిక దృక్పథం మారాలి. కుటుంబ స్థాయిలోనే సమానత్వ భావనను పెంపొందించడం ద్వారా భవిష్యత్ తరాలకు సానుకూల దిశానిర్దేశం చేయవచ్చు. పాఠశాల విద్యలో లింగ సమానత్వంపై అవగాహన కల్పించడం, మీడియా ద్వారా సానుకూల సందేశాలు పంపించడం, సమాజంలో ఆదర్శ మహిళల కథనాలను ప్రచారం చేయడం ద్వారా చైతన్యం పెరుగుతుంది. జాతీయ మహిళా దినోత్సవం ఈ దిశగా సమాజాన్ని ఆలోచింపజేసే వేదికగా నిలుస్తుంది. ఆర్థికాభివృద్ధిలో మహిళల పాత్రను గుర్తించడం అత్యంత అవసరం. మహిళల ఉపాధి అవకాశాలు పెరిగితే కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపడటమే కాకుండా దేశ ఆర్థిక వృద్ధికి కూడా దోహదం చేస్తుంది. సూక్ష్మ, చిన్న పరిశ్రమలు, వ్యవసాయం, సేవారంగం వంటి విభాగాల్లో మహిళల భాగస్వామ్యం పెరుగుతోంది. డిజిటల్ సాంకేతికత మహిళలకు కొత్త అవకాశాలను తెరుస్తోంది. ఆన్‌లైన్ వ్యాపారం, నైపుణ్యాభివృద్ధి శిక్షణ, స్వయం ఉపాధి కార్యక్రమాలు మహిళల స్వావలంబనకు బాటలు వేస్తున్నాయి. ఈ మార్పులు సమాజంలో మహిళల స్థానాన్ని బలపరుస్తున్నాయి. జాతీయ మహిళా దినోత్సవం ఒక స్మరణిక మాత్రమే కాదు --- అది సమానత్వం, న్యాయం, గౌరవం అనే విలువలను పునరుద్ఘాటించే సామాజిక ఉద్యమం. మహిళల సాధికారత లేకుండా సమగ్ర అభివృద్ధి సాధ్యం కాదు. సమాజంలోని ప్రతి వర్గం మహిళల హక్కులను గౌరవిస్తూ, వారికి అవకాశాలు కల్పించే దిశగా కృషి చేయాలి. కుటుంబం నుంచి ప్రభుత్వ వ్యవస్థల వరకు ప్రతి స్థాయిలో మహిళా భాగస్వామ్యం పెరిగితేనే సమాజం సుస్థిరంగా అభివృద్ధి చెందుతుంది. భారత మహిళల చరిత్ర పోరాటాల, విజయాల, ఆశయాల సమాహారం. ఫిబ్రవరి 13న జరుపుకునే జాతీయ మహిళా దినోత్సవం ఆ చరిత్రను స్మరించుకుంటూ భవిష్యత్తు దిశగా అడుగులు వేయడానికి ప్రేరణనిస్తుంది. మహిళల ప్రతిభకు, శ్రమకు, ఆత్మవిశ్వాసానికి సముచిత గౌరవం లభించినప్పుడే నిజమైన సామాజిక సమానత్వం సాధ్యమవుతుంది. ఈ దినోత్సవం మనకు ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తుంది --- మహిళా సాధికారత అనేది దేశ అభ్యున్నతికి పునాది. మహిళలను గౌరవించే సమాజమే శక్తివంతమైన, సమానత్వభరితమైన భవిష్యత్తును నిర్మించగలదు.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

## ముద్దు వెనుక భావోద్వేగ బంధం - ముద్దులో మానవ అనుబంధాల మాధుర్యం - ఫిబ్రవరి 13... కిస్ డే సందర్భంగా....



వాలెంటైన్ వీక్‌లో ప్రతి రోజూ ప్రేమను వ్యక్తపరచడానికి ఒక ప్రత్యేక అర్థం, ఒక ప్రతీకాత్మక సందేశం ఉంటుంది. ఆ క్రమంలో ఆరవ రోజైన ఫిబ్రవరి 13ను "కిస్ డే"గా ప్రపంచ వ్యాప్తంగా అనేక మంది జరుపు కుంటారు. కిస్ అనేది కేవలం శారీరక స్పర్శ మాత్రమే కాదు; అది అనురాగం, నమ్మకం, ఆప్యాయత, పరస్పర గౌరవం, భావోద్వేగ అనుబంధానికి ప్రతీకగా భావించ బడుతుంది. సమాజం, సంస్కృతి, వ్యక్తిగత విలువలు మారుతున్న ఈ కాలంలో "కిస్ డే" అనే భావనను కేవలం ఒక పాశ్చాత్య ఉత్సవంగా కాకుండా, మానవ సంబంధాల లోతైన భావ వ్యక్తీకరణగా కూడా విశ్లేషించాల్సిన అవసరం ఉంది. మనిషి భావాలను మాటలతో మాత్రమే కాదు, హావభావాలతో కూడా వ్యక్తపరుస్తాడు. వాటిలో అత్యంత సున్నితమైన, బలమైన సంకేతాల్లో ఒకటి ముద్దు. శిశువు పుట్టిన క్షణం నుంచి తల్లి తన ప్రేమను ముద్దు ద్వారా వ్యక్తం చేస్తుంది. అదే విధంగా తండ్రి, కుటుంబ సభ్యులు, స్నేహితులు చూపించే ముద్దు అనేది రక్షణ, ఆదరణ, అనుబంధానికి ప్రతీక. ఈ నేపథ్యంలో కిస్ అనేది కేవలం ప్రేమజంటల మధ్య ఉండే చర్య మాత్రమే కాదు; అది మానవ సంబంధాల సహజ విస్తరణ. కిస్ డే ఈ సహజ భావ వ్యక్తీకరణకు ఒక ప్రతీకాత్మక గుర్తుగా నిలుస్తుంది. చారిత్రకంగా చూస్తే ముద్దు అనేది అనేక సంస్కృతుల్లో భిన్నార్థాలను కలిగి ఉంది. కొన్ని దేశాల్లో అది ప్రేమకు సంకేతం కాగా, మరికొన్ని సంస్కృతుల్లో గౌరవం, ఆతిథ్యానికి సూచిక. భారతీయ సంస్కృతిలో కూడా ఆప్యాయతను ప్రత్యక్షంగా వ్యక్తపరచడం కన్నా భావాల ద్వారా తెలియ జేయడం ఎక్కువగా కనిపిస్తుంది. అయినప్పటికీ కాలానుగుణంగా యువతలో భావవ్యక్తీకరణ పద్ధతులు మారుతున్నాయి. గ్లోబలైజేషన్, మీడియా ప్రభావం, సామాజిక మాధ్యమాల విస్తరణ వల్ల పాశ్చాత్య ఉత్సవాలపై ఆసక్తి పెరిగింది. ఈ మార్పులో భాగంగానే కిస్ డే కూడా పట్టణ యువతలో ఒక సాంస్కృతిక చర్చాంశంగా మారింది. మానసిక శాస్త్ర పరంగా చూస్తే ముద్దు అనేది భావోద్వేగ అనుబంధాన్ని బలపరచే చర్యగా పరిగణించబడుతుంది. పరిశోధనలు సూచిస్తున్నట్టు, ఆప్యాయ స్పర్శల వల్ల ఒత్తిడి తగ్గుతుంది, విశ్వాసం పెరుగుతుంది, పరస్పర బంధం దృఢమవుతుంది. మానవ మెదడులో సంతోష హార్మోన్ల విడుదలకు ఇది దోహదపడుతుంది. అందుకే ప్రేమజంటలు మాత్రమే కాదు, కుటుంబ సభ్యుల మధ్య కూడా ఆప్యాయ స్పర్శలు భావోద్వేగ ఆరోగ్యానికి సహాయ పడతాయని నిపుణులు చెబుతారు. కిస్ డే ఈ కోణాన్ని గుర్తుచేసే ఒక సందర్భంగా కూడా భావించవచ్చు. అయితే కిస్ డే గురించి చర్చించేటప్పుడు సామాజిక బాధ్యతను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ప్రతి వ్యక్తికి తన వ్యక్తిగత పరిమితులు, సంస్కార విలువలు ఉంటాయి. కిస్ అనే చర్య పరస్పర సమ్మతితో, గౌరవంతోనే జరగాలి. బలవంతం, ఒత్తిడి, సామాజిక ప్రదర్శన కోసం చేసే చర్యలు సంబంధాల విలువను తగ్గిస్తాయి. నిజమైన ప్రేమ అనేది పరస్పర అంగీకారం, గౌరవం, భావాల పట్ల సున్నితత్వంతో నిలబడాలి. ఈ దృక్కోణం కిస్ డే సందర్భంగా యువతకు ముఖ్యమైన సందేశాన్ని అందిస్తుంది. డిజిటల్ యుగంలో ప్రేమ. వ్యక్తీకరణ రూపాలు విస్తృతమయ్యాయి. ఎమోజీలు, సందేశాలు, సోషల్ మీడియా పోస్టులు భావాలను పంచుకునే వేదికలుగా మారాయి. అయితే ప్రత్యక్ష అనుబంధం, మానవ స్పర్శ ఇచ్చే అనుభూతి ప్రత్యేకమైనది. కిస్ డే సందర్భంలో చాలామంది తమ భాగస్వామికి ప్రేమను గుర్తుచేసే సందేశాలు, కానుకలు, సమయం కేటాయించడం వంటి మార్గాలను ఎంచుకుంటారు. ఇది సంబంధాల్లో భావోద్వేగ సమీపతను పెంపొందించే ఒక అవకాశంగా మారుతుంది. సాంస్కృతికంగా చూస్తే భారతీయ సమాజం ఇంకా సంప్రదాయ విలువలకు ప్రాధాన్యం ఇస్తుంది. అందువల్ల పాశ్చాత్య ఉత్సవాల స్వీకరణలో ఒక మితి అవసరమనే అభిప్రాయం కొందరిలో ఉంది. మరోవైపు యువత వ్యక్తిగత స్వేచ్ఛ, భావ వ్యక్తీకరణకు ప్రాముఖ్యత ఇస్తోంది. ఈ రెండు దృక్కోణాల మధ్య సమతుల్యత అవసరం. ప్రేమను వ్యక్తపరచడం అనేది సహజ మానవ గుణం; అయితే అది సమాజపు సంస్కార విలువలను గౌరవించే విధంగా ఉండాలి. కిస్ డేను కేవలం ఒక రోజుగా కాకుండా, సంబంధాల్లో ఆప్యాయత, గౌరవం, పరస్పర నమ్మకాన్ని గుర్తుచేసే సందర్భంగా చూడవచ్చు. ప్రేమ అనేది మాటల్లోనే కాదు, చిన్న చిన్న హావ భావాల్లోనూ వ్యక్తమవుతుంది. ఒక ముద్దు అనేది "నీవు నాకు ముఖ్యమైనవాడివి" అనే భావాన్ని మౌనంగా తెలియజేసే సంకేతం. అదే సమయంలో ప్రతి వ్యక్తి పరిమితులను గౌరవించడం ప్రేమ యొక్క అసలైన విలువ. మొత్తంగా చూస్తే కిస్ డే ఆధునిక ప్రేమ వ్యక్తీకరణలో ఒక ప్రతీకాత్మక భాగం. ఇది పాశ్చాత్య ప్రభావంతో వచ్చినప్పటికీ, మానవ అనుబంధాల లోతైన భావాన్ని గుర్తుచేస్తుంది. పరస్పర గౌరవం, సమ్మతి, భావోద్వేగ సున్నితత్వం ఉంటేనే ఈ రోజు యొక్క అసలు అర్థం నెరవేరుతుంది. ప్రేమను సంస్కారంతో, బాధ్యతతో వ్యక్తపరచడం ద్వారా సంబంధాలు మరింత బలపడతాయి. కిస్ డే మనకు చెప్పే ప్రధాన సందేశం ఇదే --- ప్రేమ అనేది కేవలం ఒక ఉత్సవం కాదు; అది పరస్పర గౌరవంతో నడిచే జీవన విలువ.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

## మున్సిపల్ ఓట్ల లెక్కింపు: పట్టణ ప్రజాస్వామ్యానికి కీలక ఘట్టం - కౌంటింగ్ టేబుల్‌పై నగర పాలన భవిష్యత్

నేడు మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు దేశవ్యాప్తంగా పట్టణ ప్రజాస్వామ్యానికి ఒక కీలక ఘట్టంగా నిలుస్తోంది. గత కొన్ని వారాలుగా జరిగిన ప్రచార హోరు, వ్యూహాత్మక రాజకీయ కసరత్తులు, అభ్యర్థుల మధ్య పోటీ, ఓటర్ల తీర్పు --- ఇవన్నీ ఇప్పుడు ఒకే కేంద్ర బిందువుకు చేరుకున్నాయి: కౌంటింగ్ టేబుల్. పోలింగ్ ముగిసిన నాటి నుంచి పార్టీల శిబిరాల్లో నెలకొన్న ఉత్కంఠ, ఆశలు--ఆందోళనలు నేడు తారాస్థాయికి చేరుకున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలు సాధారణంగా చిన్న రాజకీయ సంఘటనలుగా భావించినప్పటికీ, వాస్తవానికి ఇవే పట్టణ పాలనకు పునాది వేస్తాయి. నీటి సరఫరా నుంచి పారిశుధ్యం వరకు, రోడ్లు నుంచి ప్రజా ఆరోగ్య సేవల వరకు, పట్టణ జీవన ప్రమాణాలను నిర్ణయించేది ఈ స్థానిక పాలనా వ్యవస్థే. అందువల్ల ఓట్ల లెక్కింపు ప్రక్రియ కేవలం విజయం--పరాజయాల గణాంకం మాత్రమే కాదు; పట్టణ ప్రజల అభిలాషల ప్రతిబింబం. ఈ ఎన్నికల ప్రాధాన్యతను అర్థం చేసుకోవాలంటే పోలింగ్ దశను పరిశీలించాల్సిందే. లక్షలాది మంది పట్టణ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించడం ప్రజాస్వామ్యంపై పెరుగుతున్న విశ్వాసాన్ని సూచిస్తోంది. కొన్ని ప్రధాన రాష్ట్రాల్లో నమోదైన భారీ పోలింగ్ శాతం రాజకీయ పరిశీలకులను ఆశ్చర్యానికి గురి చేసింది. పట్టణ ప్రాంతాల్లో సాధారణంగా కనిపించే నిరాసక్తతకు భిన్నంగా, ఈసారి యువత, మహిళలు, మధ్యతరగతి ఉద్యోగులు కూడా చురుకుగా పాల్గొనడం గమనార్హం. ఇది స్థానిక సమస్యలపై ప్రజల్లో పెరిగిన అవగాహనకు సంకేతం. పట్టణ మౌలిక వసతులు, పన్నుల వినియోగం, పర్యావరణ పరిరక్షణ, ట్రాఫిక్ నిర్వహణ వంటి అంశాలు ఓటర్ల నిర్ణయాన్ని ప్రభావితం చేశాయి. ఓట్ల లెక్కింపు ప్రక్రియ పారదర్శకంగా, నియమ నిబంధనలకు లోబడి సాగేందుకు ఎన్నికల యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. కౌంటింగ్ కేంద్రాల్లో బహుళ స్థాయి భద్రత, సీసీటీవీ పర్యవేక్షణ, అభ్యర్థుల ప్రతినిధుల సమక్షంలో లెక్కింపు వంటి చర్యలు అమల్లో ఉన్నాయి. ప్రతి రౌండ్ ముగిసిన తర్వాత ఫలితాలను అధికారికంగా నమోదు చేయడం, అభ్యంతరాలకు అవకాశం కల్పించడం వంటి విధానాలు ప్రజాస్వామ్య నమ్మకాన్ని బలపరుస్తాయి. సాంకేతిక పరిజ్ఞాన వినియోగం కూడా లెక్కింపు వేగం, ఖచ్చితత్వాన్ని పెంచింది. ఈ ప్రక్రియలో చిన్న పొరపాటు కూడా రాజకీయంగా పెద్ద చర్చకు దారితీయగలదనే అవగాహనతో అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. పార్టీల దృష్టిలో ఈ ఎన్నికలు కేవలం స్థానిక అధికార పోరాటం మాత్రమే కాదు; భవిష్యత్ రాజకీయ దిశను సూచించే సంకేతాలు. ప్రధాన జాతీయ, ప్రాంతీయ పార్టీలు పట్టణ ఓటర్ల మద్దతును తమ రాజకీయ బలం కొలమానంగా చూస్తున్నాయి. ప్రచార దశలో అభివృద్ధి, సంక్షేమం, పారదర్శక పాలన, అవినీతి నిరోధం వంటి అంశాలు ప్రధాన అజెండాగా నిలిచాయి. ఇప్పుడు ఆ వాగ్దానాలకు ఓటర్లు ఇచ్చిన తీర్పు వెల్లడవుతోంది. కౌంటింగ్ కేంద్రాల వెలుపల పార్టీ కార్యకర్తల ఆత్రుత, అభ్యర్థుల ఉద్విగ్నత, నాయకత్వం నుంచి వస్తున్న ప్రకటనలు --- ఇవన్నీ రాజకీయ ఉష్ణోగ్రతను పెంచుతున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో నమోదైన గణాంకాలు ఈ ఎన్నికల ఉత్కంఠను స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లో నమోదైన అధిక ఓటింగ్ శాతం ప్రజల పాల్గొనడాన్ని తెలియజేస్తోంది. వేల సంఖ్యలో అభ్యర్థులు పోటీలో నిలవడం స్థానిక రాజకీయాల్లో పెరిగిన పోటీని సూచిస్తోంది. అనేక స్థానాల్లో గెలుపు--ఓటమి తేడా స్వల్పంగా ఉండొచ్చన్న అంచనాలు ఉన్నాయి. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి కొత్త అభ్యర్థులు, యువ నాయకులు ఎక్కువగా రంగంలోకి రావడం కూడా విశేషం. ఇది పట్టణ రాజకీయాల్లో తరాల మార్పుకు సంకేతంగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఓట్ల లెక్కింపు దశలో ప్రతి రౌండ్ కీలకం. ప్రారంభ రౌండ్లలో ఆధిక్యం సాధించిన పార్టీ చివరికి విజయం సాధిస్తుందనే హామీ లేదు. పోస్టల్ బ్యాలెట్లు, సేవా ఓట్లు, చివరి రౌండ్ల లెక్కింపు అనూహ్య మలుపులకు కారణమవుతాయి. అందువల్ల పార్టీల వార్‌రూమ్‌లలో నిరంతర విశ్లేషణ కొనసాగుతోంది. ప్రతి టేబుల్ నుంచి వచ్చే సమాచారం ఆధారంగా వ్యూహాత్మక ప్రకటనలు విడుదలవుతున్నాయి. సోషల్ మీడియా, టెలివిజన్ ఛానెళ్లు, డిజిటల్ వేదికలు క్షణక్షణం నవీకరణలను అందిస్తూ ప్రజల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. ఈ ఎన్నికలు పట్టణ పాలనపై దీర్ఘకాలిక ప్రభావం చూపే అవకాశముంది. గెలిచే ప్రజా ప్రతినిధులు రాబోయే సంవత్సరాల్లో పట్టణ అభివృద్ధి ప్రణాళికలను అమలు చేయాల్సి ఉంటుంది. స్మార్ట్ మౌలిక వసతులు, పారిశుధ్య సంస్కరణలు, నీటి నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ వంటి రంగాల్లో స్పష్టమైన కార్యాచరణ అవసరం. ఓటర్లు ఈ అంశాలపైనే తీర్పు ఇచ్చారని భావించవచ్చు. అందువల్ల విజేతలపై బాధ్యత మరింత పెరుగుతుంది. రాజకీయంగా ఈ ఫలితాలు విస్తృత సందేశాన్ని ఇస్తాయి. పట్టణ ఓటర్ల మూడ్‌ను అంచనా వేసేందుకు పార్టీలు ఈ గణాంకాలను విశ్లేషిస్తాయి. రాబోయే అసెంబ్లీ లేదా పార్లమెంటు ఎన్నికల వ్యూహాలపై కూడా ఇవి ప్రభావం చూపుతాయి. పట్టణ ప్రాంతాల్లో బలమైన పట్టు సాధించిన పార్టీలు తమ రాజకీయ వ్యూహాన్ని విస్తరించే అవకాశముంది. అదే సమయంలో ఆశించిన ఫలితాలు రాకపోతే ఆత్మపరిశీలనకు దారితీస్తాయి. ఓట్ల లెక్కింపు కేవలం గణాంక ప్రక్రియ మాత్రమే కాదు; ప్రజాస్వామ్య విశ్వాసానికి ప్రతీక. ప్రతి ఓటు విలువైనదనే భావనను ఈ దశ మరొకసారి గుర్తుచేస్తుంది. స్వల్ప తేడాలతో నిర్ణయించబడే విజయాలు ప్రజాస్వామ్యంలో ఓటు శక్తిని ప్రతిబింబిస్తాయి. ఓటర్లు ఇచ్చిన తీర్పు రాజకీయ నాయకత్వానికి మార్గదర్శకం. ప్రజల ఆశలు, ఆవశ్యకతలు, స్థానిక సమస్యలపై స్పష్టమైన సంకేతం. నేడు కౌంటింగ్ కేంద్రాల వద్ద నెలకొన్న ఉత్కంఠ, రాజకీయ శిబిరాల్లో ఉత్సాహం, ప్రజల్లో ఆసక్తి --- ఇవన్నీ ప్రజాస్వామ్య జీవంతత్వాన్ని సూచిస్తున్నాయి. ఫలితాలు ఏవైనా కావొచ్చు; ముఖ్యమైనది ప్రజలు పాల్గొన్న ప్రక్రియ. పట్టణ ప్రజాస్వామ్యం బలపడితేనే సమగ్ర అభివృద్ధి సాధ్యం. ఈ ఎన్నికలు అదే దిశగా ఒక కీలక అడుగు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే సరికి విజేతలు ప్రకటించబడతారు; కానీ అసలు విజయం ప్రజాస్వామ్యానిదే. ప్రజల తీర్పును గౌరవిస్తూ, పట్టణ అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని కొత్త పాలనా అధ్యాయం ప్రారంభమవుతుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# బిల్లు రావాలంటే చేయి తడపాల్సిందే!

కరీంనగర్ :గతవారం ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్లు బిల్లులు మంజూరు చేయడానికి లబ్ధిదారుడి నుంచి హౌసింగ్ ఏఈ రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారులకు చిక్కాడు.కరీంనగర్ జిల్లాలోని గంగాధర మండలంలో ఇందిరమ్మ లబ్ధిదారుడి వివరాలను సంబంధిత యాప్‌లో నమోదు చేయడానికి అక్కడి పంచాయతీ కార్యదర్శి రూ.10 వేలు లంచం డిమాండ్ చేశాడు. లబ్ధిదారుడు ఏసీబీని ఆశ్రయించడంతో.. అధికారులు పంచాయతీ కార్యదర్శిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం మాటున.. జిల్లాలో వసూళ్ల దందా కొనసాగుతోంది. లబ్ధిదారుల ఎంపిక మొదలు.. విడతల వారీగా బిల్లుల చెల్లింపుల్లో వార్డు అధికారులతో సహా కొందరు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇందిరమ్మ ఇళ్లను పునాది వరకు పూర్తిచేస్తే.. రూ.లక్ష, గోడలు నిర్మించిన తర్వాత రూ.లక్ష, పైకప్పు వేస్తే రూ.1.40 లక్షలు, ఇంటి నిర్మాణం పూర్తిచేసిన తర్వాత రూ.లక్ష, నిర్దేశించిన ఇతర నిర్మాణాలు పూర్తయితే మిగిలిన రూ.60 వేలు ప్రభుత్వం చెల్లిస్తోంది. అయితే బిల్లు మంజూరయిన ప్రతీసారీ.. కొందరు లబ్ధిదారుల నుంచి రూ.వేల ల్లో వసూలు చేస్తున్నారు. నుంచి స్థానిక ప్రజాప్రతినిధులు, వార్డు అధికారులకు వాటాలు పంచుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ఇక్కడ వసూళ్లే**

కాశీబుగ్గ ప్రాంతంలో ఇందిరమ్మ ఇళ్ల పేరుమీద వసూళ్ల దందా కొనసాగుతోంది. బిల్లు పడితే చాలు.. స్థానిక ప్రజాప్రతినిధి అనుచరుడొకరు ఒక్కో విడతలో మంజూరయ్యే బిల్లుల్లో నుంచి రూ.10 వేలు చెల్లించకపోతే మిగిలిన బిల్లులు రాకుండా చేస్తామని..



బెదిరింపులకు దిగుతున్నట్లు తెలిసింది. ఈ మొత్తం తతంగంలో స్థానిక వార్డు అధికారి కీలకపాత్ర పోషిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈక్రమం లో స్థానిక వార్డు అధికారిపై అధికారిక పార్టీ నాయకులే జీడబ్ల్యూఎంసీ డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా.. చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. కాశీబుగ్గలోని ఓ డివిజన్ పరిధిలో మొదటి విడతలో 120 ఇందిరమ్మ ఇళ్లు.. రెండో విడతలో 90 ఇళ్లు మంజూరు కాగా.. సుమారు 30 నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. ఇళ్ల నిర్మాణం జరుగుతున్న లబ్ధిదారుల నుంచి స్థానిక ప్రజాప్రతినిధి అనుచరులు ఇప్పటివరకు రూ.లక్షల్లో వసూలు చేశారు.

**అదనపు భారం..**

ఒకేసారి లబ్ధిదారులందరూ ఇళ్ల నిర్మాణం చేపట్టడంతో ధరలు ఆకాశాన్నంటాయి. ఇసుక, సిమెంట్, స్టీలు, ఇటుకలు, కంకర ధరలు గతంతో పోల్చితే రెట్టింపయ్యాయి. నిర్మాణ సామగ్రి ధరల నియంత్రణకు మండలాల వారీగా ఏర్పాటుచేయాలని నిర్ణయించిన ధరల నియంత్రణ కమిటీలు కేవలం నివేదికలకే పరిమితమయ్యాయి. జిల్లా పరిధిలో మొత్తం 12,053 ఇళ్లు మంజూరవగా.. ఇప్పటివరకు 131 ఇళ్లు పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు.

# బడి బస్సు భద్రతెంత?

రంగశాయిపేట : పర్వతగిరి- సంగెం మండలాల పరిధిలో సోమవారం సాయంత్రం జరిగిన ప్రమాదంతో ప్రైవేటు విద్యా సంస్థల బస్సుల భద్రత మరోసారి చర్చనీయాంశమైంది. రోడ్లపై తిరిగే విద్యా సంస్థల బస్సులపై పర్యవేక్షణ, తనిఖీలు లేకపోవడంతో యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించడంతో పాటు సామర్థ్యం లేని వాహనాలను రోడ్లపై తిప్పుతున్నారు. 60 ఏళ్లలోపు అనుభవం ఉన్న డ్రైవర్లు మాత్రమే నడపాల్సి ఉండగా.. ఈ నిబంధనలు పాటించడం లేదు. పైగా తాగి నడుపుతూ.. విద్యార్థుల ప్రాణాలు గాలిలో దీపంలా మార్చుతున్నారు. వరంగల్ జిల్లాలో 325 బస్సులున్నాయి. వీటికి ఏటా నూతన విద్యా సంవత్సరం ప్రారంభంలో సామర్థ్య పరీక్షలు(ఫిట్‌నెస్) సమయంలో మాత్రమే తనిఖీలు చేసి ధ్రువీకరిస్తారు. ఆ తర్వాత వాటి నిర్వహణను యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. నిరంతరం తనిఖీలు చేయాల్సిన ఆర్టీఏ అధికారులు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సిబ్బంది తక్కువ ఉండటంతో పని ఒత్తిడితో సతమతమవుతున్నామని.. తనిఖీలు చేసేంత సమయం లేదని ఓ అధికారి తెలిపారు.



**అవగాహన సదస్సులెక్కడ?**

ప్రతి మూడు నెలలకు ఓసారి డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించాల్సిన ఆర్టీఏ అధికారులు.. ఆ దిశగా ఆలోచించడం లేదు. సోమవారం జరిగిన ప్రమాదంలో స్కూల్ బస్సు డ్రైవర్ తాగి ఉండటం గమనార్హం. పాఠశాల యాజమాన్యమైనా.. గుర్తించి అతడి స్థానంలో మరొకరిని పంపితే ఇద్దరి ప్రాణాలు పోయేవి కావు. మరోవైపు విద్యార్థులను భద్రంగా తీసుకెళ్లి.. సాయంత్రం ఇంటి వద్ద దించుతామంటూ.. పెద్ద మొత్తంలో రవాణా ఫీజు వసూలు చేస్తున్న యాజమాన్యాలు భద్రతా చర్యలు గాలికొదిలేస్తున్నాయి. బడికి వెళ్లిన చిన్నారి క్షేమంగా ఇంటికి వచ్చే వరకు తల్లిదండ్రులు వేయి కళ్లతో ఎదురుచూస్తారు. అధికారులు, స్కూల్ యాజమాన్యాలు ఇప్పటికైనా.. నిబంధనలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# నిఘా నేత్రాలపై నిర్లక్ష్యం



సిరిసిల్ల: జిల్లాలో నిత్యం రద్దీగా ఉండే సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో సీసీ కెమెరాలతో భద్రత పెంచి ప్రజలకు మరింత రక్షణ కల్పించాలని పోలీసులు నిర్ణయించింది. 2021లో రెండు పట్టణాల్లో సీఎస్ఆర్ (కార్పొరేట్ సామాజిక బాధ్యత), ఆలయ పరిధిలో దేవాదాయశాఖ, మరికొన్ని కాలనీల్లో ప్రజల భాగస్వామ్యంతో రెండు వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటిని ఆయా పట్టణాల్లోని పోలీస్‌స్టేషన్లకు అనుసంధానించాల్సి ఉండగా.. అనుసంధానం, డీవీఆర్ స్టోరేజీ తక్కువగా ఉండటంతో అప్పటి కౌన్సిలర్ల ఇళ్లలో, మరికొన్ని సమాజిక భవనాల్లో ఏర్పాటు చేశారు. ఏడాదిలోపే వివిధ కారణాలతో పలు కాలనీల్లో పనిచేయని వాటిని పట్టించుకోని పరిస్థితి. కారణం, సీసీ కెమెరాల నిర్వహణ పురపాలికశాఖ, అటు పోలీసుశాఖ రెండూ చేతులెత్తేశాయి. ఆలోచన మంచిదైనా నిర్వహణలో అలసత్వం చూపుతున్నారు.

**ఠాణాకు డీవీఆర్‌లు..**

సిరిసిల్ల పట్టణంలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద ఉన్న కెమెరాలు మాత్రమే పనిచేస్తున్నాయి. కొన్ని వార్డుల్లో కౌన్సిలర్ల ఇళ్లలో ఏర్పాటు చేసినవి పనిచేస్తున్నాయి. నేరాలు, చోరీలు, ప్రమాదాలు, అఘాయిత్యాలు, అదృశ్య ఘటనలు, ఎన్నికలు, వేడుకల సమయంలో ఘర్షణలు జరిగినప్పుడు సీసీ ఫుటేజీలు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ప్రధానంగా ఎన్నికల సమయంలో మాజీ కౌన్సిలర్ల ఇళ్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల కంట్రోల్ సిస్టమ్‌తో ఆయా వార్డుల్లో డబ్బులు, మద్యం పంపిణీపై నిఘా ఏర్పాటు చేస్తున్నారు. కొన్నిచోట్ల ఈ వ్యవహారం బయటకు రావడంతో పోలీసులకు ఫిర్యాదులు సైతం అందాయి. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదులు అందడంతో పోలీసులు డీవీఆర్‌లను ఠాణాకు తరలించారు.

**నేరాల మూలాలు గుర్తించలేక..**

సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లో శాంతిభద్రతలు పరిరక్షణ ఇబ్బందిగా మారాయి. దొంగతనాలు, హత్యలు, రోడ్డు ప్రమాదాలు జరిగితే ఆధారాలు సేకరించడం పోలీసులకు కష్టతరంగా మారింది. గతేడాది సిరిసిల్ల పట్టణం సాయినగర్‌లోని ఒక కుటుంబం ఇంటికి తాళం వేసి సమీపంలోని ఫంక్షన్‌హాల్‌లో జరుగుతున్న వివాహ వేడుకకు వెళ్లారు. వచ్చి చూసే సరికి తాళాలు పగులగొట్టి ఇంట్లోని ఆభరణాలు, నగదు దోచుకెళ్లారు. మరమగ్గాల కార్ఖానాలో పనిచేస్తున్న ఒక వ్యక్తి నెహ్రూనగర్‌లోని తన ఇంటి ముందు ద్విచక్ర వాహనం నిలిపి, భోజనం చేశారు. బయటకు వచ్చి చూస్తే వాహనం లేదు. సమీపంలోని సీసీ కెమెరాలో చూసినా ఒకవైపు ఉన్న కెమెరా మాత్రమే పనిచేస్తుంది. వాహనం దొంగిలించిన వ్యక్తి ముఖం కనిపించలేదు. పట్టణాల్లో కీలక ప్రదేశాల్లో సీసీ కెమెరాలు లేక రక్షణ కరవైంది.

# ముఖం చాటేస్తే.. ఉపాధి గల్లంతే..!



కొత్తగూడెం : ఉపాధి హామీ పథకంలో అక్రమాలను అరికట్టి, అర్హులైన కూలీలకు న్యాయం చేయటమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం సరికొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. వేతనాల చెల్లింపుల్లో జాప్యం జరగకుండా, దొంగ హాజరుకు తావులేకుండా 'ముఖ గుర్తింపు' విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలుచేస్తోంది. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 26 రాష్ట్రాల్లో ఈ పద్ధతిని అవలంబిస్తోంది. పైలెట్ ప్రాజెక్ట్‌కు తెలంగాణ నుంచి ఖమ్మం జిల్లాను ఎంచుకుంది. (ఈనెల 9న) ప్రారంభమైన ఈ ప్రక్రియ గ్రామీణ ఉపాధి రంగంలో పారదర్శకతకు నాంది పలకనుంది. అయితే ఈవిధానంపై క్షేత్రస్థాయిలో ఇంకా పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవటం వల్ల తొలిరోజు ముఖ హాజరు విధానం అమలుకానట్లు తెలుస్తోంది.

**సవాళ్లు-పరిష్కారాలు**

గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సిగ్నల్ సమస్య ముఖ గుర్తింపు విధానానికి సవాలుగా మారనుంది. ఈ సమస్యను అధిగమించేందుకు.. పని ప్రదేశంలో కూలీల ఫొటోలు తీసుకుని సిగ్నల్ వచ్చే ప్రాంతంలో అప్‌లోడ్ చేసుకునే వెసులుబాటు ఉందని అధికారులు చెబుతున్నారు. ఖమ్మం జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు ద్వారా వచ్చే నివేదిక ఆధారంగానే రాష్ట్రవ్యాప్తంగా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేస్తారు. సిగ్నల్ సమస్యతో పాటు ఇతరత్రా అవరోధాలు ఎదురైనా వాటిని గుర్తించి సరిచేసేందుకు అవకాశముంటుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

**ఏమిటీ మార్పు..**


గతంలో కూలీలందరినీ కలిపి బృందంగా ఫొటో తీసి నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్ఎంఎంఎస్) యాప్‌లో నిక్షిప్తపరిచేవారు. కొత్త విధానం ప్రకారం ఇకపై ప్రతి కూలీ ముఖాన్ని స్కాన్ చేయాల్సి ఉంటుంది.

ఈ-కేవైసీ పూర్తయిన కూలీలను మాత్రమే పని ప్రదేశంలో సాఫ్ట్‌వేర్ గుర్తిస్తుంది. తద్వారా వేరొకరి పేరిట హాజరు వేయటం అసాధ్యమవుతుంది. పని చేసిన కూలీలకే నేరుగా వేతనాలందేలా ఈ విధానం దోహదపడుతుంది. కూలీలు ఉపాధి హామీ పనులు కోల్పోకుండా ఉండాలంటే ఆధార్‌కార్డుతో తమ వివరాలను తప్పనిసరిగా అనుసంధానించు కోవాలి. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఇప్పటివరకు 90శాతానికి పైగా ఈ-కేవైసీ పూర్తికాగా.. మిగతావారు వివరాలు నమోదు చేసుకుంటేనే ఉపాధి పనికి అర్హులవుతారు.

ఉపాధిహామీ పథకం పారదర్శకంగా అమలయ్యేలా, కూలీలకు వేతనాలు సకాలంలో అందించేందుకు కేంద్రం ముఖ గుర్తింపు హాజరు విధానాన్ని తీసుకొచ్చింది. గతంలో బృంద హాజరు వల్ల అవినీతికి ఆస్కారం ఉండేది. ముఖ గుర్తింపుతో దానికి అడ్డుకట్ట పడనుంది. ఈ-కేవైసీ పూర్తయిన వారికే వేతనాలు అందుతాయి. త్వరలోనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ ఈ విధానం అమల్లోకి రావొచ్చు.

రవి, డీఆర్‌డీఓ అదనపు పీడీ, భద్రాద్రి కొత్తగూడెం

# తెగుళ్ల ఘాటు.. నష్టాలతో చేటు



ఖమ్మం : తెలంగాణలో ఎక్కువ మంది మిరప రైతులు ఖమ్మం మార్కెట్‌కే వస్తున్నారు. యార్డుకు సుమారు 30వేల బస్తాల మిరప వచ్చింది. రాష్ట్రంలో మరో అతిపెద్ద మిరప మార్కెట్ కలిగిన వరంగల్‌కు 10వేల బస్తాలు మాత్రమే రావటం గమనార్హం. మేడారం జాతర నేపథ్యంలో అటువైపు మిరప ఏరివేతలో జాప్యం జరిగింది. అందుకే అక్కడ తక్కువ సరకు మార్కెట్‌కు వస్తోంది. తేజ రకం మిరపకు ప్రసిద్ధి చెందిన ఖమ్మం మార్కెట్‌ను అత్యధిక మంది రైతులు ఆశ్రయిస్తున్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, నల్గొండ, సూర్యాపేట, ఏపీలోని ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల నుంచి సరకు తెస్తున్నారు.

**ఓ మాదిరిగా ధరలు..**మార్కెట్‌లో జెండా పాట క్వింటాకు రూ.19వేలుగా నిర్ణయించారు. వ్యాపారులు సరకు నాణ్యతను బట్టి డీలక్స్ రకాలను క్వింటా రూ.18వేలకుపైగా, బెస్ట్ రకాలను రూ.17,000-17,500, మెతక రకాలను రూ.16,000-17,000, తాలు రకాలను రూ.10,000-10,500 చొప్పున కొన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ధరలు ఒకమాదిరిగా ఉన్నాయి. గతేడాదితో పోల్చితే సరకు తక్కువగా వస్తోంది. గతేడాది ఇదే సమయంలో విపణికి 75వేల బస్తాలు రావటం గమనార్హం. దిగుబడి తగ్గటం వల్లే సరకు తక్కువగా వస్తోందని అధికారులు అంచనా వేస్తున్నారు.

**ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై చర్చ**

కొద్దిరోజుల తరువాత సరకు ఎక్కువగా వచ్చే ఆస్కారం ఉండటంతో మార్కెటింగ్‌శాఖ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై చర్చిస్తున్నారు. కమీషన్ ఏజెంట్లు, ఖరీదుదారులతో మార్కెటింగ్‌శాఖ వరంగల్ డీడీ పద్మావతి, మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్ సోమవారం సమావేశమయ్యారు. ఇక్కడ సుమారు 50వేల బస్తాల క్రయవిక్రయాలకు అవకాశముంది. అంతకంటే ఎక్కువ సరకు వస్తే ఎక్కడ ఏర్పాట్లు చేయాలనేదానిపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

మార్కెట్‌కు 50బస్తాల ఎండు మిరప తెచ్చాను. క్వింటా రూ.17,500కు వ్యాపారులు అడిగారు. గిట్టుబాటు కాదని అమ్మలేదు. ఈసారి తెగుళ్లు ఆశించటం వల్ల దిగుబడి తగ్గిపోయింది. ప్రస్తు ధర ఆశాజనకంగా లేదు. కనీసం పెట్టుబడులు కూడా పూడకపోవటం బాధాకరం.

గుగులోత్ లాల్‌సింగ్, బండిపాడు, కామేపల్లి మండలం

## నాలుగో రోజు రూ.1.12 కోట్ల ఆదాయం

వరంగల్ : మేడారం మహా జాతర హుండీల లెక్కింపు ఐదో రోజుకు చేరుకుంది. హనుమకొండలోని తితిదే కల్యాణ మండపంలో హుండీలను లెక్కిస్తున్నారు. 163 హుండీలను లెక్కించగా రూ.1,12,63,000 నగదు లభించింది. మొదటి రోజు 125, రెండో రోజు 160, మూడో రోజు 140, నాలుగో రోజు 200, ఐదో రోజు 163 కలిపి మొత్తం 788 హుండీలను లెక్కించగా రూ.11,83




,85,116 ఆదాయం లభించిందని అధికారులు వెల్లడించారు. హుండీ లెక్కింపు ప్రక్రియలో 400 మందికిపైగా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. సీసీ కెమెరాలు, పోలీసు బందోబస్తు మధ్య లెక్కింపు చేపడుతున్నారు. గత నాలుగు రోజుల మాదిరిగా ఐదో రోజు సైతం లేఖలు, వినతిపత్రాలు, వెండి, బంగారు ఆభరణాలు, విదేశీ కరెన్సీలు లభించాయి. ఇప్పటి వరకు తెరిచిన హుండీల్లో మిగిలి ఉన్నవాటితోపాటు చిల్లర నాణేలు లెక్కించాల్సి ఉంది. వీటితోపాటు తిరుగు వారం సందర్భంగా ఏర్పాటు చేసిన 40 హుండీలను కూడా లెక్కించాల్సి ఉంది. మొత్తం పూర్తవడానికి మరో రెండు రోజులు పట్టే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

# తెగిన సిగ్నల్స్ తీగలు.. నిలిచిన రైళ్లు

కాజీపేట: కాజీపేట రైల్వేస్టేషన్ సమీపంలోని విద్యుత్తు లోకోషెడ్ సమీపంలో 4:00 గంటలకు రైల్వే సిగ్నల్ తీగలు తెగిపోవడంతో కాజీపేట-సికింద్రాబాద్ మార్గంలో రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. నాగ్‌పూర్, విశాఖ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లను మ్యాన్‌వల్ సిగ్నల్స్‌తో నడిపించారు. కొత్త రైలు మార్గం వేయడానికిగాను పక్కనున్న చిన్నచిన్న రాళ్లను తొలిగిస్తున్న వాహనం తగలడంతో సిగ్నల్ తీగలు తెగిపోయాయి. దీంతో సిగ్నల్స్‌కు అంతరాయం కలిగి రైళ్ల రాకపోకలు నిలిచాయి. సిర్పూర్ కాగజ్‌నగర్-సికింద్రాబాద్ మధ్య నడిచే ఇంటర్‌సిటీ ఘటనా స్థలం నుంచి వెళ్తుండగా సిగ్నల్స్ తెగిపో



యినట్లు సిబ్బంది గుర్తించి, దీని వెనకాల వస్తున్న విశాఖ-సికింద్రాబాద్ వందేభారత్, సికింద్రాబాద్-నాగ్‌పూర్ వందేభారత్‌లను నిలిపివేయకుండా, మ్యానువల్ సిగ్నల్ ద్వారా వాటిని ముందుకు నడిపించారు. సికింద్రాబాద్-కాజీపేట మధ్య భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్, శాతవాహన ఎక్స్‌ప్రెస్‌లు అరగంట ఆలస్యంగా నడిచాయి. వెంటనే రైల్వే సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టారు. సిగ్నల్ తీగలను కలిపి సాయంత్రం 5:30 గంటలకు సిగ్నలింగ్ వ్యవస్థను పునరుద్ధరించారు. ఈ ఘటనపై విచారణ చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

# దారిపై కనికట్టు.. ప్రమాదాలు అరికట్టు!

ఆదిలాబాద్ : జిల్లాలో జాతీయ రహదారితో పాటు పలు గ్రామీణ దారుల్లోనూ రహదారి ప్రమాదాలు నిత్యకృత్యమై ఎందరో మృత్యువాత పడుతున్నారు. మద్యం తాగి వాహనాలు నడపటం, రహదారి నిబంధనలు పాటించకపోవటం, మితిమీరిన వేగం, అపసవ్య దిశ ప్రయాణాలతో ప్రాణాలు గాల్లో కలుస్తున్నట్లు పోలీసు శాఖ గుర్తించింది. ఇలాంటి ప్రమాదాలకు అడ్డుకట్ట వేయటానికి ఎస్పీ అఖిల్ మహాజన్ వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నారు. జిల్లాలో ఈ ఏడాది కనీసం 20 శాతం ప్రమాదాలను తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. పోలీసులు చేపట్టిన ఈ కార్యక్రమాలతో ఈ ఏడాది కొంతమేర ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయి.

**ధ్వంసమైన కారుతో..** నేరడిగొండ మండలం కుప్టి ఘాట్ వద్ద మూలమలుపుతో పాటు ఏటవాలు ప్రాంతం ఉండటంతో భారీ వాహనాలు అత్యంత వేగంగా వెళ్తాయి.. ఇప్పటికే పదుల సంఖ్యలో



ప్రమాదాలు జరిగి.. ఏడుగురు మృతిచెందారు. ఈ నేపథ్యంలో అక్కడ పెద్ద ఇనుప స్టాండును పోలీసులు ఏర్పాటు చేసి ప్రమాదానికి గురైన కారు అందరికీ కనిపించేలా ఏర్పాటు చేశారు. ఆ కారును చూసైనా వాహన చోదకులు ప్రమాదాలు జరగకుండా తక్కువ వేగంతో ప్రయాణిస్తారన్న ఆలోచనతో ఏర్పాటు చేశారు.

**పోలీసు వాహనం ఉన్నట్లుగా..**

గుడిహత్నూర్ మండలంలోని మేకలగండి వద్ద పలు లెక్కలేనన్ని ప్రమాదాలు జరిగాయి. దీంతో మేకల గండి, ఇచ్చోడ బైపాస్ వద్ద పోలీసులు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. పోలీసు వాహనం నిలబడి ఉండి కానిస్టేబుళ్లు వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు దూరం నుంచి కనిపిస్తుంది.. దీంతో వాహనదారులు తక్కువ వేగంతో నడుపుతారన్న ఉద్దేశంతో ఏర్పాటు చేశారు.ఎక్కువగా ప్రమాదాలు మద్యం మత్తులో జరుగుతున్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో అన్ని పీఎస్‌ల పరిధిలో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. గతేడాది 13,228 కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు. ఈ ఏడాది దాదాపు 1500 వరకు కేసులు నమోదయ్యాయి.

# పోలెండ్ జిగురు.. యూఏఈ గుళికలు

ఖమ్మం : ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో రూ. 8.50 కోట్ల ఖర్చుతో చేపట్టిన సింథటిక్ ట్రాక్ తుది దశ పనులు ఎట్టకేలకు వేగం అందుకున్నాయి. ఇప్పటికే తారు పరిచిన ట్రాక్‌పై కెమికల్ గమ్ పూత వేసి, ఆపై రబ్బరు గుళికలు పరుస్తున్నారు. సాధారణంగా అంతర్జాతీయ అథ్లెటిక్స్ సమాఖ్య ప్రమాణాలకు తగినట్టుగా సింథటిక్ ట్రాక్ నిర్మాణం ఉందా? లేదా? అని సమాఖ్య ప్రతినిధులు నిర్మాణ అనంతరం పరిశీలించి నివేదిక ఇస్తారు. ప్రమాణాలకు అనుగుణంగా ఉంటేనే అంతర్జాతీయ స్థాయి పోటీల నిర్వహణకు అర్హత సాధించిందంటూ సర్టిఫై చేస్తారు. ఈ నేపథ్యంలో తుది దశ పనుల్లో భాగంగా పోలెండ్



నుంచి తెప్పించిన జిగురు, యూఏఈ నుంచి తీసుకొచ్చిన గుళికలను ముడిపదార్థాలుగా వినియోగిస్తున్నారు. 50 ఏళ్లుగా దేశవిదేశాల్లో ఎక్కడ సింథటిక్ ట్రాక్ నిర్మాణాలు జరిగినా వీటినే ఉపయోగిస్తున్నట్టు సంస్థ నిర్వాహకులు తెలిపారు. గులాబీ వర్ణంలోని జిగురులో రెండు రకాలు న్నాయి. ఓ రకం 25, మరోటి 75 శాతం పరిమాణంలో కలిపి ట్రాక్‌పై పూతలా వేస్తున్నారు. ఆ తర్వాత దానిపై రవ్వ పరిమాణంలో ఉండే నల్లటి రబ్బరు గుళికలు పరుస్తున్నారు. ఈ పనులయ్యాక ట్రాక్‌పై పెయింట్ వేస్తారు. లైన్లుగా విభజిస్తారు. అక్కడితో నిర్మాణం పూర్తయినట్టు లెక్క.

# యువ 'పురం'.. ఆకాంక్షల స్వరూపం

చేర్యాల : జనాభాలో సింహభాగం యువతదే. ఓటర్ల సంఖ్యాపరంగా తక్కువేమి కాదు. పుర క్షేత్రంలో పాలకుడిగా ఎవరు ఎన్నిక కావాలనేది నిర్దేశించే సత్తా వారి సొంతం. ప్రశ్నించే పాలకుడిని కాకుండా సమస్యలకు పరిష్కారం చూపే వారికి ఎర్రతివాచీ పరుస్తామని చెబుతున్నారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో ఈ నెల 11న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో యువత ఆశలు, కలల కాంక్షలపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం..

**ఆశించినమేర మైదానాలు లేక..**

నాలుగు పట్టణాల్లో పెద్ద సంఖ్యలో యువకులు క్రీడా రంగాల్లో రాణిస్తున్నారు. ఆశించిన మేర మైదానాలు లేకపోవడం సమస్యగా మారింది. దీంతో విద్యాలయాలు, ఇతరత్రా మినీ మైదానాలను వినియోగించాల్సి వస్తోంది. గజ్వేల్‌లో క్రీడా హబ్‌ను ఏర్పాటు చేసేందుకు తీసుకున్న నిర్ణయం తొలి అడుగుకే పరిమితమైంది. హుస్నాబాద్‌లోనూ అభివృద్ధి చేయాల్సి ఉంది. ఈత కొలను నిర్మించాల్సి ఉంది. అథ్లెటిక్స్, క్రికెట్, ఇతరత్రా ఆసక్తి కలిగిన రంగాల్లో పలువురు సత్తా చాటుతున్నారు. అలాంటి వారిని దృష్టిలో పెట్టుకొని సిద్దిపేట నమూనాగా సదుపాయాలు కల్పించాలి.

**అరకొరగా శిక్షణ కేంద్రాలు..**

నైపుణ్యాలు లేక నిరుద్యోగ యువత ఉద్యోగ సాధన, స్వయంఉపాధిలో వెనకబడుతోంది. అందుకు శాశ్వత ప్రాతిపదికన శిక్షణ కేంద్రాలు అవసరం సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్‌లో సెట్విన్ కేంద్రాలు కొనసాగుతున్నాయి. దుబ్బాక, చేర్యాలలో ఆ తరహా కేంద్రాలు అవశ్యం. అర్హతలకు అనుగుణంగా నాలుగు పట్టణాల్లో న్యాక్, స్వయం ఉపాధి శిక్షణా కేంద్రాలను అందుబాటులోకి తేవాలి.

**ఉన్నత, వృత్తి నైపుణ్య విద్యకు ప్రోత్సాహం..**

దుబ్బాక, చేర్యాల, హుస్నాబాద్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు అనుబంధంగా పీజీ కోర్సులు అందుబాటులోకి తేవాలి. గజ్వేల్, చేర్యాలలో ప్రభుత్వ ఐటీఐలు ఏర్పాటు చేయాల్సి ఉంది. హుస్నాబాద్‌లో ఏటీసీ ఏర్పాటుకు కసరత్తు కొనసాగుతోంది. దుబ్బాకలో పాలిటెక్నిక్ కళాశాల స్థాపించాలి. జిల్లా కేంద్ర గ్రంథాలయం మాదిరి అన్ని చోట్ల పోటీ పరీక్షలకు అనుగుణంగా సిద్ధం చేసేలా పుస్తక నిధి సమకూర్చాలి.

**పరిశ్రమలు విస్తరిస్తే ప్రయోజనం..**



పట్టణ వాసుల్లో చాలా మంది ఉపాధి పొందేందుకు హైదరాబాద్, ఇతర నగరాలకు వలస వెళ్లాల్సి వస్తోంది. విద్యార్హతలు ఉన్నా తప్పనిసరి పరిస్థితుల్లో ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో తూప్రాన్, ములుగు, మర్కూక్ మండలాల్లో మినహాయిస్తే మిగిలిన చోట్ల పరిశ్రమలు లేకపోవడం సమస్యగా మారింది. ఈ నేపథ్యంలో పట్టణాల్లో పరిశ్రమలను విస్తరించాల్సి ఉంది. పర్యావరణ హితమైన (గ్రీన్ జోన్)వి ఏర్పాటు చేయడం ద్వారా స్థానికులకు మేలు చేయనుంది. జిల్లాకు జాతీయ, రాష్ట్రీయ రహదారులు, రైలు మార్గం, నీటి సదుపాయం ఉన్న దృష్ట్యా ఏర్పాటుకు కృషి చేయాలి.

**జిల్లా జనాభా 10.12 లక్షలు**

యువత సంఖ్య 4.50 లక్షలు (సుమారు)

గజ్వేల్–ప్రజ్ఞాపూర్, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాల జనాభా 1.64 లక్షలు (సుమారు)

72 వార్డుల్లో ఓటు హక్కు ఉన్నది 1,01,085 (యువతీయువకులు 40 శాతం)

# పోషకాలు తిందాం.. పరీక్షలు రాసేద్దాం




హైదరాబాద్ : ఏడాదంతా చదవడం ఒకెత్తయితే.. పరీక్షల సమయంలో విద్యార్థులు చదవడం ఒకెత్తు. పరీక్షలకు సన్నద్ధమయ్యే సమయంలో పుస్తకాలతో కుస్తీ పడుతూ తిండిపై అంతగా ఆసక్తి చూపించరు. సమయానికి ఆహారం తీసుకోకపోవడం, అంతగా ఆకలేస్తే ఏదోకటి తినేయడంతో అనారోగ్య సమస్యలు కొనితెచ్చుకొనే అవకాశం ఉంటుంది. కీలక సమయంలో ఆహారం విషయంలో అజాగ్రత్త పనికి రాదంటున్నారు పోషకాహార నిపుణులు.

**ఒత్తిడి తట్టుకునేందుకు...**

రోజూ పోషకాహారం తీసుకోవాలి. ఈ సమయంలో మేలైన మాంసకృతులు కావాలి. పప్పుధాన్యాలు, సోయా గింజలు, పెరుగు, పాలు, నూనె గింజల్లో ఇవి లభిస్తాయి. మాంసాహారులు తక్కువ నూనెతో చేసిన గుడ్డు, ఆమ్లెట్, చికెన్, చేపలు తినొచ్చు.

ఆకు, కాయగూరలకు ప్రత్యామ్నాయం లేదు. పండ్లు తీసుకోవడం ఉత్తమం. ఒత్తిడిని తట్టుకొనేందుకు విటమిన్లు, మెగ్నీషియం, కాల్షియం ఎక్కువగా ఉండే రాగిజావ, నట్స్, నువ్వులు, కాఫీ, టీ తదితరాలు సాయపడతాయి. తాగునీరు పక్కనే ఉంచుకోవాలి. వేడి వల్ల శరీరం లవణాలు కోల్పోయి నీరసం, తలనొప్పి వస్తాయి. ఎక్కువ డీ హైడ్రేషన్ అనిపిస్తే పరీక్షల సమయంలో నిమ్మకాయ నీటిని తాగాలి.

హోటళ్లలో తినకపోవడం ఉత్తమం

భోజనంలో అన్నం కొంత మేర తగ్గించాలి. చక్కెర వేసిన పండ్ల రసాలు వద్దు. నేరుగా పండ్లు తినాలి. ఎక్కువ నూనెలు ఉండే పులిహోర, బిర్యానీ, పూరీ, వడ తినొద్దు. వాటికి బదులుగా పెరుగన్నం, కూరగాయ కర్రీ, ఆకుకూర పప్పు తీసుకోవాలి. సాయంత్రం బ్రెడ్, గ్లాసు పాలు, అరటిపండు, చపాతీ, ఇడ్లీ ఇవ్వొచ్చు. పరీక్షలు ఉన్నన్ని రోజులు కాసిన్ని ఉసిరి క్యాండీలనో, ఉప్పులో వేసిన ముక్కలనో అప్పుడప్పుడు ఇస్తుంటే మంచిది. ఇవి మెదడుకి ఆక్సిజన్ అందేట్టు చేస్తాయి.

**ఆహారం మితంగా తీసుకోవాలి**

ఏ ఆహారమైనా ఎక్కువ తీసుకుంటే అనర్థమే. పరీక్షల సమయంలో వాటిపైన మక్కువ తగ్గించుకోవాలి. కొన్నిసార్లు పరీక్షల ఒత్తిడి వల్ల విరోచనాలు అయ్యే అవకాశం ఉంటుంది. ఆహారంపై జాగ్రత్తలు అవసరం.

జానకి శ్రీధర్, పోషకాహార నిపుణులు

# చలి.. వేడి.. వైరల్ దాడి



హైదరాబాద్: పగలు ఉక్కపోత...రాత్రిపూట చలి...గ్రేటర్‌లో కొన్ని రోజులుగా వాతావరణ పరిస్థితి మారింది. నెమ్మదిగా చలికాలం ముగిసి..ఎండాకాలం ప్రారంభం అవుతుండటంతో సీజనల్ వ్యాధులు దాడి చేస్తున్నాయి. వైరల్ వ్యాధులు విజృంభించేందుకు వాతావరణం అనువుగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఒకరి నుంచి మరొకరికి వేగంగా ఈ వైరల్ ఇన్‌ఫెక్షన్లు వ్యాప్తి చెందుతాయి. గుంపులుగా ఉన్న ప్రదేశాల్లో ఎక్కువగా సోకే ఆస్కారం ఉందని పేర్కొంటున్నారు. నల్లకుంట ఫీవర్ ఆసుపత్రికి రోజూ 500కు పైగా ఓపీ(అవుట్ పేషంట్) ఉంటోంది. గతంతో పోలిస్తే 10 శాతం ఓపీ పెరిగినట్లు వైద్యులు తెలిపారు.

**జ్వరం.. దగ్గు** నగరంలో కొన్ని రోజులుగా తీవ్రమైన గొంతునొప్పి... కఫంతో కూడిన దగ్గు...చలి జ్వరం...తలనొప్పి, నీరసం లాంటి లక్షణాలతో చాలామంది ఇబ్బంది పడుతున్నారు. ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రులను సంప్రదిస్తున్నారు. చిన్నారులు సైతం ఈ లక్షణాలతో బాధపడుతున్నారు. ఇంట్లో ఒకరిలో ఈ లక్షణాలు ప్రారంభమై...తర్వాత అందరిలో ఈ లక్షణాలు కన్పిస్తున్నాయి. ముఖ్యంగా ఇన్‌ఫ్లుయెంజా–ఏ, బీ, రెస్పిరేటరీ సిన్సిటియల్ వైరస్(ఆర్ఎస్‌వీ), హెచ్3ఎన్2, రైనోవైరస్‌ల వ్యాప్తి ఎక్కువగా ఉందని వైద్యులు చెబుతున్నారు. తొలుత ముక్కు, గొంతు, శ్వాసనాళాలు తర్వాత ఊపిరితిత్తులపై ప్రభావం చూపిస్తాయని పేర్కొంటున్నారు. కొందరిలో 10 రోజులు దాటినా లక్షణాలు తగ్గడం లేదు. కొందరైతే ఆసుపత్రిలో చేరి చికిత్స తీసుకోవాల్సి వస్తోంది.తగిన జాగ్రత్తలు అవసరం: డాక్టర్ రమణప్రసాద్, శ్వాసకోశ వ్యాధుల చికిత్స నిపుణుడు, కిమ్స్‌సీజన్ మారడం వల్ల ఎక్కువగా శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లు పెరుగుతున్నాయి. ఇన్‌ఫ్లుయెంజా ఇతర వైరస్‌లు కారణమవుతున్నాయి. ఫ్లూ వ్యాక్సిన్ తీసుకున్న వారిలో ఈ ఇబ్బందులు తక్కువగా ఉంటున్నాయి.తరచూ చేతులు సబ్బుతో కడుక్కోవాలి. తగినన్ని నీళ్లు తాగడం, పండ్లు, నీటి శాతం ఎక్కువగా ఉన్న కాయగూరలు తీసుకోవాలిగొంతు నొప్పి ఉంటే ఉప్పు కలిపిన గోరు వెచ్చని నీటితో పుక్కిలించడం, గ్రీన్ టీ, సూప్‌లు తీసుకోవడం వల్ల ఉపశమనం ఉంటుంది.ముఖ్యంగా అవయవాల మార్పిడి చేయించుకున్న వారు, క్యాన్సర్ వ్యాధిగ్రస్థులు, మధుమేహులు మరింత అప్రమత్తంగా ఉండాలి.సాధారణంగా 2–3 రోజులకు వ్యాధి లక్షణాలు తగ్గుముఖం పడతాయి4రోజులు గడిచినా తగ్గకపోతే వెంటనే వైద్యులు సంప్రదించాలి.

# జెండా ఏదైనా.. ఇదే మా ఎజెండా



పెద్దపల్లి : ఏళ్లుగా జిల్లాలోని మూడు మున్సిపాలిటీలతోపాటు రామగుండం నగరపాలికలో పలు సమస్యలు తిష్ఠ వేశాయి. ఎన్నికలప్పుడు నాయకులు హామీలు గుప్పిస్తున్నా అవి ప్రకటనలకే పరిమితం అవుతున్నాయి. దీంతో ప్రజలు సమస్యలతోనే సహవాసం చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

**కరవైన ఆహ్లాదం..**

రామగుండం నగరపాలిక పరిధిలో మల్కాపూర్ చెరువు మినీట్యాంక్‌బండ్ పనులు కలగానే మిగిలాయి. నగరపాలికకు చెందిన ఆరు పార్కుల నిర్వహణ అలంకారప్రాయం అయింది. జిల్లా కేంద్రంలోని మినీట్యాంక్‌బండ్ నిర్వహణ అటకెక్కింది. చెరువులో పెరిగిన గుర్రపు డెక్కను తొలగించకపోవడంతో బోటింగ్ నిలిచిపోయింది. క్రిస్టియన్ కాలనీలో నిర్మించిన పిల్లల పార్కు వినియోగంలోకి రాకుండానే శిథిలమైంది. నిట్టూరు రోడ్డులో పార్కు నిర్మిస్తామని చెప్పిన నేతల హామీలు నీటిమూటలయ్యాయి. సుల్తానాబాద్ పెద్ద చెరువు కట్టపై ప్రతిపాదించిన మినీట్యాంక్‌బండ్ ప్రతిపాదన పత్రాలకే పరిమితమైంది.

**ట్రాఫిక్ ఇక్కట్లు.. పార్కింగ్ తిప్పలు**రాజీవ్ రహదారిపై వాహనాల రద్దీ పెరగడంతో రామగుండం, పెద్దపల్లి, సుల్తానాబాద్ ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు పెరిగిపోయాయి. రాజీవ్‌రహదారిపై నడిచే వాహనాల కారణంగానే జిల్లా కేంద్రంలో 6 కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నళు ఏర్పాటు చేశారు. వీటి సంఖ్య ఏటా పెరుగుతోంది. కానీ స్థానిక ప్రజలకు ఇబ్బందులు తొలగించేందుకు సర్వీసు రోడ్డు నిర్మాణంపై నేతలెవరూ దృష్టి సారించలేదు. పట్టణంలోని జెండా కూడలిలో గతంలో ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాన్ని కుదించి ఫుట్‌పాత్ వ్యాపారానికి కేటాయించడంతో పార్కింగ్ కష్టాలు తప్పడం లేదు. సుల్తానాబాద్‌లోనూ ఇదే సమస్య వెంటాడుతోంది. రామగుండం నగరపాలికలో లక్ష్మీనగర్, కల్యాణ్‌నగర్‌లాంటి వ్యాపార ప్రాంతాల్లో పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలాలు కేటాయించాలనే డిమాండ్ ఉంది.**క్రీడా మైదానం ఎండమావే**జిల్లా కేంద్రంలో క్రీడా మైదానం కలగానే మిగిలిపోయింది. ఇరవై ఏళ్ల కిందట జూనియర్ కళాశాల మైదానంలో మినీ స్టేడియం ఏర్పాటు చేయాల్సి ఉండగా నాయకుల నిర్లక్ష్యంతో నిధులు వెనక్కి వెళ్లాయి. వ్యవసాయ మార్కెట్‌లో నిర్మించిన సమీకృత మార్కెట్ భవనాన్ని ఇండోర్ షటిల్ కోర్టుగా మార్చేందుకు ఇటీవల పనులు ప్రారంభించారు. సుల్తానాబాద్‌లోని మినీ స్టేడియం నిర్వహణ లేకపోవడంతో మైదానం గుంతలమయమైంది. భవనం శిథిలమవు తోంది.

# వీధి వ్యాపారులు.. పురాల్లో నిర్ణేతలు

ఆదిలాబాద్ : పొట్టకూటి కోసం రోడ్ల మీద వ్యాపారాలు చేసే కుటుంబాలు వారివి.. ఎండనకా.. వాననకా పొద్దంతా రహదారులపై విక్రయాలు చేస్తేనే బతుకుదెరువు.. పండ్లు, కూరగా యలు, ఇతర వస్తువులు విక్రయించుకుంటూ పొట్టపోసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పట్టణాల్లో వీధి వ్యాపారంపై వేలాది కుటుంబాలు ఆధారపడి ఉన్నాయి. బల్దియా ఎన్నికల్లో వారి ఓట్లే కీలకం కానున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 34,690 కుటుంబాలు వీధి వ్యాపారమే వృత్తిగా జీవిస్తున్నాయి. సుమారు 1.04 లక్షల ఓటర్లు బల్దియా ఎన్నికల్లో ప్రభావం చూపనున్నారు. అయితే వృత్తిరీత్యా వీధి వ్యాపారులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. కొత్తగా ఏర్పడే పాలకవర్గాలైనా తమ సమస్యలను పరిష్కరిస్తాయని ఆశగా ఎదురుచూస్తున్నారు. రోజంతా రహదారులపై వ్యాపారాలు చేయాల్సి ఉండటంతో అనేక అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. వాహనాల పొగ, దుమ్ము, దూళితో కూడిన గాలి పీల్చడంతో ఊపిరితిత్తుల సంబంధిత సమస్యలు, చర్మ వ్యాధులతో బాధపడుతున్నారు. ఆరోగ్య కార్డులు, వైద్య సేవలు అందడం లేదు.

ఉపాధి నిమిత్తం పీఎం స్వనిధి పథకం కింద షరతులు లేకుండా రుణాలు అందజేయాలి. రూ.15 వేలు, రూ.25 వేలు, రూ.50 వేల చొప్పున రుణం పొందిన వారు తిరిగి చెల్లించడంలో ఆలస్యమైనా



కొత్త రుణాలు ఇవ్వడం లేదు. సిబిల్ స్కోరు పరిగణనలోకి తీసుకోవడంతో చాలా మంది రుణానికి నోచుకోవడం లేదు.

గత ప్రభుత్వ హయాంలో రూ.కోట్లాది నిధులు వెచ్చించి సమీకృత మార్కెట్ల నిర్మాణం చేపట్టారు. నిధుల సమస్యలతో పట్టణాల్లో అందుబాటులోకి రాలేదు.

వీధి వ్యాపారుల జీవనోపాధుల చట్టం–2014 ప్రకారం ప్రతి మున్సిపాలిటీలో వారికి ప్రత్యేకంగా విక్రయ జోన్లు ఏర్పాటు చేయాలి. ఎంపిక చేసిన ప్రాంతాల్లో వెండింగ్, నాన్ వెండింగ్ జోన్లలో వారు ఉపాధి పొందేలా చర్యలు తీసుకోవాలి. రహదారులకు ఇరువైపులా షెడ్లను ఏర్పాటు చేస్తే వ్యాపారం చేసుకునేందుకు అనువుగా ఉంటుంది.

ప్రధాన కూడళ్లలో, రహదారులపై తోపుడు బండ్లపై వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో ఇరుకైన రహదారులు, రద్దీ ఎక్కువగా ఉన్నచోట ట్రాఫిక్ సమస్యలు ఎక్కువవుతున్నాయి. గిరాకీ ఎక్కువగా ఉండే కూడళ్ల వద్ద ట్రాఫిక్ పేరుతో నియంత్రిస్తున్నారని వాపోతున్నారు.

# పోషకాల పప్పులు.. వదిలేస్తే తిప్పలు

మిర్యాలగూడ : శుభకార్యాల నుంచి హోటళ్లు, ఇళ్లలో భోజనం చేయాలంటే కచ్చితంగా ఉండే వంటకం పప్పు నిత్యం ఏదో ఒక రూపంలో రకరకాల పప్పులు వినియోగిస్తుంటాం. ఇవి కేవలం ఆహారం మాత్రమే కాదు ఆరోగ్య గుళికలు అని నిపుణులు చెబుతుంటారు. గుండె ఆరోగ్యం నుంచి మధుమేహం, రక్తపోటు నియంత్రణ, ఎముకల్లో బలం వంటి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు అందించే పప్పుదినుసుల సాగు ఏటా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గణనీయంగా తగ్గుతూ వస్తోంది. సాగు విస్తీర్ణం పెంచడంతో పాటు వాటి గొప్పతనాన్ని వివరించేలా ఏటా ఫిబ్రవరి 10న 'ప్రపంచ పప్పు దినుసుల దినోత్సవం' నిర్వహిస్తున్నారు.

ప్రయోజనాలు: మధుమేహం, రక్తపోటు నియంత్రణ, గుండె ఆరోగ్యం మెరుగుదల, బరువు తగ్గేందుకు ఉపకరించడం, క్యాన్సర్ ప్రమాదం తగ్గుదల, ఎముకలు, కండరాల పటిష్ఠత, జీర్ణక్రియ మెరుగుదల.

**స్వల్పకాలిక ఆదాయం దిశగా..**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సాగునీటి వసతి గణనీయంగా పెరిగింది. దీంతో ఏటా రెండుసార్లు పంటలందించే వరి సాగు వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. ఎక్కువ శ్రమ లేకపోవడం, స్వల్పకాలిక ఆదాయం వస్తుండడంతో వరి అధికంగా పెరిగింది. అధిక ఆదాయం సాధించాలనే ఉద్దేశంతో పలు ప్రాంతాల్లో రైతులు పత్తి, మిరప సాగుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో పప్పు దినుసుల సాగు భారీగా



తగ్గిపోతుంది.

సాగు తగ్గడానికి కారణాలు ఇవీ..

సాగునీటి వసతి పెరగడం.

పప్పు దినుసుల పంట దిగుబడి ఏటా ఒక్కసారే రావడం.

సగటు వరి దిగుబడి, ధర ఆశాజనకం..

వ్యవసాయం చేసే రైతుల సంఖ్య తగ్గడం.

అవగాహన పెంచుతున్నాం

పప్పు దినుసుల సాగు పెంచేందుకు రైతుల్లో అవగాహన పెంచుతున్నాం. గతం కంటే కొంత మెరుగైనా ఇంకా పెరగాల్సిన అవసరం ఉంది. గతేడాది హాలియా, కొండమల్లేపల్లిలో ప్రత్యేక కొనుగోలు కేంద్రాలు సైతం ఏర్పాటు చేసి మద్దతు ధర అందించాం. అన్నదాతలు ముందుకొచ్చి సాగు చేపట్టాలి.

శ్రవణ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి, నల్గొండ

## వ్యాపార విస్తరణకు చేయూత

పరిగి : వీధి విక్రయదారులకు ఆర్థికంగా చేయూత నిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆత్మనిర్భర్ నిధి యోజన పథకాన్ని అమలు చేస్తోంది. అధిక వడ్డీల భారం నుంచి వీరిని గట్టెక్కించి స్వశక్తితో నిలదొక్కుకునేలా చేయడం దీని ఉద్దేశం. ఈ క్రమంలోనే మూడు విడతలుగా వీధి వ్యాపారులను గుర్తించి ఆర్థిక సాయం అందజేస్తోంది. వాయిదాలు క్రమం తప్పకుండా చెల్లిస్తున్న వారిని ప్రోత్సహించేందుకు రాయితీ సదుపాయాన్ని కల్పిస్తోంది. దీన్ని కొందరు చక్కగా వినియోగించుకుంటూ వ్యాపారాన్ని విస్తరించుకు ంటున్నారు. తద్వారా వారి కుటుంబాలకు చేదోడుగా నిలుస్తున్నారు. నాలుగు పురపాలికల్లో 7,887 మంది వీధి వ్యాపారులను అధికారులు గుర్తించారు. ఇప్పటి వరకు వారికి సుమారు రూ. 2.76 కోట్లు రుణంగా అందించారు. కొత్తగా క్రెడిట్‌కార్డులు అందించేందుకు కసరత్తు చేస్తున్నారు.

**నాలుగో విడతలో ఇలా..**

ఇప్పటివరకు ప్రధానమంత్రి ఆత్మనిర్భర్ నిధి యోజన పథకాన్ని పట్టణ ప్రాంతాల్లోనే అమల్లో ఉంది. ఎంపిక చేసిన వీధి వ్యాపారులకు తొలి విడతలో రూ. 10వేల చొప్పున 7,887 మందికి, రెండో విడతలో 4,875 మందికి రూ. 20వేల చొప్పున, మూడో విడతలో 2,070 మంది వ్యాపారులకు రూ. 50వేల చొప్పున రుణ సదుపాయం కల్పించారు. నాలుగో విడతలో వికారాబాద్ పురపాలికలో 793



మందికి, తాండూరులో 840, పరిగిలో 250, కొడంగల్‌లో 280 మందికి క్రెడిట్ కార్డులు అందించనున్నారు. గతంలో రుణం తీసుకొని క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లించినవారే నాలుగో విడతకు అర్హులుగా నిర్ధారించారు.

**పరిమితి రూ. 30 వేలు..**

నిరుపేద కుటుంబాల్లోనూ ఆర్థిక అక్షరాస్యతను తీసుకొచ్చేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగానే క్రెడిట్ కార్డులను అందించేందుకు క్షేత్రస్థాయిలో సర్వే ముమ్మరం చేశారు. వచ్చిన దరఖాస్తులను నిశితంగా పరిశీలిస్తున్నారు. ఒక్కో క్రెడిట్ కార్డుపై రూ. 10వేల నుంచి గరిష్ఠంగా రూ. 30వేల దాకా పరిమితి ఉంటుందని అధికారులు తెలిపారు. వచ్చే ఏడాది మార్చికల్లా లక్ష్యం పూర్తి చేస్తాం..: రవికుమార్, జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్, మెప్మానిర్దేశిత లక్ష్యాన్ని వచ్చే ఏడాది మార్చికల్లా పూర్తి చేయాలని పక్కా ప్రణాళికతో ముందుకెళు తున్నాం. వ్యాపారంతో ఎప్పటికప్పుడు వచ్చిన డబ్బులు చాలా వరకు ఖర్చు చేస్తున్నారు. పొదుపు అలవాట్లతో ఆర్థిక క్రమశిక్షణ అలవడు తుంది. ఆ దిశగా వారిని ప్రోత్సహిస్తున్నాం.

## జీరో దందా.. తలో వంద..!

నల్గొండ : ఉమ్మడి నల్గొండ జిల్లాలో జాతీయ, రాష్ట్ర రహదారులతో పాటు కంకర, ఇసుక నిల్వలను తీసుకెళ్లే వాహన చోదకుల అతివేగానికి అంతే లేకుండా పోయింది. మూడు జిల్లాల్లోని క్వారీలు, రీచ్‌ల్లో భూగర్భ గనులు, రెవెన్యూ అధికారుల అనుమతుల ప్రకారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సజావుగా సాగుతున్నా.. అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు అనధికారికంగా నిర్వహించే అక్రమ రవాణా వల్లే రహదారి ప్రమాదాలు జరుగుతున్నాయి.

**రాజకీయ అండ**

నల్గొండ జిల్లాలో రావులబండ(దోమలపల్లి), నార్కట్‌పల్లి, కేతేపల్లి, కట్టంగూరు, దేవరకొండ, కొండమల్లేపల్లి, గాజీనగర్, పోలేపల్లి, దామరచర్ల, తిప్పర్తి, పెద్ద సూరారం, కనగల్, ఇనుపాముల, బొల్లేపల్లి, పోతినేనిపల్లి, ఇండ్లూరు, వేలాల ప్రాంతాల్లో యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తుండటతో రహదారులు దెబ్బతింటున్నాయి. రహదారి పనులకు ఉచితంగా 'జీరో' బిల్లు ఇచ్చేలా ఆయా క్రషర్ల యజమానులకు గనులు, ఆర్‌అండ్‌బీ అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో భారీగా అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలోని బొమ్మలరామారం, పోచంపల్లి, బీబీనగర్ ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా కంకర తవ్వకాలు జరుగుతున్నాయి.

సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో రెండు, గరిడేపల్లి మండలంలో ఆరు కంకర మిల్లులున్నాయి. అప్పన్నపేట, హుజూర్‌నగర్–కోదాడ రోడ్ మధ్యలో ఉన్న కంకర మిల్లుల నుంచి వచ్చే పొగతో స్థానికులు, రవాణా వల్ల వెలువడే దుమ్ముతో వాహనదారులు ఇబ్బందులు



పడుతున్నారు. జీరో దందాను ఆసరాగా చేసుకుని క్రషర్ల నిర్వాహకులు ఒక బిల్లు చీటీతో దొంగ వేబిల్లులు సృష్టించి రెండు, మూడు లారీలను అక్రమంగా తరలిస్తున్నారు. దీనికి అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు సమయాన్ని ఎంచుకుంటున్నారు. అన్ని విభాగాల అధికారులకు, సిబ్బందికి 'నాలుగు రాళ్లు' వెనకేసుకునేలా చేస్తుండటంతో వారూ కూడా చూసీచూడనట్లు ఉంటున్నారనే ఆరోపణలున్నాయి.

జాతీయ, రాష్ట్ర రహదారులపై ఒకే నంబరు ప్లేట్లతో నాలుగైదు వాహనాలు ఉంటున్నాయి. బిహార్, ఒడిశాకి చెందిన వారిని డ్రైవర్లుగా నియమించడంతో వారు ఇష్టారీతిన నడిపిస్తున్నారు.

టిప్పరు, లారీలో గరిష్ఠంగా 30 టన్నుల కంకర నింపాలి. కానీ యజమానులు 70 టన్నుల వరకు నింపేస్తున్నారు. దీంతో వాహనాలు వంగి ప్రయాణించి.. వేగంపై పట్టు తప్పుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఈ విషయాన్ని జిల్లా భూగర్భ గనులశాఖాధికారి జాకబ్ సామ్యూల్‌తో ప్రస్తావించగా.. తనిఖీలు చేపట్టి అక్రమాలకు పాల్పడ్డ క్రషర్ యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు.

## కొత్త చట్టం.. గిగ్‌వర్కర్లకు ఛత్రం



హైదరాబాద్: మహానగరంలోని సుమారు మూడు లక్షలమందికిపైగా గిగ్‌వర్కర్లకు కొత్త చట్టంతో ప్రయోజనం కలగనుంది. గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం తెలంగాణ గిగ్‌వర్కర్ల (రిజిస్ట్రేషన్, సామాజిక భద్రత, సంక్షేమం) చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వ తీసుకువచ్చింది. సామాజిక భద్రత, ఉద్యోగభద్రత సహా వివిధ అంశాలను ప్రభుత్వం చట్టంలో నిర్దేశించి ంది. చట్టం అమలుకు శ్రీకారం చుట్టాలని గిగ్‌వర్కర్లు కోరుతున్నారు.

**ప్రధాన అంశాలివే..**

సంక్షేమ నిధి: సంస్థల లావాదేవీల్లో ఒక శాతం నుంచి రెండు శాతం మొత్తాన్ని సంక్షేమ నిధికి జమచేయాలి. ఈ నిధి ద్వారా గిగ్ వర్కర్లకు బీమా, పింఛను, ఇతర ప్రయోజనాలు కల్పిస్తారు. సామాజిక భద్రత పథకాలను అమలు చేస్తారు.

ఉద్యోగ భద్రత: గిగ్ వర్కర్లను విధుల నుంచి కారణం లేకుండా లేదా అకస్మాత్తుగా తొలగించడానికి వీలులేదు. తొలగింపునకు ఏడు రోజుల ముందస్తు నోటీసు ఇవ్వడం తప్పనిసరి.

గుర్తింపు సంఖ్య: ప్రభుత్వం ప్రతి గిగ్? వర్కర్?కు ప్రత్యేకంగా గుర్తింపు సంఖ్య ఇస్తుంది. గిగ్‌వర్కర్లు తరచూ సంస్థలు లేదా ఫ్లాట్?ఫాంలు మారుతుంటారు. ప్రత్యేక గుర్తింపు సంఖ్యతో వారు ఏ సంస్థలో ఉన్నా ప్రయోజనాలు అందుతాయి.

ప్రత్యేక బోర్డు: గిగ్ వర్కర్ల సంక్షేమానికి, సమస్యలను పరిష్కరించేం దుకు 20 మంది సభ్యులతో ప్రత్యేకంగా గిగ్ వర్కర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటవుతుంది. ఈ బోర్డులో గిగ్ వర్కర్లకు ప్రాతినిథ్యం ఉంటుంది.

పని కేటాయింపులో పారదర్శకత: గిగ్ వర్కర్లకు పని కల్పించడంలో వివక్షకు తావుండదు. వేతనం, కమీషన్లలో స్పష్టత: సంస్థలు లేదా ఫ్లాట్‌ఫాంలు గిగ్‌వర్కర్లకు చెల్లించే వేతనాలు, కమీషన్లలో విధానం ఉ ండటంతో పాటు స్పష్టత ఉండాలి.

## అంతుచిక్కని అక్రమ తవ్వకాలు



సిరిసిల్ల: మైనింగ్ మాఫియా అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తోంది. జిల్లాలో కంకర, గ్రానైట్, మట్టి తవ్వకాలపై నిబంధనలు కఠినతరం చేశారు. అనుమతులు పొందిన క్వారీలకు ఆరేళ్ల క్రితం డీజీపీఎస్? (డిఫెరెన్షియల్? గ్లోబల్? పొజిషనింగ్? సిస్టం) సర్వేచేసి హద్దులు గుర్తించారు. ఇవి మీరుతున్నవారికి పెనాల్టీలు విధిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. అక్రమ మట్టి తవ్వకాలపై అధికారులకు అంతుచిక్కడం లేదు.

**గుట్టలను తొలచి..**

జిల్లాలోని అగ్రహారం, తెట్టెకుంట, చంద్రగిరి గుట్టల్లో మట్టి అక్రమ తవ్వకాలపై ఈ నెల 4న మినీలో 'అగ్రహారంలో మట్టిని తినే అనకొండలు' శీర్షికన ప్రచురితమైన కథనంపై గనులశాఖ ఏడీ క్రాంతి, ఆర్ఐలతో కలిసి పరిశీలనకు వెళ్లారు. పలు ప్రాంతాల్లో మట్టి తవ్వకాలు జరిగిన తీరు చూసి వారు అవాక్కయ్యారు. మట్టిని తవ్వే యంత్రాలు.. తరలించే వాహనాలేవీ లేకపోవడంతో వెనుదిరిగి వచ్చారు. ప్రభుత్వ శాఖల్లో జరుగుతున్న పనులకు అవసరమైన మట్టిని కొద్దిమొత్తంలో అనుమతులు ఇస్తుండగా.. ఇదే అదనుగా అక్రమార్కులు గుట్టలనే తొలిచేస్తున్నారు. వేల క్యూబిక్? మీటర్ల మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

**వేధిస్తున్న సిబ్బంది కొరత**జిల్లాలో అక్రమ మట్టి తవ్వకాలపై వస్తున్న ఫిర్యాదులు గనులశాఖకు తలనొప్పిగా మారాయి. దీంతో జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు అవసరాలకు అవసరమైన మట్టిని తవ్వేందుకు ఉ న్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. దానిపై జిల్లా వ్యాప్తంగా రెవెన్యూశాఖ స్థలాలను పరిశీలించాలి. మట్టి తవ్వకాలకు అనువైన స్థలాలపై ఎన్?వోసీ ఇవ్వాల్సి ఉంది. రెండేళ్లుగా గనులశాఖ ప్రతిపాదన ముందుకు కదలడం లేదు. రెవెన్యూ శాఖలో సిబ్బంది కొరత, సర్వేయర్లు లేకపోవడం తదితర కారణాలతో వాయిదాలు వేస్తూ వస్తున్నారు. అనుమతులు లభిస్తే క్వారీ నిర్వాహకులు ప్రభుత్వానికి హెక్టారుకు రూ. 5 లక్షలు చెల్లించాలి. అలాగే ప్రభుత్వ, ప్రైవేటు అవసరాలు వేటికైనా టన్ను చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. మట్టి తవ్వకాలతో గనులశాఖకు సీనరేజీ రూపంలో డబ్బులు జమవుతాయి.

## వృథా నీటికి 'చెక్'డ్యాం



జగిత్యాల : ఏడాదికి సగటున జిల్లాలో 965 మిల్లీమీటర్ల వర్షం కురుస్తుంది. ఈ క్రమంలో శ్రీరామసాగర్ ప్రాజెక్టు నీటిని ఆయకట్టుకు, చెరువుల్లోకి తరలించడం, వరదకాలువ నుంచి వాగుల్లోకి వదలడం, గోదావరి నుంచి ఎత్తిపోతలు, ఎల్లంపల్లి నీటి తరలింపుతో మిగులు వృథా జలాలు గోదావరిలోకి వెళ్తాయి. ఈ నేపథ్యంలో వృథా నీటిని ఒడిసిపట్టేలా వాగులపై చెక్?డ్యాం(ఆనకట్ట)ల నిర్మాణాన్ని చేపట్టారు. జిల్లాలోని 5 సెగ్మెంట్ల పరిధిలో 75 ఆనకట్టలు నిర్మించవచ్చని గుర్తించగా.. ఇందులో 35 చెక్?డ్యాం పనులు చేపట్టారు. ఇప్పటివరకు 34 పూర్తికాగా రూ. 1.50 కోట్ల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. మరో చెక్?డ్యాంను రూ. 50 లక్షలతో నిర్మించాల్సి ఉంది.

**మోటార్లద్వారా మళ్లించుకునేలా..**

నిర్మాణం పూర్తయిన చెక్‌డ్యాంలతో 3 టీఎంసీల నీటి నిల్వ సాధ్యపడి 2,605 ఎకరాలకు నీరందుతుంది. వాగుల అంతర్భాగంలోనే చెక్?డ్యాంలను నిర్మించడంతో.. నీరు కరకట్టల లోపలనే నిలువుండి ముంపు, భూసేకరణవంటి సమస్యలు ఏర్పడలేదు. జిల్లాలోని ఆయకట్టు, ఆయకట్టేతర ప్రాంతాల్లో చెక్?డ్యాంలను నిర్మిస్తుండగా.. వాగుల్లో పారేనీటికి అడ్డుకట్ట కట్టడంతో చాలావరకు నీరు వెనక్కి నిలువుండి వాగులకు ఇరువైపులా భూగర్భ జలమట్టం సాధారణ స్థాయిలో కొనసాగుతుంది. దీంతో భూగర్భ జలాలను, ఆనకట్టల్లోని నీటిని రైతులు మోటార్లద్వారా పంటలకు మళ్లించుకోవచ్చు.

**రూ. 86 కోట్లతో...**

ఆనకట్టలకు ఇరువైపులా గ్రావిటీ కాలువలద్వారా రైతుల పొలాలకు నీటిని మళ్లించనున్నారు. ప్రతి ఆనకట్టలోనూ అయిదారు మీటర్ల ఎత్తువరకు నీరు నిలిచి చేపల పెంపకానికి అవకాశం ఏర్పడింది. గత వానాకాలంలో భారీ వర్షాలతో కొన్ని చెక్‌డ్యాంల కరకట్టలు కొట్టుకుపోవడం, కట్టలకు గండ్లుపడటం సంభవించాయి. ఈ నేపథ్యంలో చెక్?డ్యాంల మరమ్మతులు, గ్రావిటీ కాలువలు తదితరాలకు రూ. 15 కోట్లు.. గుర్తించిన మరో 40 చెక్‌డ్యాంల నిర్మాణానికి రూ. 86 కోట్లను విడుదలచేసి వేసవి వరకు పనులను పూర్తిచేస్తే పరిసర ప్రాంతాల ప్రజలకు మరిన్ని ప్రయోజనాలు దరిచేరుతాయి.

జిల్లాలో నాబార్డుద్వారా చేపట్టినవి: 26
పనులు పూర్తయినవి: 25
పురోగతిలో ఉన్నవి: 1
ఖర్చు చేసిన నిధులు: రూ. 58.85 కోట్లు
రాష్ట్ర బడ్జెట్? ద్వారా చేపట్టినవి: 9
పనులు పూర్తయినవి: 9
ఖర్చు చేసిన నిధులు: రూ. 32.79 కోట్లు

## ఆధునిక హంగులు.. తీరనున్న అవస్థలు

ఎల్లారెడ్డిపేట: స్వయం సహాయక సంఘాల సభ్యులకు సెర్ప్? తరచూ అవగాహన సదస్సులు, శిక్షణ తరగతులు నిర్వహిస్తుండగా అరకొర వసతులతో అతివలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితిని గమనించిన ప్రభుత్వం సీఎంటీసీ (కమ్యూనిటీ మండల్? లెవల్? ట్రైనింగ్? సెంటర్?)లను ఏర్పాటు చేస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఎనిమిది సీఎంటీసీలకు అనుమతి లభించింది. ఒక్కో దానికి రూ. 8.50 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసింది.

మహిళా సంఘాలకు జరిగే శిక్షణ తరగతులివీ మహిళల జీవనోపాధులు, సంఘాల బలోపేతం, సామాజిక అంశాలు (ఆరోగ్యం, పోషణ), లింగ వివక్షత తదితర అంశాలపై మహిళా సంఘాల సభ్యులకు శిక్షణను ఇస్తుంటారు. వీటితోపాటు ప్రభుత్వ రుణాలు– సద్వినియోగం, రికార్డుల నిర్వహణ, ఆర్థిక లావాదేవీల లెక్కలు, డిజిటల్? చెల్లింపులపై అవగాహన సదస్సులు నిర్వహిస్తుంటారు. మహిళల భద్రత తదితర అంశాలపై శిక్షణ అందిస్తూ అతివలు అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దేందుకు దోహదపడుతున్న మండల సమాఖ్య భవనాల్లోని సమావేశ వేదికలు ఆధునిక హంగులతో నూతన సొబగులను సంతరించుకోనున్నాయి.

ఎంపికైన మండలాలు.. ఎల్లారెడ్డిపేట, ఇల్లంతకుంట (రాజన్న సిరిసిల్ల), తిమ్మాపూర్, హుజూరాబాద్? (కరీంనగర్?), కోరుట్ల, రాయికల్? (జగిత్యాల), సుల్తానాబాద్, కమాన్?పూర్? (పెద్దపల్లి). ఎన్ఆర్ఎల్ఎం నిధులతో.. మండల సమాఖ్య భవనాల్లోని సమావేశ మందిరాల్లో ఆధునిక సౌకర్యాలను కల్పించేందుకు ఎన్?ఆర్?ఎల్?ఎం (నేషనల్? రూరల్? డెవలప్?మెంట్? ఫండ్) కేంద్ర ప్రభుత్వ నిధులను వెచ్చించనున్నారు. మొత్తం రూ. 68 లక్షలతో బల్లాలు, కుర్చీలు, ఫర్నీచర్, గదులకు ఆకట్టుకునే రంగులు, ప్రొజెక్టర్, ఇంటర్నెట్, కంప్యూటర్, ఆన్?లైన్?లో దూరదృశ్య శ్రవణ మాధ్యమ శిక్షణకు పెద్ద స్క్రీన్‌తో కూడిన టీవీ, సరిపడా ఫ్యాన్‌లు, టాయిలెట్స్? తదితరాలను అందుబాటులోకి తీసుకురానున్నారు.

## అదనపు యూనిట్లు.. అందుబాటులో సేవలు

గోదావరిఖని : ప్రతి బోధనాసుపత్రిలో అదనంగా రెండు డయాలసిస్ యూనిట్లు(మిషన్లు) ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ నిర్ణయం తీసుకోవడంతో అత్యవసరమైన వారికి సేవలు అందుబాటులోకి రానున్నాయి. వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షించిన మంత్రి దామోదర రాజనర్సింహ ఈ మేరకు నిర్ణయం తీసుకొన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, బోధనాసుపత్రుల్లో 102 రక్తశు ద్ధి కేంద్రాలున్నప్పటికీ అత్యవసరమైన వారికి డయాలసిస్ సేవలు అందించలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో కేవలం అత్యవసర సమయంలో మాత్రమే వినియోగించేలా ప్రతి బోధనాసు పత్రిలో అదనంగా రెండు యూనిట్లు ఏర్పాటు చేయడంతో అత్యవసర విభాగంలో రక్తశుద్ధి సేవలు అందుబాటులోకి రానున్నాయి.

సాధారణంగా రక్తశుద్ధి కేంద్రాల్లో షిఫ్టుల వారీగా సమయాన్ని



కేటాయిస్తారు. కేటాయించిన సమయం ప్రకారం కేంద్రాలకు వచ్చి రక్తశుద్ధి చేయించుకొని వెళ్తుంటారు. ఈ సమయంలో ఎవరికైనా రక్తశుద్ధి అవసరమైతే చేయలేని పరిస్థితులు నెలకొన్నాయి. రెగ్యులర్‌గా చేయించుకునేవారిని ఆపాల్సి ఉంటుంది. ఇది వారి ఆరోగ్యానికి ప్రమాదకరంగా మారనుంది. ఈ నేపథ్యంలో కేవలం అత్యవసరమైన వారికి మాత్రమే అదనపు యూనిట్లలో రక్తశుద్ధి చేసే అవకాశం ఉ ండగా రెగ్యులర్ రోగులకు ఎలాంటి ఇబ్బందులుండవు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఆరు కేంద్రాల్లో 40 యూనిట్లు అందుబాటులో ఉండగా 287 మంది రెగ్యులర్‌గా రక్తశుద్ధి చేయించుకుంటున్నారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం ప్రకారం ఉమ్మడి జిల్లాలో మొత్తం 12 డయాలసిస్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నారు.

## ర్యాగింగ్‌కు ముకుతాడు వేసేదెలా?

సంగారెడ్డి: ఇంటర్ నుంచి డిగ్రీ, బీటెక్, ఎంటెక్, ఎంబీబీఎస్ ఇలా వివిధ స్థాయిలోని కళాశాలల్లో ఏదో రూపంలో ర్యాగింగ్ జడలు విప్పుతోంది. దీన్ని అరికట్టేందుకు కళాశాలల్లో ర్యాగింగ్ నిరోధక కమిటీలను ఏర్పాటు చేయాల్సి ఉన్నా జాడ లేదు. ఏర్పాటైనవి నామమాత్రంగానే పనిచేస్తున్నాయి. బాధితులు ఫిర్యాదు చేయలేక కుమిలి పోతున్నారు. ఎవరైనా ధైర్యం చేసి కళాశాల యజమాన్యం ద ృష్టికి తీసుకెళ్తే బయటకు పొక్కకుండా లోలోపల సముదాయిస్తున్నారు. ర్యాగింగ్ భరించలేక విద్యార్థి ప్రాణాలు తీసుకునే ప్రయత్నం చేస్తే కడుపునొప్పితోనే.. చదువులో ఒత్తిడితోనో అనే సాకులు బయటకు వినిపిస్తున్నాయి. నిజానిజాలు సమాధి అవుతున్నాయి. ఎంతో భవిష్యత్తు ఉన్న విద్యార్థుల జీవితాలు ర్యాగింగ్‌కు బలి అవుతుండటం విషాదకరం.

**అవగాహనతోనే అడ్డుకట్ట**

రెండు రోజుల క్రితం సంగారెడ్డి వైద్య కళాశాలలో జరిగిన ఘటన విషయమై పట్టించుకునే వారే కరవయ్యారనే విమర్శలున్నాయి. తర్వాత మాత్రం పోలీసులు విద్యార్థులు, తల్లిదండ్రులు, కళాశాల అధ్యాపకులు, ర్యాగింగ్ నిరోధక కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. కొత్తగా చేరిన విద్యార్థులకు అవగాహన కల్పించాల్సి ఉ ంది. సీనియర్లు తమ ఆధిపత్యం కోసం జూనియర్లను వేధింపులకు గురి చేస్తున్నారు. సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లిలోని ఓ వైద్యకళాశాలలో ప్రథమ సంవత్సర విద్యార్థిని సీనియర్లు ర్యాగింగ్ చేశారు. బాధితుడి తల్లి ఫిర్యాదు చేయడంతో వెల్లడైంది. చట్టం కింద ఎనిమిది మందిపై కేసు నమోదైంది.

**ఎవరెవరు ఏం చేయాలి?**

ప్రిన్సిపల్ లేదా డైరెక్టర్ ఛైర్మన్‌గా ఉండే నిరోధక కమిటీలు ర్యాగింగ్ జరుగకుండా పర్యవేక్షించాలి.
ర్యాగింగ్ చేస్తే భవిష్యత్తు సమస్యలపై అవగాహన కల్పించాలి.
జిల్లా న్యాయ సేవాధికార సంస్థలు, ర్యాగింగ్ నిరోధక కమిటీలు సమావేశాలు నిర్వహించాలి.
కలెక్టర్లకు నివేదికలు సమర్పించాలి.
ర్యాగింగ్ నిషేధ చట్టాన్ని 1997లో తీసుకొచ్చారు.

జైలు శిక్ష తప్పదు
పరితోశ్ పంకజ్, ఎస్పీ, సంగారెడ్డి

ర్యాగింగ్‌కు పాల్పడితే బాధ్యులకు జైలు శిక్ష తప్పదు. విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు. చట్టాలు కఠినంగా ఉన్నాయి. కొన్ని ఘటనల స్థాయితో జీవితాంతం జైలు జీవితం గడపాల్సి ఉంటుంది. ప్రిన్సిపల్, అధ్యాపకులు సైతం బాధ్యులవుతారు. విద్యార్థులు స్నేహభావంతో మెలగాలి.

## భుజ బలంతోనే బాహు బిలం

నల్గొండ : వెలుగుమట్ల వద్ద 60 అడుగుల లోతుతో ప్రారంభమై మధ్యలో అత్యధికంగా 105 అడుగుల వరకు లోతు ఉండటం గమనార్హం. దీనిలో ఏడాది పొడవునా నీరు నిలిచి ఉంటుంది.

నాడు ఆధునిక యంత్రాలు లేవు.. కొండల్ని పిండిచేసే సామగ్రి లేదు. భుజ బలమే శ్రమజీవుల ఆయుధం. తమ రెక్కల కష్టంతోనే అతి లోతైన కాల్వను తవ్వేశారు. ఏళ్లు గడుస్తున్నా అక్కడి దృశ్యాలు నేటికీ గగుర్పాటుకు గురిచేస్తూనే ఉన్నాయి. వివరాల్లోకి వెళ్తే.. పూర్వ ఏపీలోని ఖమ్మం, కృష్ణా జిల్లాల్లో సాగునీటి అవసరాలు తీర్చేందుకు నాగార్జున సాగర్ ఎడమ కాల్వ నిర్మాణం చేపట్టారు. ఇందులో భాగంగా 1975లో పాలేరు చెరువు నుంచి ఏపీ నూజివీడు వరకూ కాల్వ నిర్మాణం ప్రారంభించారు. ఖమ్మం నగరానికి చేరువగా ఉన్న రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెం గ్రామం వద్ద ఎత్తైన నేలను తొలిచే క్రమంలో భాగంగా సన్నని లోతైన కాలువ (డీప్‌కట్) నిర్మాణం చేపట్టారు. వెలుగుమట్ల వద్ద నుంచి వి.వెంకటాయపాలెం గ్రామ శివారు వరకు కిలోమీటరు పొడవున దీన్ని నిర్మించారు. పూర్తిగా మానవ వనరులతోనే దీన్ని తవ్వారు. నగర, పరిసర వాసులు గతంలో తీవ్ర తాగునీటి ఎద్దడి ఎదుర్కొన్న సమయంలో ఈ డీప్‌కట్‌లో జలాలే అవసరాలను తీర్చాయి. స్థానిక పొలాలకు మాత్రం ఈ జలాలు అందే పరిస్థితి లేకపోవటంతో రైతులు కాల్వకు ఇరువైపులా విద్యుత్తు మోటార్లు ఏర్పాటు చేసుకున్నారు. ఈ డీప్‌కట్ ఆధారంగా గతంలో కొదుమూరు– వందనం, ఇటీవల మంచుకొండ ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు.

చురకలు



# కొల్లేరు మత్స్యం.. మేలిమి ముత్యం

మండవల్లి : కొల్లేరు నల్లజాతి చేపలకు ఇతర రాష్ట్రాల్లో భారీగా డిమాండ్ పెరిగింది. భారీ స్థాయిలో సరస్సులోకి వరద నీరు వచ్చి చేరడంతో మత్స్య సంపద వృద్ధి చెందేందుకు అవకాశాలు మెరుగుపడ్డాయి. కొల్లేరు కొరమీను, నాటు గొరక, జెల్ల, వాలుగ, మలుగు పాము, తుళ్లు, మట్టగిడస, ఇంగిలాయి, తిలాపి జాతులను ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసి లాభాలను ఆర్జిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో కొల్లేరు 77,138 ఎకరాల్లో ఉంది. దీన్నే నమ్ముకుని 9 మండలాల్లోని 122 గ్రామాల్లో 4 లక్షల మంది వరకు మత్స్యకారులు



ఆధారపడి జీవిస్తున్నారు. అయిదేళ్లలో అనుకున్న స్థాయిలో వరద నీరు రాకపోవడంతో ఉప్పు శాతం పెరిగిపోయి జనవరిలోనే కొల్లేరు పూర్తిగా ఎడారిలా మారిపోయేది. ఈ సంవత్సరం పెద్దఎత్తున వరద నీరు రావడంతో చేపల ఉత్పత్తి బాగుందని మత్స్యశాఖ ఏడీ రాజ్‌కుమార్ తెలిపారు. స్థానిక మార్కెట్, ఇతర రాష్ట్రాల్లో కిలోకు ఇలా ఉన్నాయి. కొరమీను300-500, నాటుగొరక 150-250, మట్టగిడస 200-300, బొమ్మిడాయి 300-450 తుళ్లు 140-200 ఉంది.
ఈ ఏడాది ఉత్పత్తి బాగుంది.. కొల్లేరు నుంచి మహారాష్ట్ర, కర్ణాటక, బిహార్, ఉత్తర్‌ప్రదేశ్, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్, ఢిల్లీ, ముంబయి, హైదరాబాద్‌కు నల్లజాతి చేపలు ఎగుమతి చేస్తున్నారు. ముఖ్యంగా రారాజుగా పిలిచే కొరమీను ఉత్పత్తి ఈ సంవత్సరం భారీగా ఉంది. ఏటా 2 వేల టన్నుల వరకు పంపుతుంటే ప్రస్తుతం 4 వేల టన్నుల వరకు ఉత్పత్తయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

## గోదావరికి అనూహ్యంగా వరద

కుక్కునూరు : గోదావరిలో వరద ఆకస్మికంగా పెరిగింది. తొలుత పోలవరం వెనుక జలాలని జాలర్లు అనుకున్నారు. ఎగువ నుంచి వస్తున్నట్లు గమనించి, చాలా మంది తమ నివాసాలను ఖాళీ చేశారు. మిర్చికోతల కోసం ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన కూలీలు, నదిలో ఇసుక తిన్నెలపై గుడారాలు వేసుకొని తాత్కాలికంగా ఉన్నారు. ఆకస్మికం గా వరద పెరగడం, ఆ సమయంలో వారంతా మిర్చి తోటల్లో కోత పనుల్లో నిమగ్నమై ఉండటంతో ఆవాసాల చుట్టూ నీరు



చేరి కనిపించింది. వారంతా దాచుకున్న బియ్యం, కూరగాయలు నీటిలో మునిగిపోయాయి. అప్పటికప్పుడు సామగ్రిని బయటకు తెచ్చుకొని, గుడారాలను ఒడ్డున వేసుకున్నారు. ఎగువ ప్రాంతంలో ఇసుక ర్యాంపుల వద్ద వేసిన అడ్డుకట్టలు తెగి, వరద ఒకేసారి కిందికి ప్రవహిస్తున్నట్లు జాలర్లు అభిప్రాయపడుతున్నారు. శివరాత్రి ముందు వరద పెరుగుతుండటం, శివాలయాలన్నీ గోదావరి ఒడ్డున ఉండటంతో, అధికారులు అప్రమత్తమయ్యారు.

# సాగర్‌కు విముక్తి!

అద్దంకి : ఆక్రమణలతో కునుమరుగైన సాగర్ కాలువకు విముక్తి కలగనుంది. మినీ బైపాస్ పేరుతో అద్దంకి పట్టణంలో ఇప్పటికే 1.5 కిలోమీటర్ల పొడవున ఆక్రమణలు అధికారులు తొలగించారు. త్వరలో కాలువ ఆధునికీకరణ పనులు సైతం చేపట్టబోతున్నారు. పనులు పూర్తయిన అనంతరం మిగిలిన కాలువ ఆక్రమణలు తొలగించి చివరి ఆయకట్టు వరకు సాగునీరందించాలనే యోచనలో అధికారులు ఉన్నారు.
**మూడు దశాబ్దాలుగా...:** అద్దంకి మేజరు కాలువ ఏబీసీ (అద్దంకి బ్రాంచి కాలువ) నుంచి ప్రారంభమవుతుంది. 0/0 నుంచి 22/0 మైలురాయి వరకు విస్తరించింది.



గత తెదేపా ప్రభుత్వ హయాంలో ప్రపంచ బ్యాంకు నిధులతో 16/0 మైలురాయి వరకు ఆధునికీకరించారు. ఫలితంగా సాగర్ జలాలు అక్కడి వరకు ప్రవహిస్తున్నాయి. మిగిలిన ఆరు కిలోమీటర్లు నీటిపారుదల లేకుండా పోయింది. ఇందులో అద్దంకి, వేలమూరిపాడు, కొంగపాడు, మణికేశ్వరం గ్రామాల భూములున్నాయి. మూడు దశాబ్దాలు కిందట సాగర్ నీటితో సుమారు 2 వేల ఎకరాల్లో పంటలు సాగయ్యేవి. క్రమంగా సాగర్ జలాశయంలో నీరు లేకపోవడంతో ఆరు కిలోమీటర్ల సాగర్ కాలువ ఆక్రమణకు గురైంది. **మినీ బైపాస్ రాకతో...:** అద్దంకి పట్టణంలో మినీ బైపాస్ నిర్మాణంతో సాగర్ కాలువ ఆక్రమణ చెర నుంచి బయటపడింది. ఇందులో భాగంగా కీలకమైన 1.5 కిలోమీటర్ల పొడవున సాగర్ కాలువ ఆధునికీకరణ పనులు చేపట్టనున్నారు. మినీ బైపాస్ నిర్మాణం పూర్తయిన అనంతరం చివరి ఆయకట్టుకు నీరందించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ఎన్ఎస్పీ డీఈ కె.రామకృష్ణ మాట్లాడుతూ అద్దంకి మేజరు కాలువ చివరి భూములకు మూడు దశాబ్దాలుగా నీరందక పోవడం వాస్తవమేనన్నారు. తాజాగా మినీ బైపాస్ నిర్మాణంతో సాగర్ కాలువ తిరిగి పూర్వవైభవం సంతరించుకోనుందన్నారు. ఆక్రమణలు తొలగించి ఆయకట్టు రైతులకు నీరందించాలనే ఆలోచనలో ఉన్నామని వివరించారు.

# ఎన్నైనా చెప్పండి.. పక్కనెడతాం.. హెల్మెట్ కూడా



భీమవరం : ఎంత దూరం.. కిలోమీటరే కదా.. శిరస్త్రాణం ఎందుకు బరువు.. వెంటనే వచ్చేస్తానని తండ్రికి చెప్పి వెళ్లిన కుమారుడు నిమిషాల వ్యవధిలోనే విగతజీవిగా మారాడు. వాహనం అదుపు తప్పి పడిపోవడంతో తలకు బలమైన గాయమై మృతి చెందాడు.అండగా ఉంటాడనుకున్న ఒక్కగానొక్క కుమారుడు అర్ధాంతరంగా తనువు చాలించడంతో ఆ తల్లి మనోవేదనతో ఇంటి నుంచి బయటకు రావడమే మానేసింది. ఇది ఓ తల్లి వేదన కాదు.. ఇలా ఎందరో పేగుబంధానికి దూరమై కుమిలిపోతున్నారు. జిల్లాలో ఎక్కడో చోట శిరస్త్రాణం ధరించక ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. పేరుపాలేనికి చెందిన ఓ యువకుడు పాలకొల్లులోని ఓ ప్రైవేటు బ్యాంకులో పనిచేస్తున్నాడు. రెండు నెలల కిందట విధులు ముగించుకుని ఇంటికొచ్చే క్రమంలో వాహనం అదుపు తప్పి పడిపోయాడు. తలకు బలమైన గాయాలు కావడంతో భీమవరం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.
ఇటీవల యలమంచిలి మండలం ఆర్యపేటకు చెందిన జి.వెంకట తాతాజీ (20), బి.కమలాకర్ మేడపాడు ఆంజనేయస్వామి ఆలయం వద్ద శునకాన్ని తప్పించబోయి కింద పడిపోయారు. కమలాకర్ స్వల్ప గాయాలతో బయట పడగా తాతాజీ తలకు బలమైన గాయం కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశాడు.
216 జాతీయ రహదారిలో ముత్యాలపల్లి నుంచి మొగల్తూరు వరకు పరిశీలించగా సుమారు 832 మంది చోదకుల్లో కేవలం 64 మందే శిరస్త్రాణం ధరించారు.
భీమవరం నుంచి తాడేపల్లిగూడెం మీదుగా 670 మంది వెళ్లగా 28 మందే తలపై పెట్టుకున్నారు.
తణుకు పైడిపర్రు కూడలి నుంచి తేతలి గ్రామ కూడలి వరకు 342 వాహనాలు రాకపోకలు సాగించగా 17 మందే శిరస్త్రాణం ధరిస్తే, 10 మందికి ఉన్నా బండికి పక్కన తగిలించారు.
భీమవరం పోలీసుబొమ్మ కూడలి నుంచి బుధవారం మార్కెట్ మీదుగా 240 వాహనాలు వెళ్లగా 32 మందే హెల్మెట్ పెట్టుకోగా.. 9 మంది పక్కన తగిలించారు.
జిల్లాలో తణుకు, తాడేపల్లిగూడెం, భీమవరం, మొగల్తూరు ముఖ్యకూడళ్లలో శని, ఆదివారాలు పరిశీలించగా 90 శాతం మంది ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం ధరించడం లేదు. విస్తుపోయే సమాధానం.. శిరస్త్రాణం ధరించని వారిని పోలీసులు ప్రశ్నిస్తే వేడికి జుట్టు ఊడిపోతుందని.. కొత్తగా హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించుకున్నామని.. మెడనొప్పి, ఉక్కపోత అంటూ వింత సమాధానాలు ఇస్తున్నారు. రెండు మూడు కిలోమీటర్లే కదా అంటూ సమర్థించుకుంటున్నారు.
శని, ఆదివారాలు ఎక్కువ.. ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం ధరిస్తే రోడ్డు ప్రమాదం జరిగినా 70 శాతం ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నట్లే. హెల్మెట్ పెట్టుకున్న వారు క్లిప్పులు సరిగా పెట్టుకోక ప్రమాద సమయంలో ఊడిపోయి తీవ్రంగా గాయపడుతున్నారు. ట్రాఫిక్ పోలీసుల అధ్యయనం ప్రకారం సాధారణ రోజులతో పోలిస్తే శని, ఆదివారాలు.. అందులోనూ సాయంత్రం తర్వాత ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.

# ఉంది బతకాలని.. ఉండా బతికించాలని



భీమవరం : 'మా నాన్న టైలరింగ్ చేసేవారు. ఎటువంటి చెడు అలవాట్లు లేకపోయినా మూత్రపిండాలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వ స్లాట్ దొరక్కపోవడంతో ప్రైవేట్‌గా డయాలసిస్ చేయించుకుంటున్నా. రవాణాకే నెలకు రూ.8 వేలు అవుతోంది. ప్రభుత్వ ఆసుపత్రికి 108లో తీసుకెళ్తే రవాణా ఖర్చులు మిగిలేవి. గతంలో ఇద్దరి పిల్లలను కార్పొరేట్ పాఠశాలలో చదివించేవాడిని. ఇప్పుడు ఖర్చులు పెరగడంతో ఒకర్ని ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నాను' అని మొగల్తూరుకు చెందిన చిరుద్యోగి కన్నీరు పెట్టుకున్నారు. నాలుగేళ్లుగా డయాలసిస్ చేయించుకుంటున్నా. ఆసుపత్రికి వెళ్లాలంటే నాతో పాటు మరో ఇద్దరు తోడు వస్తారు. నెలకు రూ.6 వేల వరకు రవాణా ఛార్జీలు అయ్యేవి. కొంతకాలానికి 108 సేవలు వినియోగించుకోవచ్చనే విషయం తెలియడంతో మూడు నెలలు వెళ్లాం. ఇప్పుడు ఆ సేవలు నిలిపివేయడంతో ఆర్థికంగా భారమవుతుందని కొత్తపాలేనికి బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.
పాపం.. మూత్రపిండాల వ్యాధితో బాధపడుతూ రక్తశుద్ధి (డయాలసిస్) చేయించుకుంటున్న బాధితుల బాధలు వర్ణనాతీతం. ఉమ్మడి జిల్లాలోని ఏలూరు, జంగారెడ్డిగూడెం, తణుకు, ఆకివీడు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు ఆసుపత్రుల్లో డయాలసిస్ సేవలు అందుతున్నాయి. ఆరోగ్యశ్రీ సేవ ద్వారా భీమవరంలో రెండు, ఏలూరులో మూడు ప్రైవేటు ఆసుపత్రుల్లో రోజూ సుమారు 440 మందికి డయాలసిస్ జరుగుతోంది. జీవన్‌దాన్‌లో సుమారు 2,350 మంది ఎదురు చూస్తున్నారు.
జిల్లాలో స్లాట్‌లు అందుబాటులో లేని క్రమంలో రాజమహేంద్రవరం, విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తోంది. రోడ్డు ప్రమాదాలు జరిగితే 108 వాహనాలు అందుబాటులో ఉండటం లేదని, అందువల్లే డయాలసిస్ బాధితులను తీసుకెళ్లడం కుదరడం లేదని వైద్య వర్గాలు చెబుతున్నాయి.
**ఆర్థికంగానూ భారమే..** వ్యాధి తీవ్రతను బట్టి వారానికి రెండు నుంచి నాలుగుసార్లు డయాలసిస్ చేయించాలి. దీనికి తోడు ఒక ఇంజెక్షన్ ఖరీదు రూ.2 వేల వరకు ఉంది. పైగా ప్రైవేటు బ్లడ్ బ్యాంకుల్లో రక్తం కొనుగోలు చేసుకోవాలి. డయాలసిస్ చేయించే క్రమంలో రోగితో పాటు మరో ఇద్దరు తోడుండాలి. వైద్యానికి ఒకసారికి కనీసం రూ.8-12 వేల వరకు ఖర్చవుతోంది. దీనికి రవాణా ఛార్జీలు తోడవడంతో పేద, మధ్య తరగతి వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. గతంలో పౌష్టికాహారం, ఇతరత్రా వాటికి వినియోగించే సొమ్ములు రవాణాకు ఖర్చు చేయాల్సి వస్తోందని తణుకుకు చెందిన ఓ బాధితురాలు వాపోయింది. ఉన్నతాధికారులకు సమస్యను నివేదిస్తామని డీసీహెచ్‌ఎస్ సూర్యనారాయణ తెలిపారు.
ఉమ్మడి జిల్లాలో జీవన్‌దాన్‌లో నమోదు చేసుకున్న బాధితులు: సుమారు 2350 మంది డయాలసిస్ పింఛను పొందుతున్న వారు పశ్చిమ 444, ఏలూరు 382

# ట్రామాకేర్‌తోనే ఊపిరి



ఒంగోలు : మేదరమెట్ల వద్ద గతేడాది అక్టోబరులో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ముగ్గురు గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన వారికి సకాలంలో వైద్యం అంది ఉంటే కాళ్లు తొలగించే పరిస్థితి ఉండేది కాదు. దీంతో వారు దివ్యాంగులుగా మారిపోయారు. కనిగిరి నుంచి చిన్నారికట్లకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తి కనిగిరి దేవాంగనగర్ సమీపంలో ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. తక్షణం అత్యవసర వైద్యం అందక పోవడంతో కోమాలోకి వెళ్లిపోయారు.రహదారి ప్రమాదాల్లో సకాలంలో చికిత్స అందక ఎంతోమంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ప్రాణాలు నిలుపుకొనేందుకు వంద కిలోమీటర్ల దూరం వరకు ప్రయాణించాల్సి రావడంతో మార్గమధ్యలోనే తనువు చాలిస్తున్నారు. జిల్లాలో అందుబాటులో ట్రామాకేర్ కేంద్రాలు ఏర్పాటైతే ఊపిరి పోయవచ్చు. ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో పది వరకు జాతీయ రహదారులు వెళతాయి. వేగంగా దూసుకొచ్చే వాహనాలతో ద్విచక్రవాహనాలపై వెళ్లేవారు, రహదారి దాటే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నారు. చాలా సంఘటనల్లో తక్షణ వైద్యసేవలందక మృతి చెందుతున్నవారు ఎక్కువగా ఉంటున్నారు. అత్యవసర వైద్య సేవలు స్థానికంగా అందుబాటులో లేక ఒంగోలు, గుంటూరు, నరసరావుపేట, నెల్లూరు ప్రాంతాలకు వెళ్లేలోగా మార్గమధ్యలో ప్రాణాలు విడుస్తున్నారు. రాత్రి పూట రవాణా సౌకర్యం అందుబాటులో లేక క్షతగాత్రుల వేదన అంతా ఇంతా కాదు. శ్రీశైలం, గిద్దలూరు ఘాట్‌రోడ్లలో ప్రమాదాలు జరిగితే ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. ఒంగోలులో కేంద్ర ప్రభుత్వ నిధులతో ట్రామా కేర్ సెంటరును సిద్ధం చేశారు. మార్కాపురం, సింగరాయకొండ, మేదరమెట్ల ప్రాంతాల్లో ట్రామా కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

**పశ్చిమ ప్రకాశంలో దయనీయం**

గిద్దలూరులో ప్రమాదం జరిగితే క్షతగాత్రులను 140 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒంగోలుకు గానీ, 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న నంద్యాలకు గానీ వెళ్లాల్సి వస్తోంది. ఈలోగా రక్త స్రావం అధికమై ప్రాణాలు కోల్పోతున్నారు. శ్రీశైలానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చేవారు ప్రమాదాల బారిన పడితే 120 కిలోమీటర్ల దూరంలో ఉన్న నరసరావుపేటకు గానీ, 130 కిలోమీటర్ల దూరంలో ఉన్న కర్నూలుకు గానీ వెళ్లాల్సి వస్తోంది. ఓవైపు తీవ్ర గాయాలతో బాధపడుతూ మరోవైపు బాధను భరించలేక నరకయాతన అనుభవిస్తున్నారు. మార్కాపురంలో ట్రామా కేర్ కేంద్రం అందుబాటులోకి వస్తే దాదాపు ఆరు జాతీయ రహదారులపై ప్రయాణించేవారు ఎవరు గాయపడినా తక్షణ వైద్యసేవలందించవచ్చు.
**ప్రతిపాదనలకే పరిమితం**జిల్లాలోని 16వ నంబరు జాతీయ రహదారిపై వాహనాల తాకిడి ఉన్నందున ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. కరోనా సమయంలో మేదరమెట్ల వద్ద ట్రామాకేర్ కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అనంతరం ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో అడుగు ముందుకు పడలేదు. అద్దంకిలో ట్రామాకేర్ కేంద్రం ఆవశ్యకతపై గతేడాది బాపట్ల జిల్లా వైద్యాధికారి వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించారు. మేదరమెట్ల వద్ద గానీ, అద్దంకిలో గానీ అందుబాటులోకి వస్తే నామ్ రహదారిపై బాధితులకు కూడా వైద్యసేవలు అందించవచ్చు. ఒంగోలు దాటిన అనంతరం నెల్లూరు వరకు ఎక్కడా ఆసుపత్రులు అందుబాటులో లేవు. సింగరాయకొండ ప్రాంతంలో ట్రామా కేర్ కేంద్రం ఏర్పాటైతే అటు కందుకూరు వైపు వెళ్లే జాతీయ రహదారిపై క్షతగాత్రులైనవారికి మెరుగైన వైద్యం అందుతుంది.

# దడ పుట్టిస్తున్న అనిశా

ఒంగోలు : అవినీతి నిరోధక శాఖ (అనిశా)... ఈ పేరు వింటేనే అవినీతి అధికారులు, సిబ్బంది గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. అవినీతి, అక్రమార్జనలో నిండా మునిగిన అధికారులపై అనిశా కొరడా ఝుళిపిస్తోంది. వరుస దాడులు, తనిఖీలతో ముచ్చెమటలు పట్టిస్తోంది. కేవలం పది రోజుల వ్యవధిలోనే అవినీతి పరులకు అరదండాలు వేసింది. కేవలం ట్రాప్ కేసులు (లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవడం) మాత్రమే కాకుండా అసెట్స్ (అక్రమార్జన, ఆదాయానికి మించిన ఆస్తులు), ఆకస్మిక తనిఖీలతో భయం పుట్టిస్తోంది. అనిశా ప్రదర్శిస్తున్న దూకుడుతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని అవినీతిపరులు హడలిపోతున్నారు.
ఫిబ్రవరి 1వ తేదీన దర్శి పురపాలక సంఘం కమిషనర్ మహేశ్వరరావు అక్రమాస్తులపై అనిశా దాడి చేసింది. దర్శి, వినుకొండ, సత్తెనపల్లి, నరసరావుపేట, గుంటూరు ప్రాంతాల్లో ఆరు బృందాలతో తనిఖీలు చేపట్టిన అధికారులు భారీగా అక్రమార్జనను గుర్తించారు. పలుచోట్ల ఆయనకు విలువైన భూములు, ఆస్థులు ఉన్నట్లు గుర్తించారు.
ఈ నెల 6వ తేదీన గనులు, భూగర్భ వనరులశాఖ సర్వేయర్ షేక్ అబ్దుల్ ఆసిఫ్ అక్రమాస్తులపై గురిపెట్టింది అనిశా. ఒంగోలు, కనిగిరి, మార్కాపురం, విజయవాడల్లో ఆయన నివాసాలు, బంధువుల ఇళ్లలో దాడులు చేపట్టింది. కేవలం 13 ఏళ్ల సర్వీసులో రూ.ఆరు కోట్లకు



పైగా అక్రమార్జనకు పాల్పడినట్లు గుర్తించింది. ఆయన పేరిట 22 ఎకరాల భూమితో పాటు భారీఎత్తున బంగారం, వెండిని గుర్తించి నిందితుడిని అరెస్టు చేసి జైలుకు పంపింది.
తాజాగా కొత్తపట్నం మండలం కె.పల్లెపాలెంలో పంచాయితీ కార్యదర్శి సంపత్‌కుమార్ శ్మశానవాటిక ప్రహరీ నిర్మించిన గుత్తేదారు జాజుల జాలారామ్ నుంచి రూ.55 వేలు లంచం తీసుకుంటూ అనిశాకు చిక్కారు. కార్యదర్శి సంపత్‌కుమార్ అవినీతి వ్యవహారాలపై పక్కా సమాచారంతో కేసు నమోదు చేసిన అధికారులు అతను లంచం తీసుకుంటున్న సమయంలో పట్టుకున్నారు.
సుమారు రెండు నెలల ముందు ఒంగోలు రిజిస్ట్రార్ కార్యాలయంలో అనిశా అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కార్యాలయంలో నిత్యం జరిగే లావాదేవీల్లో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయనే సమాచారంతో రెండు రోజులపాటు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించింది. రికార్డులు పరిశీలించి అక్కడ జరుగుతున్న వ్యవహారాలను ప్రభుత్వానికి నివేదించింది. కేవలం పదిరోజుల వ్యవధిలోనే రెండు అక్రమాస్తుల కేసుల్లో అధికారులు పట్టుబడడంతో అనిశా తదుపరి చూపు ఎవరిపై అన్నది ఉమ్మడి ప్రకాశం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

# తీరం.. తీరు మారుతోంది!

అమలాపురం: జిల్లాలోని తీర ప్రాంతంలో భౌగోళికంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఈ జిల్లాలో 85.85 కిలోమీటర్ల పొడవున తీరప్రాంతం ఉంది. ప్రతి ఐదేళ్ల కాలపరిమితితో పరిశీలిస్తే.. కొన్నిచోట్ల సముద్ర కోతతో కొంత భూమి నీటిలో కలిసిపోతుండగా.. మరికొన్నిచోట్ల కొత్త భూభాగం ఏర్పడుతోందని ఏపీ స్పేస్ అప్లికేషన్ సెంటర్ (ఏపీఎస్ఏసీ) పరిశీలనలో తేలింది. తీర ప్రాంతంలో మార్పులపై జిల్లా యంత్రాంగం నివేదిక కోరడంతో ఏపీఎస్ఏసీ 1989 నుంచి 2021 వరకు ప్రతి ఐదేళ్లకోసారి శాటిలైట్ చిత్రాలను విశ్లేషించి వెల్లడించింది. అంతర్వేది, వాడలరేవు, ఎస్.యానాం, బెండమూరులంక పరిధిలో దాదాపు 6.65 కి.మీ. మేర (ఏడాదికి 5 నుంచి 2 మీటర్లు) సముద్ర గర్భంలో కలిసిపోతోంది. కొన్నిచోట్ల ఏటా అర మీటరు నుంచి రెండు మీటర్ల వరకు కోత ప్రభావం ఉంటోంది.
గౌతమి గోదావరి సమీప కొత్తపాలెం, అంతర్వేది గ్రామాల పరిధిలో తీర ప్రాంతం ఏడాదికి 5 మీటర్లకు మించి సాగరంలో కలిసిపోతోంది.

**52.14 కి.మీ. అదనంగా..**

సముద్ర తీరంలో మార్పుల కారణంగా 52.14 కి.మీ. మేర (60.70 శాతం) కొత్త భూభాగం ఏర్పడింది. 27.85 కి.మీ. మేర ఏటా ఐదు మీటర్లకు మించి ఉంటే.. 13.6 కి.మీ. పరిధిలో రెండు నుంచి అయిదు మీటర్లు, 4.99 కి.మీ. పరిధిలో అర మీటరు మేర అదనంగా భూభాగం కలుస్తోంది.

**ఏడాదికి 5 మీటర్లకు పైగా..**



జిల్లాలోని తీర ప్రాంతంలో 22.72 కి.మీ. పొడవు (33.35 ?ల్వా) శాతం) కోతకు గురైనట్లు నిర్ధారణైంది. కోత తీవ్రత 18.99 కి.మీ. వరకు అధికంగా (ఏడాదికి అయిదు మీటర్లకు పైగా) ఉంది. 6.65 కి.మీ. వరకు ఓ మాదిరిగా (ఏడాదికి 2 నుంచి 5 మీటర్లు), 3.08 కి.మీ. (రెండు మీటర్ల కంటే దిగువన) తక్కువగా ఉంది.
కొత్త భూభాగం పెరుగుదల గౌతమి గోదావరి పరీవాహకంలో ఏటా 5 మీటర్లకు మించి ఉంటోంది. ఇది కేశవదాసుపాలెం-గొల్లపాలెం, చిర్రయానం-పొర గ్రామాల మధ్య, మాసానితిప్ప (రిజర్వ్ ఫారెస్ట్)లో 27.85 కి.మీ. నమోదైంది.
వాసాలతిప్ప, అంతర్వేది, గొల్లపాలెం, చిర్రయానాంలో 13.6 కి.మీ. మేర.. అంటే ఏటా రెండు నుంచి అయిదు మీటర్ల కొత్త భూభాగం ఏర్పడుతోంది. చిర్రయానాం, వాసాలతిప్ప, గొల్లపాలెం సమీపంలో 10.69 కి.మీ. మేర రెండు మీటర్ల లోపు పెరుగుదల ఉంది. కేవలం 4.99 కి.మీ. పరిధిలో స్థిరంగా ఉంది.

# మట్టి మాఫియా బరితెగింపు



అనంతపురం: మట్టికి డిమాండ్ పెరగడంతో సోమందేపల్లి మండలం కొత్తపల్లి, చాలకూరు, సోమందేపల్లి చెరువు , పరిగి మండలంలోని పరిగి, ఎర్రగుంట గ్రామాల చెరువులను తవ్వేసి అక్రమంగా తరలిస్తున్నారు. రాత్రి వేళల్లో ఈ దందా యథేచ్ఛగా సాగిపోతోంది. కొత్తపల్లి, చాలకూరులో తవ్వింది సోమందేపల్లి మండలంలో... పరిగి నుంచి హిందూపురానికి అక్రమ రవాణా చేస్తున్నారు.
ప్రకృతిని కాపాడుకుంటే మానవాళికి ఎంతో ప్రయోజనం.. కొందరు స్వార్థపరులు మాత్రం విధ్వంసానికి పాల్పడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. అడిగేవారు లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వనరులను కొల్లగొడుతున్నారు. పెనుకొండ నియోజకవర్గం పరిధిలో నూతన పరిశ్రమలు ఏర్పాటు కానుండటంతో సమీపాన పలు నిర్మాణాలు జోరందుకున్నాయి. ప్రధానంగా భవన నిర్మాణానికి ప్రధానంగా అవసరమైన ఎర్రమట్టిని చెరువులు, ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా తవ్వేసి.. దోచేస్తున్నారు. ముఖ్యంగా సోమందేపల్లి, పరిగి, రొద్దం, గోరంట్ల మండలాల్లో మట్టిమాఫియా రెచ్చిపోతోంది.

**రోజూ వందల్లో...:** అక్రమార్కులు ట్రాక్టర్ మట్టిని రూ. 1,000 నుంచి 1,200 వరకు, ఒక టిప్పర్ అయితే రూ.6 వేల నుంచి 7 వేలకు విక్రయిస్తూ జేబులు నింపుకొంటున్నారు. నిత్యం ట్రాక్టర్లలో వందకుపైగా ట్రిప్పులు.. టిప్పర్లలో 70 నుంచి 80 పైగా ట్రిప్పుల్లో రవాణా చేస్తున్నారు.కొందరు ప్రజాప్రతినిధులు, నాయకుల కనుసన్నల్లోనే మట్టి దందా సాగుతోంది. దీంతో మాఫియా బరితెగిస్తోంది. మరోవైపు కొందరు అధికారులు మట్టిమాఫియాతో కుమ్మక్కై మరింతగా రెచ్చిపోతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల హిందూపురం రోడ్డు పక్కన ఉన్న ఓ గ్రామంలో మట్టి తరలిస్తున్న వాహనాలను అధికారులు జప్తు చేసినా...
రాజకీయ ఒత్తిడి కారణంగా మార్గమధ్య లోనే వదిలిపెట్టి వెళ్లిపోయారని స్థానికులు ఆరోపిస్తున్నారు.
అక్రమంగా తరలిస్తే ఉపేక్షించం–ఆనంద్‌కుమార్, ఆర్డీవో, పెనుకొండ
అనుమతులు లేకుండా ఎక్కడైనా మట్టి తరలిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించం. మట్టి తవ్వకాలకు అడ్డుకట్ట వేయడానికి రెవెన్యూ, పోలీసు, జలవనరుల శాఖ అధికారులను సమన్వయం చేసి చర్యలు తీసుకుంటాం. అక్రమంగా మట్టి తరలించే వాహనాలను జప్తు చేస్తాం.

# దూరం తగ్గాలని.. ప్రమాదాలకు దగ్గరవకు

అనంతపురం: అనంతపురం–అమరావతి రహదారిలో శింగనమల క్రాస్ వద్ద పలు వాహనాలు సుమారు పావు కిలోమీటరు అపసవ్య (రాంగ్‌రూట్) మార్గంలో వస్తున్నాయి. అనంతరం అక్కడున్న యూటర్న్‌లో అనంతపురం వెళ్లే రోడ్డుకు మళ్లుతున్నాయి.అనంతపురం–అమరావతి జాతీయ మార్గం కావడంతో అటువైపుగా సాగే వాహనాలు చాలా వేగంగా వస్తుంటాయి. ఈక్రమంలో ప్రమాదాలకు దారితీసే అవకాశం పొంచి ఉంది. శింగనమల నుంచి వచ్చే దాదాపు ప్రతి వాహనం ఇలా రాంగ్‌రూట్‌లో వస్తున్నాయి. యూటర్న్ చేరుకోవడానికి దగ్గరగా ఉంటుందని చోదకులు ఇలా చేస్తున్నారు. ఇది తప్పు కదా అని అడిగితే అటువైపుగా కిలోమీటరు వెళ్లి యూటర్న్ తీసుకొని మళ్లీ కిలోమీటరు రావాలి కదా అని సమాధానం ఇస్తుండటం గమనార్హం.



రాంగ్‌రూట్‌లో వస్తున్న జీపు అనంతపురం రోడ్డులో కలవడానికి ప్రయత్నిస్తుండగా, తాడిపత్రి నుంచి వస్తున్న కారు శింగనమల వైపు వెళ్లేందుకు యూటర్న్ తీసుకుంటోంది. అవి రెండూ ఒకదానికొకటి ఢీకొట్టే పరిస్థితి. త్రుటిలో బ్రేకు వేయడంతో ప్రమాదం తప్పింది.
శింగనమల నుంచి అనంతపురం వెళ్లే ఆర్టీసీ బస్సు అనంతపురం–అమరావతి మార్గంలో రాంగ్ రూట్‌లో వస్తోంది. అదే సమయంలో సవ్య దిశలో లారీ వస్తోంది. ఏదైనా ప్రమాదం జరిగితే 1033 నంబర్‌కు ఫోన్ చేయండని రాసి ఉన్న సూచిక కనిపిస్తోంది.

# జనఔషధికి తప్పని నిరీక్షణ

గుంతకల్లు : రైల్వే ప్రయాణికులకే కాకుండా ఇతరులకు నాణ్యమైన మందులను తక్కువ ధరలకు అందుబాటులోకి తేవాలన్న సంకల్పంతో 'ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి' యోజన రూపొందింది. ఇందులో భాగంగా అనంతపురం, గుంతకల్లు రైల్వేస్టేషన్లలో నాలుగు నెలల క్రితమే మందుల దుకాణాలకు ఏర్పాట్లు చేశారు. నాణ్యమైన మందులతో పాటు శస్త్రచికిత్సలకు అవసరమైన సామగ్రిని మార్కెట్ ధరలకన్నా 50 నుంచి 90 శాతం తక్కువకు ఇవ్వాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఈక్రమంలో రైల్వే వాణిజ్య అధికారులు గుంతకల్లు జంక్షన్‌లో ఓ గదిని కేటాయించారు. రైళ్ల ప్రయాణికులు అస్వస్థతకు



గురైతే ఆయా స్టేషన్లలో మందులు అందుబాటులో ఉంటూ ప్రాణాపాయం నుంచి బయటపడటానికి ఇవి దోహదం చేస్తాయి. వీటి గురించి కమర్షియల్ విభాగానికి చెందిన అధికారులను అడగ్గా, గుంతకల్లు మందుల దుకాణానికి టెండరు వేసిన గుత్తేదారులు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు ఇవ్వలేదన్నారు. అందుకే ప్రారంభించడంలో జాప్యం జరుగుతోందన్నారు. ప్రస్తుతం అనంతపురం రైల్వేస్టేషన్‌లో గది అందుబాటులోకి వచ్చిందన్నారు. గుంతకల్లు, అనంతపురం మందుల దుకాణాల నిర్వహణకు సంబంధించి ప్రస్తుతం టెండరు ప్రక్రియ కొనసాగుతోందని ఆయన వివరించారు.

# భక్తికి నిర్వచనం.. కన్నప్ప

శ్రీకాళహస్తి : భక్తితో పూజించిన వెంటనే పరవశించిపోయే ఆదిదేవునికి రెండు కళ్లు సమర్పించి నిస్వార్థ భక్తికి సంపూర్ణ నిర్వచనమయ్యాడు భక్తకన్నప్ప. మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల అంకురార్పణగా.. భక్తకన్నప్ప నేతృత్వంలో కైలాసనాథస్వామికి నిర్వహించే ధ్వజారోహణ ఘట్టంతో ఉత్సవాలు ప్రారంభించడం శ్రీకాళహస్తి ప్రత్యేకం. అందుకే ఇక్కడి క్షేత్రం భూతల కైలాసంగా దినదిన ప్రవర్తమానం చెందుతోంది. అందుకే బ్రహ్మోత్సవాల్లో తొలి రోజున ఇక్కడి కైలాసనాథునికి భక్తకన్నప్ప నేతృత్వంలో ధ్వజారోహణం నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది.
కన్నులిచ్చి.. కన్నప్పగా...: ఎందరో శివభక్తులున్నా తిన్నడిది అగ్రస్థానం. ద్వాపర యుగంలో అర్జునుడే తరువాత జన్మలో బోయవానిగా జన్మించి తిన్నడయ్యాడు. దైవంపై నమ్మకం లేని తిన్నడు ఇక్కడి శివలింగాకృతికి



ఆకర్షితుడై అపరభక్తుడయ్యాడు. అతని భక్తిని పరీక్షించేందుకు శివుడు శివలింగాకృతి నుంచి రక్తధారను రప్పించడం, అది చూసి భరించలేని తిన్నడు కన్నుకు కన్నే మందని తన కళ్లను తీసి శివునికి అర్పించి శివసాయిజ్యాన్ని పొందాడు. రెండు కళ్లను శివయ్యకు దానం ఇచ్చి భక్తకన్నప్పగా ఇక్కడి క్షేత్రంలో పూజలందుకుంటున్నాడు. ఇప్పటికి ఇక్కడి క్షేత్రంలో తొలి పూజ భక్తకన్నప్పకే. రోజూ సుప్రభాతం పూర్తయ్యాక గర్భాలయంలో కొలువుదీరిన భక్తకన్నప్పకు తొలి పూజ నిర్వహించి రోజువారి ఆర్జితసేవలు ప్రారంభిస్తుంటారు. అర్చకులు ఆటవికులు ధరించే విధంగా మోకాళ్ల వరకు వస్త్రధారణతో పూజలు నిర్వహించడం ఇక్కడి సంప్రదాయంగా వస్తోంది.

# నృసింహుడి చెంత.. మట్టి దందా



ఉరవకొండ : ఉమ్మడి అనంత జిల్లాలో ప్రసిద్ధి చెందిన పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రం చెంత మట్టి మాఫియా చెలరేగిపోతోంది. భక్తులు పవిత్రంగా భావించే ఆలయ పరిసరాల్లో ఎర్రమట్టిని అక్రమంగా తవ్వి జేబులు నింపుకుంటున్నా పట్టించుకునే నాథులు కరవయ్యారు. ఉరవకొండ మండలం పెన్నహోబిలం లక్ష్మీనరసింహ స్వామి ఆలయ పరిసరాల్లో కొన్నాళ్లుగా అక్రమార్కులు ఎర్రమట్టిని కరిగించేస్తున్నారు. దేవాలయం ముందు జాతీయ మార్గం ఆనుకుని, వెనుక ఆమిద్యాలకు వెళ్లే దారి అంచున ఈ తతంగాన్ని సాగిస్తున్నారు. ఇక్కడి ఎర్రమట్టికి ఎక్కువ విలువ ఉంది. ఇదే అదనుగా అక్రమార్కులు పొక్లెయిన్ సాయంతో మట్టిని తవ్వి స్థానికంగా విక్రయించడంతో పాటు ఇతర ప్రాంతాలకూ తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్కో ట్రాక్టరు మట్టి రూ. 800 పైగా పలుకుతోంది. గిరాకీని బట్టి అడ్డదిడ్డంగా తవ్వేస్తుండడంతో ఆ పరిసరాల్లో పెద్ద పెద్ద గుంతలు పడుతున్నాయి.

**బ్రహ్మోత్సవాల్లో భక్తులకు అసౌకర్యం**
నృసింహస్వామి బ్రహ్మోత్సవాల సమయంలో దేవాలయానికి ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఇక్కడి పరిసర ప్రాంతాల్లో ఐదారు రోజులు తాత్కాలిక టెంట్లు వేసుకుని ఉంటారు. మట్టి బకాసురులు ఎక్కడపడితే అక్కడ మట్టిని తవ్వేయడంతో ఏర్పడిన గుంతల నడుమ భక్తుల వసతికి అవకాశం లేకుండాపోతోంది. దీన్ని స్థానికులు వ్యతిరేకిస్తున్నా ఆలయాధికారులు పట్టించుకోకపోవడం బాధాకరం.

**అక్రమార్కులపై చర్యలు ఏవీ?**
పెన్నహోబిలం ఆలయ పరిసరాలు పచ్చదనంతో నిండి ఉంటాయి. ఈ నేపథ్యంలో పర్యాటకాభివృద్ధికి నడుం బిగించని అధికారులు కనీసం అక్రమ మట్టి దందా నివారణ దిశగా ఎందుకు పటిష్ఠ చర్యలు తీసుకోవడం లేదని భక్తులు, పర్యాటకులు ప్రశ్నిస్తున్నారు. మరికొన్ని రోజులు మట్టిని ఇలాగే తవ్వుకుంటూపోతే ఆలయ పరిసరాలు ఆహ్లాద వాతావరణాన్ని కోల్పోవడమే కాకుండా క్షేత్రం పవిత్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉంది. దీనిపై ఆలయ ఈవో తిరుమలరెడ్డి దృష్టికి తేగా స్పందించారు. ఎర్రమట్టి అక్రమ తవ్వకాల వ్యవహారం తమవరకు వచ్చిందని, దాన్ని పూర్తిగా కట్టడి చేయడానికి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

# కరి.. కట్టడిపై ఏదీ గురి



చిత్తూరు : జిల్లాలో ఏనుగుల దాడులు నిత్యకృత్యమయ్యాయి. ఆహారం, నీటి కోసం అడవులను వీడి పంట పొలాలు, జనావాసాల్లోకి వస్తున్నాయి. పంటలు, వ్యవసాయ పరికరాలను ధ్వంసం చేస్తున్నాయి. పాడి పశువులు, అడ్డొస్తే మనుషుల ప్రాణాలను సైతం బలిగొంటున్నాయి. ఈ క్రమంలోనే చీకట్లో విద్యుదాఘాతంతో ఏనుగులూ మృత్యువాత పడుతున్నాయి.

**వేసవిలో ఎక్కువ...**
వేసవి ప్రారంభం కానుంది. అడవుల్లో నీటి ఎద్దడి ఆహార కొరత ఏర్పడితే ఏనుగులు పంట పొలాలు, జనావాసాల్లోకి వస్తాయి. జిల్లాలో వరి, మామిడి, అరటి, కొబ్బరి పంటలుండటంతో కరి కదలికలు పంట పొలాల్లో ఎక్కువ కానున్నాయి. జిల్లాలో కుప్పం, రామకుప్పం, పలమనేరు, పెద్దపంజాణి, బంగారుపాళ్యం, యాదమరి, గుడిపాల, ఐరాల, తవణంపల్లి, పులిచెర్ల మండలాల్లో ఏనుగులు సంచరిస్తున్నాయి.

**తమిళనాడులో తరుముతుండటంతో..**
జిల్లాలో 1905 చదరపు కి.మీ. విస్తీర్ణంలో అడవులున్నాయి. తమిళనాడులో అటవీ ప్రాంతాల్లో చింత చెట్లు, అటవీ ఉత్పత్తుల కాంట్రాక్టు పొందిన వారు, స్థానికులు ఏనుగులపై దాడులు చేస్తున్నారు. తారుము ద్దలకు నిప్పంటించి విసరడంతో మంటలకు అల్లాడిపోతాయని, అలాగే నాటు తుపాకుల్లో రవ్వలు వేసి ఏనుగులపై కాల్పులు జరపడంతో అవి నొప్పిని తాళలేక జిల్లాలోకి ప్రవేశిస్తున్నట్లు అటవీశాఖ అధికారులంటున్నారు. కర్ణాటక, తమిళనాడుల్లో ఏనుగుల సంతతి ఎక్కువ కావడంతో వాటిని ఇటుగా పంపేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. జిల్లాలో కౌండిన్య ప్రాంతంలో ఏనుగుల సంతతి పెరగడం, వలస వచ్చే ఏనుగులతో ఏటా వాటి సంఖ్య గణనీయంగా పెరిగిపోతోంది.

**రేడియో కాలర్ ఎక్కడ..?**
జిల్లాలోని ఆరు ఏనుగులకు రేడియో కాలర్ అమర్చడానికి కేంద్ర అటవీశాఖ అనుమతినిచ్చినా, మత్తు ఇచ్చేందుకు అవసరమైన డ్రగ్ కొనుగోలుకు ఇంకా అనుమతి రాలేదు.

**కట్టడి చేయలేకున్న కుంకీలు**
ఏనుగుల కట్టడికి కూటమి ప్రభుత్వం కర్ణాటక నుంచి నాలుగు కుంకీ ఏనుగులకు తెప్పించి పలమనేరు సమీపంలోని ముసలిమడుగు క్యాంపులో ఉంచారు. ఎక్కడైనా ఏనుగులున్నట్లు గుర్తించి కుంకీలను రప్పించేలోపే అక్కడి ఏనుగులు దిశను మార్చుకుని మరో ప్రాంతంలో పంటలను ధ్వంసం చేస్తున్నాయి. సౌర కంచె, కందకాల తవ్వకానికి ప్రభుత్వం వద్ద ప్రతిపాదనలున్నాయని.. పలమనేరులో 18 కి.మి మేర సౌర కంచె ఏర్పాటు చేశామని.. అడవుల నుంచి ఏనుగులు వెలుపలకి రాకుండా చర్యలు తీసుకుంటామని డీఎఫ్‌వో సుబ్బరాజ్ తెలిపారు.
2012–13 నుంచి 2025 వరకు జిల్లాలో 6,989.63 ఎకరాల్లో పంటలను ఏనుగులు ధ్వంసం చేశాయి. 9,483 మంది రైతులు పంటలను నష్టపోయారు. రూ.6.21 కోట్లు పరిహారం చెల్లించారు. అటవీ ప్రాంతం చుట్టూ కందకాలు, సౌర విద్యుత్తు కంచె, నీటి వసతి, ఆహార సౌకర్యాలు కల్పించేందుకు రూ.17 కోట్లు అవసరమని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఇప్పటివరకు పలమనేరు, కుప్పం ప్రాంతాల్లో 18 కి.మీ.మేర మాత్రమే సౌర కంచెను ఏర్పాటు చేశారు.
2007లో 28 ఏనుగులుండగా, ప్రస్తుతం వాటి సంఖ్య 150–160కి చేరింది.

# 'సాంకేతికత'.. నకిలీల కలత

శ్రీకాళహస్తి : సాంకేతికత పెరుగుతున్న కొద్దీ అందుకు తగ్గట్లుగా అక్రమాలు విస్తరిస్తున్నాయి. తాజాగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించి ఆన్‌లైన్ ద్వారా ఆర్జిత సేవా టికెట్లు ఇస్తామని భక్తులను మోసాలకు గురిచేసిన నకిలీ వెబ్‌సైట్‌ను ఇక్కడి అధికారులు గుర్తించారు. ఇక్కడి టికెట్ స్కానింగ్ యంత్రాలతో ఈ విషయం బహిర్గతమైంది. ఈ మోసంపై ఆలయ సీఎస్‌వో ఫిర్యాదుతో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సైబర్‌క్రైం పోలీసులు విచారణలో ఇక్కడ తీగ లాగితే అక్రమాల డొంక నోయిడాలో తేలింది.




**అప్రమత్తత అవసరం..**
ప్రస్తుతం ఆఫ్‌లైన్ కంటే ఆన్‌లైన్ టికెట్లు తీసుకునేందుకు భక్తులు ఆసక్తి చూపుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఈ తరహా సాంకేతిక అక్రమాలకు అవకాశాలు లేకుండా పకడ్బందీ వ్యవస్థ అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది. నకిలీ వెబ్‌సైట్లతో అక్రమాలకు పాల్పడుతున్నట్లు అనుమానం వస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరుతున్నారు.
'శివరాత్రి'తో.. గుట్టు రట్టు..: దేశవ్యాప్తంగా అన్నీ క్షేత్రాలకు సంబంధించి ప్రాశస్త్యం, అక్కడి వివరాలతో https://devdham.com నకిలీ వెబ్‌సైట్, యాప్‌ను నిర్వహిస్తున్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఇక్కడి ఆలయంలో దర్శనం, పూజా టికెట్లు ఇస్తామని నమ్మబలకడంతో భక్తులకు అనుమానం వచ్చి ఈ అంశాన్ని ఆలయ అధికారుల దృష్టికి తీసుకురావడంతో ఈ మోసం గుట్టురట్టయింది.

# ఉగాదికి పాలు పొంగిద్దాం

చిత్తూరు: సొంతిల్లు.. ప్రతి పేద, మధ్య తరగతి ప్రజల కల. 2014– 19 మధ్య తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో వేగంగా గృహ నిర్మాణాలు సాగాయి. పట్టణ ప్రాంతాల్లోని వ్యక్తుల కోసం టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పనులను అర్థాంతరంగా నిలిపేశారు. 25 శాతం లోపు జరిగిన నిర్మాణాలు ఏకంగా రద్దు చేశారు. 2024 ఎన్నికలకు ముందు కొన్నిచోట్ల మౌలిక సదుపాయాలు కల్పించకుండానే హడావుడిగా లబ్ధిదారులకు తాళాలు అప్పగించారు. ప్రస్తుతం ఇక్కడ పెండింగ్ పనుల పూర్తితోపాటు మిగతాచోట్ల అవసరమైన సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టారు. ఉగాది నాటికి రెండు జిల్లాల్లో 12,604 గృహాలు పూర్తి చేసి.. పండుగ రోజు వారికి అప్పగించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

**శ్రీకాళహస్తి, వెంకటగిరి, చిత్తూరులో పూర్తి**
కూటమి ప్రభుత్వం వచ్చాక టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించింది. గుత్తేదారులకు పాత బిల్లులు చెల్లించారు. రోడ్లు, డ్రైనేజీ, ఉపరితల ట్యాంకులు, విద్యుత్తు, తదితర సదుపాయాలు కల్పిస్తున్నారు. శ్రీకాళహస్తి, వెంకటగిరి మున్సిపాలిటీలతోపాటు



చిత్తూరులో పెండింగ్ పనులు 95 శాతం పూర్తయ్యాయి. ఈ మూడు చోట్ల కలిపి ఇప్పటికే 5,120 గృహాలు అందుబాటులోకి వచ్చినట్టయ్యింది. చిత్తూరులో ఈఎల్‌ఆర్ఎస్ పనులే మిగిలాయి. పుత్తూరు పురపాలికలోనూ అంతర్గత రహదారులు, విద్యుత్తు, ఇతర సదుపాయాలు పూర్తయ్యాయి.

**మిగతాచోట్లా త్వరగా చేయాలని లక్ష్యం**
శ్రీకాళహస్తి– 2లో దాదాపు పనులు జరిగాయి. శ్రీకాళహస్తి– 1తోపాటు నాయుడుపేట, సూళ్లూరుపేటలోనూ త్వరగా పెండింగ్ నిర్మాణాలు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. గత వారం తిరుపతి కలెక్టరేట్‌లో టిడ్కో ఎండీ, కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ కూడా వేగంగా చేయాలని ఆదేశించారు. కొన్నిచోట్ల గుత్తేదారులు.. కార్మికుల కొరత ఉందని చెప్పారు. ఈనేపథ్యంలో టిడ్కో అధికారులు.. ఈ సమస్యను పరిష్కరించడానికి కసరత్తు చేస్తున్నారు.

# ఎత్తిపోతలు.. ఎండమావులు..!

శాంతిపురం : కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లో సహజ సాగునీటి వనరుగా పాలారు నది 42 కి.మీ.ల మేర విస్తరించింది. ఈ జలాలను సద్వినియోగమే లక్ష్యంగా చేపట్టిన నిర్మాణాల ఉద్దేశం నెరవేరడం లేదు. ఎత్తిపోతల పథకాల ద్వారా పాలారు జలాలను చెరువులకు మళ్లించాలన్న ఆశయం ఆచరణలో నీరుగారిపోయింది.
ఏటా వర్షాకాలంలో పొంగి ప్రవహించే పాలారు నీటిని స్థానికంగా నిల్వ చేసుకోవాలనే సంకల్పంతో 20 ఏళ్ల కిందట తెదేపా హయాంలో పాలారు ఎత్తిపోతలను నిర్మించారు. శాంతిపురం మండలంలో పొన్నేపల్లె, శివరామపురం వద్ద పంప్‌హౌస్‌లు నిర్మించారు. నది నుంచి సమీప చెరువులకు పైపులైన్లు ఏర్పాటు చేశారు. వి.కోట మండలంలోని ఎల్లాగరం, రామకుప్పం మండలంలో కొళ్లుపల్లె వద్ద ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. కొన్నేళ్ల పాటు నదీ జలాలను చెరువులకు మళ్లించారు.
**కూటమి ప్రభుత్వం చొరవ చూపితేనే..** ఏటా వర్షాకాలంలో పాలారు జలాలు వృథాగా తమిళనాడుకు చేరుతున్నాయి. నదికి సమీపంలోనే చెరువులు, కుంటలు ఉన్నా.. వాటిలోకి నీరు చేరని పరిస్థితి కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకొని.. పాలారు ఎత్తిపోతలను పునరుద్ధరిస్తే.. చెరువుల్లో జలకళ ఏర్పడి.. ఆయకట్టు భూములకు సాగునీటి వసతి సాకారమవుతుందని అన్నదాతలు ఆశిస్తున్నారు. **నిర్వహణ భారమై..** ఎత్తిపోతల పథకం నిర్వహణను స్థానికంగా సాగునీటి సంఘాలకు అప్పగించారు. నిధుల సమస్య.. నిర్వహణ భారంతో మూలన చేరాయి. పంప్‌హౌస్‌ల చుట్టూ పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు పెరుగుతున్నాయి. విద్యుత్తు నియంత్రికలు దెబ్బతిన్నాయి. పలుచోట్ల మోటార్లు, స్టార్టర్లు, ఇతర సామగ్రి చోరుల పాలైనట్లు రైతులు పేర్కొంటున్నారు.

చరకలు



# గిరిజన గురుకులంలో ఆకలి కేకలు

కదిరి : కదిరిలోని గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాలలో విద్యార్థులు ఆకలితో అలమటిస్తున్నారు. భోజనం నాణ్యతగా ఉండటం లేదని, ఉడకని, పురుగులు ఉన్న అన్నం వడ్డిస్తున్నారని విద్యార్థులు కంచాలతో ఆందోళనకు దిగారు. అయినా సిబ్బంది తీరు మారలేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. కూడా అన్నంలో పురుగులు వచ్చినట్లు వాపోయారు. ప్రశ్నిస్తే భయపెడతారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆకలి తీరాలంటే ఎలాగోలా తినక తప్పదని వేదన చెందుతున్నారు. రుచించని భోజనం రోజూ బయట పడేస్తున్నట్లు చెబుతున్నారు. ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా పరిస్థితిలో మార్పు లేదన్నారు. గత్యంతరం లేక ఆందోళన చేయాల్సి వచ్చిందని విద్యార్థులు తెలిపారు.

**భోజనం పడేసేవాళ్లే ఎక్కువ..**



గురుకుల పాఠశాలలో 170 మంది విద్యార్థులు ఉన్నారు. ముగ్గురు వంట మనుషులకు, ఒకరే ఉండటం సమస్యగా మారిందని ప్రిన్సిపల్ తెలిపారు. ఆ ఒక్కరూ అనారోగ్యంతో ఉండటంతో కాలేజీ హాస్టల్ వంట మనిషితో భోజనం చేయిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం నాణ్యమైన భోజనానికి సన్నబియ్యం పంపుతున్నా పురుగుల అన్నం వడ్డిస్తున్నారని, గుడ్లు కూడా సరిగా ఉండటం లేదని పిల్లలు వాపోతున్నారు. ఆకలికి కొంత తిని మిగతా బయట పడేస్తున్నట్లు చెబుతున్నారు. భోజనం పడేయడంతో పాఠశాల పరిసరాలు అధ్వానంగా మారాయి.

ప్రిన్సిపల్ సస్పెన్షన్

గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను శుక్రవారం డిప్యూటీ సెక్రటరీ మధుసూదనవర్మ పరిశీలించారు. పిల్లలకు నాణ్యతలేని భోజనం వడ్డించడం, ప్రిన్సిపల్ విద్యార్థులతో డబ్బులు వసూలు చేసి వెనక్కు ఇవ్వకపోవటం, పుస్తకాల పంపిణీ వ్యవహారాలు అధ్వానంగా ఉన్నట్లు గుర్తించారు. ఈమేరకు ప్రిన్సిపల్ ఎం.వెంకటరమణను సస్పెండ్ చేస్తూ సంయుక్త కార్యదర్శి వైవీఎస్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. అతని స్థానంలో ఉపేంద్రను ఎఫ్ఏసీ ప్రిన్సిపల్‌గా నియమించారు.

# ఎరువులు అరకొర

అనకాపల్లి : రబీ ప్రారంభ దశలోనే జిల్లాలో ఎరువుల కొరత కనిపిస్తోంది. అవసరం ఎంత ఉన్నా తక్కువే అందిస్తున్నారు. దీంతో అన్నదాతలు ప్రైవేటు దుకాణాలను ఆశ్రయించాల్సి వస్తోంది. డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని.. దుకాణ యజమానులు రేట్లు అమాంతం పెంచేస్తున్నారు. జిల్లాలో రబీ సాగు తక్కువ. దేవరాపల్లి, రాంబిల్లి, మునగపాక, ఎలమంచిలి, చోడవరం, మాడుగుల, అచ్యుతాపురం వంటి మండలాల్లో సాగవుతోంది. జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు జిల్లాలో ఎరువుల నిల్వలు సంపూర్ణంగా ఉన్నాయని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఇటీవల రాంబిల్లిలోని మురకాడ రైతుసేవా కేంద్రానికి కేవలం 24 టన్నుల యూరియా వచ్చింది. అది రెండు రోజుల్లో రైతులు తీసుకెళ్లిపోయారు. కానీ.. మళ్లీ నిల్వలు రాలేదు. దీంతో ఆ పరిసర ప్రాంతాల్లోని రైతులు దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది. దేవరాపల్లి మండలంలోని డీబీటీ పరికరాల్లో సాంకేతిక లోపం కారణంగా.. విక్రయాల్లో జాప్యం జరుగుతోంది.

**ఒక్కొక్కరికీ ఒక్కో బస్తానే..:**

రైతుసేవా కేంద్రాల్లో రబీ పంటకు తొలివిడతగా ఒక్కో రైతుకు ఒక్కో బస్తానే ఇస్తున్నారు. కొన్నిచోట్ల నిల్వలు అయిపోయాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రాంబిల్లి, దేవరాపల్లి, కశింకోట మండలాల్లో పాస్‌పుస్తకం ఎవరి పేరుపై ఉంటే వాళ్లే రావాలంటూ నిబంధనలు పెడుతున్నారు. దీంతో కౌలుదారులు యూరియా అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మునగపాక, అచ్యుతాపురంలోని కొన్ని రైతుసేవా కేంద్రాలకు ఇంకా ఎరువులు సరఫరా కాలేదు. దీంతో సాగుదారులు డీలర్లను ఆశ్రయించాల్సి వస్తోంది.

**ఆరు కట్టలే ఇచ్చారు..:** ఖరీఫ్‌లో వరదలకు పంట నీటమునిగిపోయింది. రబీలోనైనా కలిసొస్తుందని తొమ్మిది ఎకరాల్లో వరి సాగు చేస్తున్నాను. ప్రస్తుతం 9 ఎరువుల కట్టలు అవసరముంది. కానీ.. ఆరు కట్టలే అధికారులు ఇచ్చారు. మిగతా మూడింటి సంగతి అడిగితే.. అందరికీ సర్దవద్దా అంటున్నారు. మూడు కట్టలు ప్రైవేటుగా కొనుగోలు చేస్తే.. కట్ట రూ. 450 వరకు తీసుకుంటున్నారు.

మంతిన తాతారావు, వై.లోవ, రాంబిల్లి మండలం

ఇబ్బందులుంటే ఫిర్యాదు చేయండి: జిల్లాలో కావల్సినంత ఎరువులు అందుబాటులో ఉన్నాయి. కొన్ని చోట్ల గడ్డిని పెంచేందుకు వినియోగిస్తున్నారని తక్కువగా ఇస్తున్నాం. ఎవరికి కావాలన్నా.. సంబంధిత రైతుసేవా కేంద్రాలను సంప్రదించవచ్చు. ఎరువుల విక్రయాల్లో డీలర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయి.

ఆశాదేవి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి

జిల్లాలో రబీ విస్తీర్ణం: 2500 హెక్టార్లు

ఎరువు అవసరం: 1,944 మెట్రిక్ టన్నులు

సరఫరా అయింది: 1,711 మెట్రిక్ టన్నులు

# కోట్లకు కుచ్చుటోపీ

తిరుచానూరు : తిరుచానూరు పంచాయతీకి టూరిస్ట్ బస్టాండ్ వేలం పాటలు దక్కించుకున్న గుత్తేదారులు రూ.కోట్లాది బకాయిలు చెల్లించకుండా కుచ్చుటోపీ పెట్టారు. మొండి బకాయిలు వసూలు చేయాల్సిన కార్యదర్శులు సైతం వారికి అన్ని విధాలుగా సహకరించి పంచాయతీకి నష్టాన్ని మిగిల్చారు. పంచాయతీకి అత్యధిక ఆదాయం టూరిస్ట్ బస్టాండ్ వేలం ద్వారానే వస్తోంది. గత ప్రభుత్వ పాలనలో స్థానిక నాయకులు ఎవరూ అడ్డు లేకుండా చూసుకున్నారు. తదనంతరం పంచాయతీ ఉన్నతాధికారులు, స్థానిక నేతలతో కుమ్మక్కై తక్కువకే వేలం దక్కించుకున్నారు. చివరకు రూ.3 కోట్లకు పైగా బస్టాండ్ పార్కింగ్ బకాయిలు, జీఎస్టీలు, స్టాంప్ డ్యూటీలు, ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు దాదాపు రూ.నాలుగు కోట్లు కలిపి మొత్తం రూ.7 కోట్లు చెల్లించకుండా పంచాయతీని మోసం చేశారు.

ఇంకుడు గుంతల సొమ్ము రూ.15 లక్షలకుపైగా స్వాహా చేసిన విషయం ఇటీవల వెలుగుచూసింది. ఇదంతా ఒకే కార్యదర్శి హయాంలో చోటుచేసుకున్నట్లు విమర్శలు ఉన్నాయి. గుత్తేదారులకు నోటీసులు జారీచేసి బకాయిలు వసూలు చేస్తామని ఇన్‌ఛార్జి ఈవో మణి తెలిపారు.

మాఫీ కోసం దస్త్రం కదిపి..ఉమ్మడి జిల్లాగా ఉన్న సమయంలో టూరిస్ట్ బస్టాండ్‌కు సంబంధించిన గుత్తేదారుడు తనకు 2021–22లో కరోనా సమయంలో తీవ్ర నష్టం వాటిల్లిందని.. బకాయిలు మాఫీ చేయాలంటూ ఉన్నతాధికారులు విన్నవించారు. ఇందుకు సంబంధించిన దస్త్రం కిందిస్థాయి నుంచి జిల్లా వరకు గుట్టుచప్పుడు కాకుండా చేరింది. ఆ వెంటనే అధికారులు దస్త్రాన్ని కలెక్టరేట్‌కు పంపిన విషయాన్ని అప్పట్లో 'ఈనాడు'లో ప్రచురించడంతో ఆగిపోయింది. అప్పట్లో ఏకంగా రూ.2.15 కోట్లు మాఫీ చేయాలని ఎత్తుగడ వేశారు.

# చెదలు.. దిగులు



అనంతపురం : అనంత నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపాన 13 ఏళ్ల క్రితం ఓ అపార్టుమెంటు నిర్మించారు. అందులో 80 ప్లాట్లు ఉన్నాయి. వాటిలో 60 ప్లాట్లకు చెద పురుగులు పట్టాయి. తలుపులు, కిటికీలు, ఇతర సామగ్రి పనికిరాకుండా పోయాయి. వాటి యజమానులకు నష్టం తప్పలేదు. తరచుగా వేలాది రూపాయలతో మందులు పిచికారీ చేస్తూనే ఉన్నారు. అపార్ట్?మెంట్? వాసులే కాదు.. ఇతర ఇళ్ల యజమానులు సైతం.. తీవ్ర సమస్యగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెద పురుగులు ఇంట్లోకి చేరితే తర్వాత జరిగే నష్టం తీవ్రంగా ఉంటుంది. ఆయా ప్రాంతాల్లో పగుళ్లు ఏర్పడుతాయి. సాధారణంగా ఇంట్లో ఉన్న ఫర్నీచర్‌కు చెదలు పడుతుంటాయి. చెక్కతో తయారు చేసిన ఖరీదైన తలుపులు, కిటికీలు, ఇతర ఫర్నీచర్, సీలింగ్‌తోపాటు పేపర్లు, పెట్టెలు, ఇతర సామగ్రి పూర్తిగా దెబ్బతింటున్నాయి. నివారణకు గాను చాలామంది పురుగు మందులు వాడుతున్నారు. దీంతో ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం కొత్త ఇళ్లకూ చెదలు సమస్య తలెత్తుతోంది. ధనవంతులే కాదు.. సామాన్యులు సైతం ఇబ్బందులు పడుతున్నారు.

**నాలుగు రకాలు**

ముఖ్యంగా చెదపురుగుల్లో నాలుగు రకాలు ఉన్నాయి. రాణి, రాజు, సేవకులు, సిపాయిలుగా పిలుస్తారు. ఇవి సామూహికంగా పుట్టల్లో ఉంటాయి. తొలకరి వర్షాలు కురువగా పుట్టల నుంచి బయటకు వచ్చి చొరబడతాయి.

**తేమ వాతావరణం అనుకూలం**

సాధారణంగా వర్షాకాలం, చలికాలం.. చెద పురుగులకు అనుకూలంగా ఉంటాయి. తొలుత భవనాల్లో తేమ ఉన్న ప్రాంతాల్లో ప్రవేశించి... స్థావరంగా చేసుకుని చెక్క సామగ్రిని తొలుస్తుంటాయి. గుర్తించేలోపు ఫర్నీచర్‌ను గుల్ల చేస్తాయి. పుట్టలుగా ఇంట్లో పేరుకుపోయి విధ్వంసం సృష్టిస్తాయి.

2011 జనాభా లెక్కల ప్రకారం ఉమ్మడి అనంత జిల్లాలో సుమారు 9,68,160 ఇళ్లు ఉన్నాయి. తాజా అంచనాల ప్రకారం సుమారు 12 లక్షలు ఉన్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. సుమారు 2లక్షల పైచిలుకు ఇళ్లకు చెదలు పట్టినట్లు రసాయన పురుగుమందుల విక్రయదారులు పేర్కొంటున్నారు.

**ప్రత్యేక దృష్టి సారిస్తే నివారణ సాధ్యం**

– డాక్టర్? గుత్తా నారాయణస్వామి, ప్రధాన శాస్త్రవేత్త (పరిశోధన కేంద్రం, రేకులకుంట)

ప్రధానంగా ఇళ్లలో సరైన గాలి, వెలుతురు లేకపోవడం... తేమ శాతం అధికంగా ఉన్నచోట్ల చెదపురుగులు పడతాయి. ఇటీవల కాలంలో మరింత అధికమయ్యాయి. అలాంటి ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలి. భవన నిర్మాణ సమయంలో కీటక నాశన మందులను వేయించాలి. చెదపురుగులు లోపలికి ప్రవేశించకుండా ఉంటాయి. భవన నిర్మాణానికి ముందు, తర్వాత బైఫెంత్రిన్? 2.5 ఎంఎల్? లేదా ఫ్రిఫ్రోనిల్? 02.9 ఎంఎల్? లేదా ఇమిడో క్లోఫ్రిడ్? 30.5 ఎంఎల్, లేదా క్లోరిఫైరోఫాస్? 20 ఎంఎల్? లీటరు నీటికి పిచికారీ చేసుకోవాలి. పాత భవనాల్లో ప్రతి 3 ఏళ్ల నుంచి 5 ఏళ్లకు ఒకసారి మందును పిచికారీ చేయిస్తే చెదల సమస్య నుంచి రక్షణ పొందవచ్చు.

# మడకశిర చెరువులో మట్టి మాయం



మడకశిర : మట్టి అక్రమార్కులు చెరువులను చెరబడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పొక్లెయిన్‌లు, టిప్పర్లు, ట్రాక్టర్లు ఏర్పాటు చేసుకుని ఎలాంటి అనుమతులు తీసుకోకుండా మట్టిని తరలించి వాటి విధ్వంసానికి పాల్పడుతున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, రైతుల పొలాలు, రైల్వే పనులు అనే సాకుతో మట్టిని ఇష్టారాజ్యంగా తవ్వేస్తుండటంతో చెరువులు రూపం కోల్పోతున్నాయి. ఎక్కడ ఎంత లోతు తీయాలనే అంశాలేవి పట్టించుకోక పోవడం, అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతోంది. మడకశిర నియోజకవర్గంలోని చెరువుల్లో రైతుల పేర్లతో పలువురు ఇళ్లకు, ఇటుకల బట్టీలకు, స్థలాల చదునుకు తోలుకుంటున్నారు. అధికారులు కూడా ప్రేక్షకపాత్ర పోషిస్తుండటంతో ఆక్రమణలకు హద్దు లేకుండా పోతోంది.

**గుట్టలనూ వదలడం లేదు**

మడకశిర చెరువులో మట్టి పూర్తిగా తరలించడంతో పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. పక్కనే ఉన్న కొండ గుట్టను కూడా వదలకుండా మట్టిని తవ్వేస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వంలో ఈ కొండ గుట్టలోని ఎర్రమట్టిని నాయకులే దగ్గరుండి సొంత పనులకు తరలించుకుని కొండను నాశనం చేశారు. ప్రస్తుతం స్థిరాస్తి వ్యాపారులు పట్టణ చుట్టుపక్కల ఉన్న లేఅవుట్ల పనులకు తీసుకెళ్తున్నారు. లేఅవుట్ వేయాలంటే మొదట పొలాన్ని చదును చేసుకోవాలని ఇందు కోసం మట్టి అవసరం కావడంతో టిప్పర్? లారీల్లో పట్టణం ప్రధాన రహదారుల మీదుగానే తరలించుకుంటున్నారు. అయితే దీన్ని అడ్డుకోవాల్సిన అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా గుట్టను తవ్వడం ఆపకపోతే పూర్తిగా మాయం అవుతుందని స్థానికులు వాపోతున్నారు.

**ఎలాంటి అనుమతులు లేవు**

మడకశిర చెరువులో మట్టిని తరలించేందుకు ఎవ్వరూ అనుమతులు తీసుకోలేదు. అభివృద్ధి పనులకు తప్ప ఎవరైనా సొంతానికి మట్టిని తీసుకెళ్తే కఠిన చర్యలు తీసుకుంటాం. లేఅవుట్ నిర్మాణాలకు మట్టిని తరలిస్తున్నారని ఫిర్యాదులు వస్తే వాహనాలను జప్తు చేయిస్తాం. – తిరుమలేశ్వర్‌రెడ్డి, డీఈఈ, నీటిపారుదల శాఖ, మడకశిర

# శిథిల భవనాల్లో బిక్కు బిక్కు..




ముదిగుబ్బ : గ్రామ సచివాలయాలు నేటికీ ఇరుకు గదులు, అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఫలితంగా ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల ముదిగుబ్బ మండలంలోని తప్పెటవారిపల్లిలో అద్దె భవనంలో కొనసాగుతున్న సచివాలయం శిథిలావస్థకు చేరుకుని పెచ్చులూడిపడింది. సిబ్బంది బయటకు పరుగులు తీయడంతో ప్రమాదం తప్పింది. ఇలాంటి భవనాల్లో విధులు నిర్వహించాలంటే ఉద్యోగులు భయాందోళన చెందుతున్నారు.

ముదిగుబ్బ మేజర్ పంచాయతీలో 2 భవనాలు, సంకేపల్లి, అడవిబ్రాహ్మణపల్లితండా, మల్లేపల్లి, తప్పెటవారిపల్లిలో నేటికీ ప్రభుత్వ భవనాలు పూర్తికాలేదు. కొన్ని సచివాలయ నిర్మాణాలు పూర్తయినప్పటికీ విద్యుత్తు వైరింగ్, తాగునీరు, మరుగుదొడ్లు, ఇతరత్రా చిన్నపనులు చేయకపోవడం, బిల్లులుకాక చివరి దశలో నిలిచిపోవడంతో వినియోగంలోకి రాలేదు.

**బిల్లుల చెల్లింపులో జాప్యం**

గ్రామ సచివాలయాల నిర్మాణాల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. గత ప్రభుత్వంలో బిల్లులు సకాలంలో ఇవ్వకపోవడంతో ఎక్కడికక్కడ పనులు ఆపేశారు. ఆ భవనాల చుట్టూ కంపచెట్లు పెరిగి అధ్వానంగా తయారయ్యాయి.గ్రామాల్లో సచివాలయానికి రూ.1,500, మండల కేంద్రాల్లో అయితే రూ.2 వేల వరకు ప్రభుత్వం అద్దె చెల్లిస్తుంది. అద్దె బిల్లులు సక్రమంగా రాకపోవడంతో ఆయా పంచాయతీ కార్యదర్శులే సొంత డబ్బు ఖర్చు పెడుతున్నారు. తక్కువ అద్దెకు పాతభవనాలు, శిథిలావస్థకు చేరుకున్నవే దొరకడంతో వాటితోనే సర్దుకుపోతున్నారు. ఈ విషయమై పీఆర్? డీఈ పాండురంగారెడ్డి వివరణ కోరగా.. మంజూరైన భవనాలు వివిధ కారణాలతో నిలిచిపోయాయి. గుత్తేదారులతో మాట్లాడి త్వరలోనే నిర్మాణాలు పూర్తి చేయిస్తామన్నారు.

జిల్లా: శ్రీసత్యసాయి

గ్రామ సచివాలయాలు : 467

ప్రభుత్వ భవనాలు: 409

అందులో నిర్మాణంలో ఉన్నవి: 19

పనులు ప్రారంభం కానివి: 39

అద్దె భవనాల్లో కొనసాగుతున్నవి: 58

# ఇంతులు.. డిజిటల్ కాంతులు..!

రాజమహేంద్రవరం : డ్వాక్రా మహిళల్లో అర్హులైన వారిని ఎంపిక చేసి వారితో మినీ ఈ–సేవా కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. డిగ్రీ చదువుతున్న అతివలను ఎంపిక చేసి వారిని ఆర్థికంగా ప్రోత్సహించనున్నారు. మహిళలను లక్షాధికారులను చేయాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనకు అనుగుణంగా 'డిజి–లక్ష్మీ కామన్ డిజిటల్ సేవలు'ను తెరపైకి తెచ్చారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ద్వారా నగర, పట్టణాల్లో సేవా కేంద్రాలు నిర్వహించుకొనే విధంగా తర్ఫీదు ఇవ్వనున్నారు.

**ఎక్కడెక్కడ అంటే**

జిల్లాలో రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు పురపాలికల్లో 319 కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. శనివారం రాజమహేంద్రవరంలో ఈ సేవలు ప్రారంభంకానున్నాయి. క్వారీ




మార్కెటు సెంటర్‌లో కియోస్కో ఏర్పాటు చేశారు.

**ఎంపిక ఇలా**

డ్వాక్రా మహిళ సంఘాల్లో స్లమ్ లెవెల్ ఫెడరేషన్(ఎస్ఎల్ఎఫ్) స్థాయిలో విద్యా వంతులైన మహిళలను గుర్తిస్తారు.

వీరికి ప్రత్యేకంగా శిక్షణ ఇస్తారు.

రూ.2.5 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు రుణాన్ని పొందే విధంగా ఏర్పాట్లు చేస్తారు.

**అందించే సేవలు**

పౌర సేవలతోపాటు పోస్టల్‌కు సంబంధించి 19 రకాల సేవలు అందిస్తారు.కామన్ సర్వీస్ సేవలు (స్మీఎస్సీ) ద్వారా సుమారు 250 సేవలు పొందవచ్చు.సంక్షేమ పథకాలు, బీమా చెల్లింపులు, పురపాలిక పన్నులు, విద్యుత్తు బిల్లులు, కుల ఆదాయ ధ్రువ పత్రాలు ఇక్కడే పొందవచ్చు.రైల్వే, బస్సు, విమాన టికెట్ల బుకింగ్ చేసుకోవచ్చు. ఆయా సేవలకు ప్రభుత్వం నుంచి కమీషన్ రూపంలో ఆదాయం పొందవచ్చు.

# మోగిస్తే.. జరిమానా మోతే!

కాకినాడ : ఖరీదైన అధిక సీసీ ఇంజిన్ కలిగిన ద్విచక్ర వాహనాలు కొనే యువత.. వాటికి అదనపు హంగులతోపాటు అధిక శబ్దం వచ్చే సైలెన్సర్‌లు అమర్చుకుంటున్నారు. వాటినుంచి వచ్చే ధ్వనికి రహదారులపైకి వచ్చేవారు హడలిపోతున్నారు. వెరసి శబ్ద, వాయు కాలుష్యాలతో ఇబ్బంది తప్పడం లేదు. ట్రాఫిక్ పోలీసులు, రవాణాశాఖ అధికారులు ఎన్ని కేసులు నమోదు చేస్తున్నా, అవగాహన కల్పిస్తున్నా మార్పు రావడం లేదు. మెకానిక్‌లను హెచ్చరిస్తున్నా.. సమస్యకు పరిష్కారం శూన్యంగా ఉంది.

**జిల్లా కేంద్రంలో మరీనూ..**

కాకినాడ నగరంలో ఆసుపత్రులు, పాఠశాలలు, కళాశాలల జోన్లు ఎక్కువగా ఉన్నాయి. ఇలాంటిచోట్ల నిబంధనల ప్రకారం.. హారన్



కొట్టకూడదు. కానీ అధిక శబ్దాలతో వాహనాలు వెళుతుండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

**పరీక్షల వేళ ప్రభావం..**రానున్న రెండు నెలల్లో 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు వార్షిక పరీక్షలు జరగనున్నాయి. మాడిఫైడ్ సైలెన్సర్ల ద్వారా విడుదలయ్యే శబ్దంతో విద్యార్థుల ఏకాగ్రత దెబ్బతినే అవకాశాలు అధికం. ఇటీవల పోలీసులు శబ్ద కాలుష్యం చేస్తున్న ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని, కౌన్సెలింగ్ చేస్తున్నా.. ఫలితం ఉండడం లేదు. నిబంధనలు పాటించనివారికి జరిమానాలు విధిస్తున్నామని ట్రాఫిక్ సీఐలు రమేష్, రామారావు తెలిపారు.

మనిషి చెవి వినగలిగే శబ్దం : 35 డెసిబెల్స్‌మాడిఫైడ్ సైలెన్సర్‌లు విడుదల చేసే శబ్దం: 55 నుంచి 70 డెసిబెల్స్‌పైగా..

# పారిశ్రామిక.. పక్కా ప్రణాళిక

కాకినాడ: విశాఖ వేదికగా జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో పలు కంపెనీలు కాకినాడ జిల్లాలో సుమారు రూ.58 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఎంఓయూలు కుదుర్చుకున్నాయి. వాటిని కార్యరూపంలోకి తీసుకువచ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

**1500 ఎకరాలు అవసరం..**

ఎంవోయూలు కుదుర్చుకున్న కంపెనీలకు సుమారు 1,500 ఎకరాలు అవసరమన్నది అంచనా.కోరమాండల్ ఇంటర్నేషనల్ ఎరువుల పరిశ్రమ విస్తరణకు వెయ్యి ఎకరాలు అవసరం.ఏఎం గ్రీన్ మెటల్స్ ఇప్పటికే నేమాం సమీపంలో మూతపడిన స్పెక్ట్రం గ్యాస్ కంపెనీ భూములు కొనుగోలు చేసింది. అదనంగా 250 ఎకరాలు కావాలని కోరుతుండడంతో పిఠాపురం మండలంలో పరిశీలిస్తున్నారు.పాంజియా డేటా ఐటీ కంపెనీకి ఆటోనగర్ సమీపంలోని ఐటీ సెజ్‌లో ఖాళీగా ఉన్న 6.2 ఎకరాలు కేటాయించాలని భావిస్తున్నారు. అకెమ్ న్యాచురల్ గ్యాస్ కంపెనీకి కొమరగిరిలో గతంలో ఇళ్ల స్థలాలకు కొనుగోలు చేసి వదిలేసిన 29.79 ఎకరాలు ఇవ్వాలన్నది యోచన.

# పరిహారం ఇవ్వక.. లీజు సొమ్ము అందక

పుట్టపర్తి: తమ ప్రాంతంలో పెద్ద జలాశయం వస్తుందని సంబరపడి పోయారు. తాము కొంత త్యాగంచేస్తే ఇతర రైతులకూ మేలు జరుగుతుందని తలంచారు. తమకున్నది కొంతే అయినా ప్రజాప్రయోజనం ఆశించి భూమిని ఇచ్చేశారు. లీజుపేరుతో తీసుకొన్న పొలంలో అధికారులు కట్ట నిర్మించేశారు. అయినా నేటికీ ప్రాజెక్టు పూర్తవలేదు. దీంతో జిల్లేడుబండ జలాశయ నిర్వాసితులు అయోమయ పరిస్థితిలో ఉన్నారు. జిల్లేడుబండ జలాశయ నిర్మాణ పనులు రూ.680 కోట్లతో 2021, డిసెంబరులో ప్రారంభమయ్యాయి. తెలంగాణకు చెందిన గుత్తేదారు సంస్థ పనులను దక్కించుకుంది. ముదిగుబ్బ మండలంలోని గుడ్డంపల్లితండా, బుక్కపట్నం మండలంలోని గోపాలపురం గ్రామాలకు చెందిన 30ఎకరాల భూములు కట్ట నిర్మించే ప్రాంతంలో ఉన్నాయి. అందులో వేరుసెనగ, చీనీ, మామిడి ఇతరత్రా పంటలు సాగులో ఉన్నాయి. భూములు లీజుకిస్తే ఎకరాకు ఏడాదికి రూ.30వేల చొప్పున చెల్లిస్తామని, ముంపు భూములన్నింటికీ పరిహారం వచ్చినప్పుడు మీకు కూడా ఇస్తామని గుత్తేదారు చెప్పారు. ఈమేరకు రైతులతో అగ్రిమెంటు తీసుకుని భూములను తీసుకున్నారు. పంటపొలాలన్నీ తొలగించి ఆ ప్రాంతమంతా మట్టితో కప్పి 7.92 కిలోమీటర్ల మేర కట్ట నిర్మించారు.



**కొందరికే...**

అగ్రిమెంటు ప్రకారం మూడేళ్లు రైతుల ఖాతాల్లో లీజు నగదు జమ చేశారు. తర్వాత కొందరికి జమ కాలేదు. జలాశయ ముందు భాగంలో కట్ట నిర్మాణానికి ఖర్చయిన సుమారు రూ.వందకోట్ల వరకు బిల్లులను గుత్తేదారు పూర్తి చేసుకున్నారు. పరిహారంపై వైకాపా ప్రభుత్వం నుంచి స్పష్టత ఇవ్వకపోవడంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. తర్వాత ప్రభుత్వం మారడంతో గుత్తేదారు వెనక్కివెళ్లిపోయారు. ఇప్పుడు రైతులకు లీజు డబ్బులు, పరిహారం చెల్లించలేదు. తిరిగి సాగు చేసుకుందామంటే భూములన్నీ కట్టనిర్మాణంలో కలిసిపోయాయి.

ఇటీవల రైతులు.. మంత్రులు సత్యకుమార్ యాదవ్, నిమ్మల రామానాయుడు దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. త్వరలోనే క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరించేలా అధికారులను పంపుతామని, ముంపు బాధితులకు న్యాయం చేస్తామని మంత్రులు హామీ ఇచ్చారు.

**అందరికీ న్యాయం జరిగేలా చూస్తాం** భూములు కోల్పోయినవారికి లీజు ప్రకారం గుత్తేదారు ఏటా నగదు చెల్లిస్తున్నారు. జలాశయం ముంపు భూములకు పరిహారం కోసం ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదించాము. త్వరలోనే పరిహారం అందేలా తగిన చర్యలు తీసుకుంటాం ఖైలేష్, ఏఈ, నీటిపారుదల శాఖ

# మీ డబ్బు.. మీ హక్కు

విశాఖపట్నం: జిల్లాలో వినియోగించని బ్యాంకు ఖాతాల్లో రూ.195 కోట్ల డబ్బు పోగుబడి ఉందంటే నమ్ముతారా? అవును ఇది వాస్తవం. ఆయా బ్యాంకుల అధికారులు దీన్ని ధ్రువీకరించారు. పదేళ్లు, అంతకు మించి లావాదేవీలు జరగని ఖాతాల్లో ఉన్న నగదును బ్యాంకులు తిరిగిచ్చేస్తున్నాయి. ఈ మేరకు ఆర్‌బీఐ ఆదేశాలిచ్చింది. ఇలా ఏళ్ల తరబడి నిర్వహించని ఖాతాలను డీఈఏఎఫ్ (డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్) అని పిలుస్తారు. ఏయే బ్యాంకుల్లో ఎన్ని ఖాతాలు అలాంటివి ఉన్నాయి, వాటిల్లో ఎంత నగదు ఉందో వివరాలు తెప్పించుకుంది. ఇందులో భాగంగా డిసెంబరు నెలాఖరు వరకు జిల్లాలో అన్ని చోట్ల ప్రత్యేక శిబిరాలు నిర్వహించి ఆ నగదును వెనక్కి ఇస్తారు.

**ఎవరిని సంప్రదించాలంటే..** ఖాతా ఉన్న బ్యాంకు మరోదాంట్లో విలీనమై ఉంటే ఆ బ్యాంకును సంప్రదించొచ్చు. ఆధార్, పాస్‌పోర్టు, ఓటరు ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్ పత్రాల్లో ఏదో ఒకదాన్ని సమర్పించాలి. పరిశీలన అనంతరం బ్యాంకు ప్రతినిధి ధ్రువీకరించిన తర్వాత ఆ మొత్తం అక్కడే పొందొచ్చు. ఖాతాదారు మృతి చెందితే సంబంధిత కుటుంబ సభ్యులు మరణ ధ్రువీకరణ పత్రం అందజేయాలి

**ఇలా తెలుసుకోవచ్చు..:**

జిల్లాలో డీఈఏఎఫ్ ఖాతాలు 6.22 లక్షలు ఉండగా, వాటిల్లో రూ.195 కోట్ల నగదు నిల్వలు ఉన్నాయని ఎల్‌డీఎం శ్రీనివాస్ తెలిపారు.. నిర్వహణలో లేని ఖాతాలను ఆ బ్యాంకు వెబ్‌సైట్ లింకులోనూ తెలుసుకోవచ్చు. అదేవిధంగా ఆర్‌బీఐ యూడీజీఏఎం పోర్టల్ %https://udgam.rbi.org.in% లోనూ చూడొచ్చు. ఆ డబ్బు తీసుకోండి..: వినియోగించని బ్యాంకు ఖాతాల్లో ఉన్న డబ్బును సంబంధిత వినియోగదారులు సులభంగా పొందొచ్చు. రిజర్వ్‌బ్యాంకు కల్పించిన ఈ అవకాశాన్ని అర్హులు ఉపయోగించుకోవాలి. జిల్లాలోని అన్ని బ్యాంకుల్లో ఆరు లక్షలకుపైగా ఖాతాల్లో డబ్బులు ఉండిపోయాయి. దీనికి సంబంధించి ఇటీవల సిరిపురం ఎస్బీఐ బ్యాంకులో ఖాతాదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించాం. శ్రీనివాస్, ఎల్‌డీఎం, విశాఖ

# బొమ్మల పరిశ్రమపై కదలిక

నక్కపల్లి: పారిశ్రామికంగా జిల్లాను పరుగులు పెట్టిస్తున్న కూటమి ప్రభుత్వం మరో పరిశ్రమ ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తోంది. మంత్రి వంగలపూడి అనిత చొరవతో నక్కపల్లి మండలంలో బొమ్మల తయారీ కంపెనీ స్థాపనకు అడుగులు పడుతున్నాయి.

పరిశ్రమల నిమిత్తం గతంలో సేకరించిన భూముల్లో బల్క్‌డ్రగ్ పార్కు, ఆర్సెలార్ మిత్తల్ ఉక్కు పరిశ్రమ ఏర్పాటవుతున్నాయి. వీటికి అనుమతులు వచ్చాయి. బల్క్‌డ్రగ్‌కు ప్రధాని మోదీ ఈ ఏడాది జనవరిలో శంకుస్థాపన చేశారు. స్టీల్ ప్లాంట్‌కు తొలి విడతలో 2020 ఎకరాలు కేటాయించారు. రెండో విడతలో మరో మూడు వేల ఎకరాలు ఇవ్వనున్నారు. పరిశ్రమ ఏర్పాటులో భాగంగా క్యాప్టివ్ పోర్టు, టౌన్‌షిప్ నిర్మించనున్నారు.

'పాల్స్ ప్లష్' బొమ్మల పరిశ్రమ ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. దీనిపై కొద్ది నెలల కిందట సీఎం ఆదేశాలతో మంత్రి అనిత సంబంధిత కంపెనీ ప్రతినిధులు, ఉన్నతాధికారులతో మాట్లాడి సమన్వయం చేశారు. ఈ పరిశ్రమ ఏర్పాటుకు సుమారు వెయ్యి ఎకరాల భూమి అవసరమవుతుందని ప్రతిపాదించారు. ఉపమాక, ఎన్.నర్సాపురం, నల్లమట్టిపాలెం, బుచ్చిరాజుపేట తదిరత ప్రాంతాల్లో కేటాయించాలని నిర్ణయించడంతోపాటు ప్రాథమికంగా భూమిని గుర్తించారు. దీనిపై కలెక్టర్ తదితరులతో మంత్రి చర్చించారు.

బొమ్మల పరిశ్రమ ఏర్పాటైతే మహిళలకు వేలాదిగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. సుమారు 25 వేల మందికి అవకాశం ఉంటుందని మంత్రి అనిత పలు సందర్భాల్లో ప్రకటించారు. విశాఖలో జరిగిన పెట్టుబడుల సదస్సులో బొమ్మల తయారీ పరిశ్రమ అధ్యక్షుడు అజయ్ సిన్హా ముఖ్యమంత్రితో భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

# ఈ-క్రాప్ కష్టాలకు చెల్లు!



ఒంగోలు : ఈ-క్రాప్ నమోదులో ఎదురవుతున్న గందరగోళానికి తెరదించుతూ రాష్ట్ర వ్యవసాయశాఖ ఈ రబీ సీజన్? నుంచి కొత్త విధానం అమల్లోకి తెచ్చింది. ఇందులో భాగంగా వివరాల నమోదుకు ముందు, చేశాక, ధ్రువీకరణ కోసం మొత్తం మూడుసార్లు రైతుల చరవాణికి సంక్షిప్త సందేశాలు (ఎస్ఎంఎస్) వస్తాయి. ఫోన్ వినియోగించలేని వారికి సమీప రైతు సేవా కేంద్రాల సిబ్బంది సహకారం అందిస్తారు. అందుబాటులో లేని రైతులు, నిరక్షరాస్యులకు పాత విధానంలోనే ఈకేవైసీ ద్వారా వివరాలు నమోదు చేస్తారు.

**గడువు... ఫిబ్రవరి 25**

రబీకి సంబంధించి ప్రకాశం, మార్కాపురం జిల్లాల పరిధిలో 8,86,218 భూకమతాలను ఈ-క్రాప్? నమోదు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. సాగు చేసినా, చేయకపోయినా సర్వే నంబరులో ఉన్న భూ వివరాలను యాప్‌లో నమోదు చేస్తారు. ఇప్పటివరకు 90 వేల కమతాలను ఈ-క్రాప్? చేశారు. ఫిబ్రవరి 25లోగా మొత్తం ప్రక్రియ పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఫలానా రోజున పంట నమోదుకు వస్తున్నట్లు రైతు మొబైల్‌కు గ్రామ సహాయకులు ఎస్?ఎంఎస్? ద్వారా సమాచారం ఇస్తారు. ఆ రోజున రైతు సమక్షంలో వివరాలు నమోదు చేసి... మరోసారి ఎస్?ఎంఎస్? చేస్తారు. ఏవైనా లోటుపాట్లు ఉంటే ఉంటే గ్రామ సహాయకుడికి తెలియజేయాలి. లేనిపక్షంలో ఆమోదిస్తున్నట్లు ఆన్?లైన్?లోనే ధ్రువీకరించాలి.

**మరింత పారదర్శకత...**

నూతన విధానంలో మరింత పారదర్శకత పెరుగుతుందని జేడీఏ ఎస్?.శ్రీనివాసరావు తెలిపారు. గతంలో ఒక పంట బదులు మరొకటి నమోదు కావడం, పూర్తి విస్తీర్ణం చేర్చకపోవడం వంటి సమస్యలపై తరువాత అర్జీలు సమర్పించేవారని... ఇకపై ఆ సమస్య ఉండదని వివరించారు. మార్కాపురం, ప్రకాశంలో మొత్తం 528 రైతు సేవా కేంద్రాలున్నాయి. వీటి పరిధిలో రోజుకు 26,276 పంట వివరాలు నమోదు చేయాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. ఈ ప్రక్రియ పూర్తయితే... పంట నష్టం వాటిల్లినప్పుడు స్పష్టమైన వివరాలు అందుబాటులో ఉంటాయన్నారు.

# ఎగ 'మేత'



భీమవరం :జిల్లా కేంద్రం భీమవరంలోని పీపీ రోడ్డు, మావుళ్లమ్మవారి దేవస్థానం వీధి, రెస్ట్‌హౌస్ రోడ్డు కూడలిలో వస్త్ర, వెండి, బంగారం తదితర దుకాణాలు ఉన్నాయి. ఇక్కడ 20 శాతం దుకాణాలకు పన్ను రశీదు లేదని, తీసుకున్న మొత్తం పుస్తకాల్లోనే రాసుకుంటారని వ్యాపారులు చెబుతున్నారు. పట్టణాల్లో ఎలాంటి వ్యాపారాన్ని ప్రారంభించాలన్నా ప్రజారోగ్య విభాగం నుంచి డీఅండ్‌వో ట్రేడ్? లైసెన్సు పొందాలి. దుకాణాలను మొదటి, ద్వితీయ, తృతీయ తరగతులుగా విభజిస్తారు. ఏసీ సౌకర్యముంటే రూ.8 వేల నుంచి రూ.10 వేలు, బంగారం దుకాణాలకు రూ.10 వేల నుంచి రూ.15 వేలు, చిన్నపాటి దుకాణమైతే రూ.వెయ్యి వరకు పన్ను విధిస్తారు.

లైసెన్స్‌దారులు నిర్ణీత ఫీజు చెల్లించి ఏటా పునరుద్ధరించుకోవాలి. చాలా చోట్ల అలా చేయడం లేదు. లైసెన్సు లేకుండానే వ్యాపారాలు కొనసాగించడం వెనుక కొందరి హస్తం ఉంది. పన్ను వసూలుకు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ సిబ్బంది కాకుండా వేరొకరు వస్తుంటారని, వారికి ఎంతో కొంత ముట్టజెప్పాల్సి వస్తోందని వ్యాపారులు చెబుతున్నారు. ఏడాదికోసారి పన్ను చెల్లించినా కొన్ని నెలల వ్యవధిలో ఇంకొందరు వస్తారని, ఇటీవలే చెల్లించామని చెప్పినా బకాయి ఉందంటూ హడావుడి చేస్తారంటున్నారు. పైగా రశీదు ఇవ్వరు. ఆన్‌లైన్‌లో నమోదు చేయరు. ఇటీవల భీమవరంలో ఓ ఉద్యోగి వసూలు చేసిన నగదు ఖజానాలో జమ చేయలేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి వ్యాపారులు తీసుకెళ్లగా రూ.2.10 లక్షలు ఖజానాలో జమ చేయలేదని తేలింది.

**వసూళ్లలో వెనుకంజ**

కొత్త దుకాణాలను ఆన్‌లైన్ చేయకపోగా కనీసం డిమాండ్‌కు తగ్గట్టుగా వసూళ్లు లేవు. భీమవరంలో 3155 దుకాణాల నుంచి రూ.47 లక్షలకు ఇప్పటి వరకు కేవలం రూ.3.60 లక్షలు, ఆకివీడులో 864 లైసెన్సుల నుంచి రూ.5.61 లక్షలకు రూ.56 వేలు వసూలైంది. జిల్లాలోని ఆరు పట్టణాల్లో 10 వేలకు పైగా దుకాణాల నుంచి దాదాపు రూ.1.10 కోట్లకు గత ఏప్రిల్ 1 నుంచి ఇప్పటి వరకు రూ.11.91 లక్షలే వచ్చింది. పన్ను వసూళ్లపై అధికారులతో సమీక్షిస్తానని పురపాలక రాజమహేంద్రవరం ప్రాంతీయ సంచాలకుడు సీహెచ్? నాగనరసింహారావు తెలిపారు. డిమాండ్?తో పాటు వసూళ్ల గురించి తెలుసుకుంటానని వివరించారు.

# పురంలో కొలువు బేరం



ఆదోని : ఆదోని పురపాలక సంఘంలో ఓ సభ్యుడు ఏకంగా కొలువు బేరం సాగిస్తున్నారు. ఆదోని పట్టణంలో రెండు లక్షల జనాభా ఉంది. పట్టణ పరిధిలో నీటి శుద్ధి ప్లాంట్ల నిర్వహణ, సరఫరా, ట్యాంకుల శుభ్రత, బోర్ల మరమ్మతులు, పచ్చదనం నిర్వహణ తదితర విభాగాల్లో పనిచేసేందుకు సిబ్బందిని నియమించాలని ప్రభుత్వం భావించింది. ఈ నేపథ్యంలో ఖాళీల వివరాలతో కూడిన నివేదికలను స్థానిక అధికారులు పురపాలక శాఖకు పంపారు. పొరుగు సేవల కింద నియమించుకోవాలని ఆదేశాలందాయి. కౌన్సిల్? తమ చేతుల్లో ఉందన్న ధీమాతో చేతివాటం చూపుతున్నారు. కొలువుల పేరుతో వెనకేసుకున్నారు. నియామకాలకు ఆమోదముద్ర పడకపోవడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు.

**తెరవెనుక మంతనాలు**

ప్రస్తుతం ప్రజారోగ్యేతర (నాన్‌పీహెచ్) విభాగంలో 113 మంది పనిచేస్తున్నారు. 2011 ఏడాది జనాభా లెక్కల ప్రకారం 1.66 లక్షల మంది జనాభాకు 166 మంది అవసరం. ప్రస్తుతం 113 మందే ఉన్నారు. 53 మంది అవసరం ఉంది. పొరుగు సేవల కింద తీసుకోవాలని భావించారు.

2024 సెప్టెంబరులో జరిగిన కౌన్సిల్? సమావేశంలో నియామకంపై అజెండాలో పొందుపరిచినా సభ్యులు ఆమోదించలేదు. నాటి నుంచి ప్రతి సమావేశంలో పొందుపరుస్తూ వచ్చినా ప్రయోజనం లేకపోయింది. పంపకాలపై అవగాహన కుదరడంతో తెరవెనుక ఉద్యోగాలను అమ్మకానికి పెట్టారు.

పొరుగు సేవల ఉద్యోగం కావడం.. ఆశావహుల సంఖ్య భారీగా ఉండటంతో ఒక్కో ఉద్యోగాన్ని రూ.3 లక్షల వరకు అమ్ముకున్నారు. కూటమిలోని ఓ నేత సైతం సహకరించి వాటా పొందినట్లు సమాచారం. ఆయనే పైస్థాయిలో దస్త్రానికి ఆమోదముద్ర పడేలా సహకరించారని సమాచారం.

**సుమారు రూ.కోటిన్నర వరకు..**

53 మంది నుంచి రూ.కోటిన్నర వరకు వసూలు చేశారు. కౌన్సిల్? ముగిసే లోపు ఉద్యోగాలకు ఆమోదముద్ర వేయించాలని డబ్బు తీసుకున్న సభ్యుడు తెగ ఆరాటపడుతున్నా.. అధికారులను ముప్పుతిప్పలు పెడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

ప్రస్తుతం వైకాపా చేతిలో ఉన్న కౌన్సిల్? కాలం మార్చి 17వ తేదీతో ముగుస్తుంది. ఈలోపు మాత్రమే సభ్యుల మాట చెల్లుబాటవుతుంది. ఈ నేపథ్యంలో బాధితులు సదరు నేత ఇంటి చుట్టూ తిరుగుతున్నారు. ఉద్యోగమైనా ఇప్పించండి.. లేకుంటే తమ డబ్బైనా ఇవ్వండి అంటూ ఒత్తిడి తెస్తున్నారు.

**స్థానికంగా అడ్డుకుని..**

ఉద్యోగ నియామకాల్లో మాత్రం స్థానికంగా ఆటంకాలు తప్పడం లేదు. కొందరికి దక్కాల్సిన వాటా లభించకపోవడమో.. ఇతరత్రా కారణాలేమోగానీ.. కొత్తగా తీసుకోనున్న సిబ్బందికి నెలవారీ జీతాల సర్దుబాటుకు ఆర్థిక లోటు ఉందన్న కొర్రీ పెట్టినట్లు తెలుస్తోంది.

దస్త్రానికి ఆమోదముద్ర పడకపోవడంలో ఓ సభ్యుడి హస్తం సైతం ఉన్నట్లు సమాచారం. ఎవరికి వారు పంపకాలు చేసుకుంటే.. మా పరిస్థితి ఏంటి? అన్న చర్చ సాగుతోంది. కౌన్సిల్? కాలం చివరి దశలో నిధులు దండుకునేందుకు 'బేరం' కుదుర్చుకున్నారు. ఈ తతంగంపైలో కథనం ప్రచురితమైంది. దీనిపై అధికారులు విచారణ చేపట్టినా.. నివేదిక మాత్రం బయటకు రానివ్వలేదు.

# జనగణమన.. ప్రధాన కూడళ్లలో ఆలాపన

తాడిపత్రి.. సమయం ఉదయం 8.30 గంటలు.. ఇంకేముంది జాతీయగీతం వినిపిస్తుంది. అందరూ ఒక్కసారిగా ఆగిపోయి జనగణమన... అంటూ ఆలపిస్తారు. ఒకటి, రెండు రోజులు కాదు నిత్యం జరిగే తంతు. ఎక్కడో కాదు.. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో దేశభక్తి చాటుతున్నారు. నిర్వహణ అంతా తాడిపత్రికి చెందిన రోటరీక్లబ్ సభ్యులు చేస్తున్నారు. సొంత ఖర్చులతో నిత్యం జాతీయ జెండాలు చేతపట్టి సమైక్యత చాటుతున్నారు. **మైక్‌సెట్‌లు ఏర్పాటు చేసి..** ప్రజల్లో దేశభక్తి పెంపొందించాలనే ఉద్దేశంతో 2024 సంవత్సరంలో క్లబ్ సభ్యులు సుమారు రూ.2లక్షల వ్యయంతో పట్టణంలోని ప్రధాన కూడళ్లలో మైకుసెట్‌లు ఏర్పాటు చేయించారు. అప్పటి నుంచి క్లబ్ సభ్యులు వాటి ద్వారా జాతీయగీతాన్ని వినిపించి ప్రజలు ఆలపించేలా చేస్తున్నారు. ఈ దృశ్యం నిత్యం అశోక్‌పిల్లర్, పోలీస్‌స్టేషన్, యల్లనూరు రోడ్డు, బస్టాండు..తదితర కూడళ్లలో కనిపిస్తుంది. **5 నిమిషాలు..** 'తాడిపత్రి రోటరీ క్లబ్?లో 45 మంది సభ్యులు ఉన్నారు. సరిగ్గా ఉదయం 8.30 గంటలకు మైక్?లలో జాతీయ గీతం వచ్చేలా ఏర్పాట్లు చేశాం. అందరూ స్పందించి.. 5 నిమిషాల పాటు సమయాన్ని వెచ్చిస్తున్నారు. ప్రారంభంలో ప్రజలు చిరాకు పడినా ప్రస్తుతం పూర్తిగా సహకరిస్తున్నారు' అని క్లబ్? అధ్యక్షుడు కిషోర్‌కుమార్ చెబుతున్నారు

# అనాథలకు అండ.. ఎస్వీ బాల మందిరం

తిరుపతి : తిరుపతిలో తితిదే నడిపిస్తున్న శ్రీ వేంకటేశ్వర (ఎస్వీ) బాలమందిరం అనాథ చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపుతోంది. విద్య, వసతి, ఆహారం, ఆరోగ్య సంరక్షణ, సాంస్కృతిక, నైతిక విలువలు నేర్పుతూ నిరాదరణకు గురైన పిల్లలకు సురక్షితమైన భవిష్యత్తును చూపిస్తోంది. ఇక్కడ ఒకటో తరగతి నుంచి డిగ్రీ వరకు తితిదే విద్యా సంస్థలో ఉచితంగా చదువుకోవచ్చు.

**ప్రస్థానం ఇలా..**

1943లో ఎస్వీ అనాథాశ్రమంగా ప్రారంభమైంది.

1961లో అప్పటి ప్రధాని నెహ్రూ చేతుల మీదుగా ఎస్వీ బాలమందిరంగా మారింది.

2014లో ఎస్వీ సర్వశ్రేయాస్ ట్రస్ట్ పరిధిలోకి తితిదే తీసుకొచ్చింది.

ప్రవేశాలు: 500 మందికి 2025-26లో 100 మంది బాలికలు, 143 మంది బాలురు పదో తరగతి చదివారు. వారిలో బాలురు 56, బాలికలు 49 మంది ఇంటర్మీయట్ చదువుతున్నారు.

**వసతులు ఇలా..**

బాల బాలికలకు వేర్వేరుగా వసతి కల్పిస్తారు.



ఉచిత విద్య, భోజనం, వసతి, వైద్యం, భద్రత ఉంటుంది.

ఇంజినీరింగ్, వైద్య విద్య లాంటి కోర్సుల్లో చేరితే ఆర్థిక సాయం అందిస్తారు.

కార్పొరేట్ కళాశాలల్లో విద్య: తాజాగా డిసెంబర్ 4న జరిగిన ఈవో అనిల్ కుమార్ సింఘాల్ అధ్యక్షతన జరిగిన ఎస్వీ సర్వశ్రేయాస్ ట్రస్ట్ సమావేశంలో పదిలో 75 శాతానికి పైగా మార్కులు సాధించిన బాలబాలికలకు కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ విద్య అందించాలనే కీలక నిర్ణయం తీసుకున్నారు.

అర్హులు వీరే..: హిందువులైన 5-10 ఏళ్ల లోపు చిన్నారులు అర్హులు. తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలకు మొదటి ప్రాధాన్యం, తల్లి లేదా తండ్రి లేని వారు తర్వాత, చివరగా నిరుపేదలు, దీర్ఘకాలిక వ్యాధులు, మానసిక వైకల్యం, దివ్యాంగ తల్లిదండ్రుల పిల్లలకు అవకాశం కల్పిస్తారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో అవకాశాలు

శ్రీవారి బ్రహ్మోత్సవాలు, తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి, శ్రీ కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాలు, రథసప్తమి, స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలు ఇతర వేడుకల సందర్భంగా జరిగే సాంస్కృతిక కార్యక్రమాల్లో ఎస్వీ బాలమందిరం విద్యార్థులకు తితిదే ప్రత్యేక అవకాశాలు కల్పిస్తోంది.

వివరాలకు 08772264613 నంబరులో సంప్రదించవచ్చు.

# నగరవనంలో అవినీతి మొలకలు

కర్నూలు: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న నగరవనాల నిర్మాణంలో అవినీతి జరుగుతోందన్న ఆరోపణలు వెల్లువె త్తుతున్నాయి. డోన్, ఆదోనిలో ప్రస్తుతం కేంద్ర నిధులతో నగరవనాల నిర్మాణం జరుగుతోంది. రెండు చోట్లా 50 హెక్టార్ల విస్తీర్ణంలో ఏడాది కాలంగా పనులు జరుగుతున్నాయి. ఒక్కో చోట రూ.2 కోట్ల చొప్పున వెచ్చించాలని నిర్ణయించారు.

**ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారుల తనిఖీ**

కర్నూలు అటవీశాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు డోన్, ఆదోని పట్టణాల్లో నిర్మిస్తున్న పనులపై ఆరోపణలు రావడంతో కొద్దినెలల కిందట తనిఖీలు చేశారు. నిధుల మంజూరు, చేపట్టిన పనులు, నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు.

ఆదోనిలో ఇంకా రూ.40లక్షల విలువైన పనులు ఇంకా చేయలేదు. డోన్‌లో పనులపై మాత్రం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు చాలా లోపాలు చూపినట్లు సమాచారం. ఉన్నతాధికారులు డోన్ పనుల్లో గుర్తించిన లోపాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సిందే. దుర్వినియోగమైన నిధులు రికవరీ పెట్టాల్సి ఉండగా ఇంకా పెట్టలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమాలకు బాధ్యులైన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్న విమర్శలున్నాయి.

**ఎంతకూ పూర్తికావు ఎందుకో..**

ఆదోనిలో రూ.1.60 కోట్లు వెచ్చించగా.. డోన్‌లో ఇప్పటివరకు రూ.98లక్షలు నిధులనే వినియోగించారు. అటవీప్రాంతాలున్న చోట్ల స్థానికులు విహరించడానికి, సైక్లింగ్, వాకింగ్ చేయడానికి, చిన్నచిన్న శుభ కార్యాలు నిర్వహించడానికి అందులో కొన్ని నిర్మాణాలు చేస్తారు.

అంతర్గత రహదారులను నిర్మించాలి. సందర్శకుల అవసరమైన ఆహారం అందించడానికి క్యాంటీన్‌ను అందుబాటులోకి తేవాలి.

అందమైన ఆకృతులు అందుబాటులో ఉంచడంతోపాటు పిల్లలు ఆడుకోవడానికి ఏర్పాట్లు సైతం చేయాలి.



అటవీప్రాంతం నేపథ్యంలో సందర్శకుల రక్షణకు వీలుగా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు కూడా చేయాలి. ఫెన్సింగ్, గేట్లు, అందమైన ముఖద్వారం ఏర్పాటుచేయాలి. వాటి కోసం రూ.లక్షలను వెచ్చిస్తున్నా పనులు మాత్రం పూర్తికావడంలేదు. కేంద్రప్రభుత్వ నిధులు కావడంతో పర్యవేక్షించేవారు కరవయ్యారు.

# అమ్మను నొప్పించకుండా

కర్నూలు : కర్నూలు సర్వజన వైద్యశాలలోని గైనిక్ విభాగంలో వైద్యులు మరో ఘనత సాధించారు. రోగులకు ఉత్తమ సేవలందిస్తున్న వీరు తొలిసారిగా నొప్పులు లేని ప్రసవాన్ని విజయవంతంగా చేశారు. కోడుమూరు మండలం ప్యాలకుర్తికి చెందిన పవిత్ర (25) రెండో ప్రసవం కోసం ఈనెల 22న కర్నూలు సర్వజన ఆస్పత్రిలోని గైనిక్ విభాగంలో చేరారు. చాలామంది గర్భిణులు ప్రసవ సమయంలో పురిటి నొప్పులు భరించలేక శస్త్రచికిత్సలు చేయించుకొంటుంటారు. అప్పటివరకు బాగానే ఉంటున్నా భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు తలెత్తుతుంటాయి. పవిత్ర సైతం మొదటి ప్రసవం సమయంలో నొప్పులు భరించలేక అల్లాడిపోయారు. రెండో ప్రసవ సమయంలో వైద్యులు ఆమెకు మనోధైర్యం కల్పించారు. సాంకేతికత ఉపయోగించి ఎపిడ్యూరల్ సాయంతో నొప్పి లేని కాన్పు చేయాలని నిర్ణయించారు. అనస్థీషియా ప్రొఫెసర్ డా.శివరామ్‌నాయక్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.సంజీవ్ కుమార్, గైనిక్ వైద్యులు కుముద, నర్మద, రేవతి కలిసి శుక్రవారం విజయవంతంగా ప్రక్రియ పూర్తి చేశారు. కార్పొరేట్ ఆస్పత్రులో మాత్రమే నొప్పులు లేని కాన్పులు చేస్తారని.. దీనికిగాను నగరాల్లో రూ.లక్ష, కర్నూలు నగరంలో రూ.50 వేల వరకు ఖర్చవుతుందని వైద్యులు వివరించారు. వైద్యులను ఆస్పత్రి పర్యవేక్షకుడు డా.వెంకటేశ్వర్లు అభినందించారు.

## రెడ్ డ్రెస్ లో మానస అందాలు.. ఆ పిక్స్ అదుర్స్!


సోషల్ మీడియాను ఈ మధ్య సెలబ్రిటీలు పాపులారిటీ సంపాదించుకోవడానికి ఆయుధంగా మలుచుకుంటున్నారు. అందులో భాగంగానే అందాలు ఆరబోస్తూ ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాకుండా తమ ట్రెండీ ఫ్యాషన్స్ తో అటు ఫ్యాషన్ ప్రియులను కూడా మెప్పిస్తున్నారు. ముఖ్యంగా తమ డ్రెస్ సెన్స్ తో అమ్మాయిలకు సరికొత్త ఫ్యాషన్ ను పరిచయం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ మధ్యకాలంలో కాలేజ్ కి వెళ్ళే అమ్మాయిలు కూడా హీరోయిన్స్ డ్రెస్సింగ్ ను ఫాలో అవుతున్నారు అంటే ఇక సెలబ్రిటీలు ఏ రేంజ్ లో యువతను ఆకట్టుకుంటున్నారో అర్థం చేసుకోవచ్చు. కాలానుకనుగుణంగా చాలా అందంగా తయారవుతూ అభిమానులను ఆకట్టుకుంటున్న ఈ ముద్దుగుమ్మలు.. అటు ఫాలోవర్స్ ని కూడా పెంచుకుంటున్నారు. ఒకవైపు అందాలు ఆరబోస్తూ మరొకవైపు కొన్ని ఉత్పత్తులను ప్రమోట్ చేస్తూ భారీగా ఆదాయాన్ని పెంపొందించుకుంటున్న విషయం తెలిసిందే . ఇదిలా ఉండగా ఇప్పుడు తన అందంతో ఆకట్టుకోవడమే కాకుండా తన సినిమా ప్రమోషన్స్ లో భాగంగా ఇలా ఘాటు మిర్చీలా రెడ్ డ్రెస్ లో ఫోటోలు షేర్ చేసి అందరినీ ఆకట్టుకుంది మానస వారణాసి. అందం , అభినయంతో అభిమానులను ఆకట్టుకునే ఈ చిన్నది సింపుల్ స్టైల్ తో మనసుకు హత్తుకునేలా ఫోటోలకు ఫోజులిచ్చింది. విషయంలోకి వెళ్తే.. సంతోష్ శోభన్ హీరోగా మానస



వారణాసి హీరోయిన్గా తెరకెక్కుతున్న చిత్రం కపుల్ ఫ్రెండ్లీ . ఫిబ్రవరి 14వ తేదీన వాలెంటైన్స్ డే సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న నేపథ్యంలో ఇటీవల మంగళవారం హైదరాబాదులో ఒక ప్రెస్ మీట్ నిర్వహించింది. చిత్ర బృందం. అందులో భాగంగానే తన అద్భుతమైన డ్రెస్సింగ్ సెన్స్ తో అందర్నీ ఆకట్టుకున్న ఈమె.. అవే ఫోటోలను ఫోటోషూట్ నిర్వహించి సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. ఇందులో సింపుల్ స్టైల్ తో ఆకట్టుకుంటూనే మరొకవైపు గార్జియస్ లుక్ లో కనిపించి ఆడియన్స్ హృదయాలను దోచుకుంది. ఇకపోతే ఈ లుక్ లో ఈమెను చూసిన కొంతమంది అభిమానులు జూనియర్ అనుపమ అంటూ కామెంట్ కూడా చేస్తున్నారు. మొత్తానికైతే మానస వారణాసి పంచుకున్న ఈ లేటెస్ట్ ఫోటోషూట్ విపరీతంగా వైరల్గా మారింది. ఇకపోతే వాలెంటైన్స్ డే సందర్భంగా తన సినిమా విడుదలవుతున్న నేపథ్యంలో.. తాజాగా నిర్వహించిన ప్రెస్ మీట్ లో మానస వారణాసి మాట్లాడుతూ.. ప్రేమపై తన అభిప్రాయాన్ని చెప్పుకొచ్చింది. మనం మన ఇంట్లో మన కుటుంబ సభ్యుల మధ్య ఎంత భద్రతగా ఫీల్ అవుతామో ..ప్రేమికుడి వద్ద అంతే భద్రతగా ఉండాలి. అదే అసలైన ప్రేమకు నిర్వచనం అంటూ చెప్పుకొచ్చింది.. మొత్తానికైతే అటు తన నటనతోనే కాదు ఇటు అద్భుతమైన అభిప్రాయాలను పంచుకుంటూ వార్తల్లో నిలుస్తోంది మానస వారణాసి. చాశ్రీంశీ =ఝు - రణ్ వీర్ (శ) హృతిక్ రోషన్.. ఎవరు బెస్ట్ డాన్? మానస వారణాసి తెలంగాణకు చెందిన మోడల్.. కోకోకోల మ్యూజిక్ హాల్ 2021 భారతదేశం తరఫున మిస్ వరల్డ్ పోటీలలో ప్రాతినిధ్యం వహించి పదవ స్థానంలో నిలిచింది.

## బాలయ్య 'డబుల్' ఫెస్టివల్ ప్లాన్!

నందమూరి నటసింహం బాలకృష్ణ మరోసారి డబుల్ ట్రీట్ కు రెడీ అవుతున్నట్టు టాలీవుడ్ లో టాక్ వినిపిస్తోంది. తక్కువ గ్యాప్ లోనే రెండు బడా సినిమాలతో అభిమానులను అలరించేలా ప్లాన్ రెడీ అవుతుందని సమాచారం. ప్రస్తుతం గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న మూవీ షూటింగ్ త్వరలో స్టార్ట్ కానుండగా.. రిలీజ్ ప్లాన్ లో కీలక మార్పులు చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. మొదట ఆ సినిమాను 2027 సంక్రాంతి బరిలో దించాలని భావించారు మేకర్స్. అయితే తాజా సమాచారం ప్రకారం ఆ ప్లాన్ మార్చి.. ఈ ఏడాది దసరా కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని డిసైడ్ అయినట్లు తెలుస్తోంది. పండుగ సీజన్ లో మాస్ సినిమాలకు మంచి డిమాండ్ ఉండటంతో పాటు బాలయ్య యాక్షన్ ఎంటర్టైనర్లకు దసరా సీజన్ సరిగ్గా సరిపోతుందనే అభిప్రాయంతో ఆ నిర్ణయం తీసుకున్నారని టాక్. దీంతో సినిమా షూటింగ్ షెడ్యూల్ ను చేంజ్ చేసి, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ ను ప్యారలల్ గా కంప్లీట్ చేసేలా ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. అయితే గోపీచంద్ మలినేని-- బాలయ్య కాంబినేషన్ కు ఇప్పటికే మంచి క్రేజ్ ఉంది. గతంలో వీరి కలయికలో వచ్చిన వీర సింహా రెడ్డి మూవీ భారీ విజయాన్ని అందుకోవడంతో.. కొత్త ప్రాజెక్ట్ పై అభిమానుల్లో అంచనాలు



పెరిగాయి. మాస్ డైలాగులు, పవర్ ఫుల్ యాక్షన్ సీన్స్, బాలయ్య మార్క్ ఎంటర్టైన్మెంట్ మలినేని మూవీలో ఉండబోతున్నాయని వినికిడి. అదే సమయంలో బాలయ్య 2027 సంక్రాంతి కూడా వదులుకోవడం లేదని తెలుస్తోంది. స్టార్ డైరెక్టర్ హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కనున్న కొత్త సినిమాను పొంగల్ కానుకగా రిలీజ్ చేయాలన్న ఆలోచనలో ఉన్నారట. సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై యంగ్ ప్రొడ్యూసర్ నాగవంశీ నిర్మించనున్న ఆ ప్రాజెక్ట్ త్వరలో అధికారికంగా ప్రారంభం కానుందని సమాచారం. ప్రస్తుతం పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తో చేస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్ మూవీ కంప్లీట్ అయ్యాక హరీష్ శంకర్.. బాలయ్య ప్రాజెక్ట్ పై దృష్టి పెట్టనున్నారట. సంక్రాంతి సీజన్ అంటే నాగవంశీకి మంచి సెంటిమెంట్. ఆయన నిర్మించిన పలు చిత్రాలు ఆ సమయంలో మంచి విజయాలు సాధించాయి. అందుకే 2027 సంక్రాంతిని టార్గెట్ చేస్తూ భారీ ఎంటర్టైనర్ ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ప్లాన్ చేస్తున్నారని తెలుస్తోంది. మొత్తానికి బాలయ్య ఫ్యాన్స్ కు వరుస పండుగలే అన్నమాట. ఈ ఏడాది దసరాకు ఒక సినిమా, ఆ తర్వాత సంక్రాంతికి మరో మూవీ రిలీజ్ అయితే.. అభిమానులకు డబుల్ ఎంజాయ్మెంట్ ఖాయం. అఫీషియల్ అనౌన్స్మెంట్లు త్వరలో రానున్నప్పటికీ.. ప్రస్తుతం చక్కర్లు కొడుతున్న అప్డేట్స్ తో నందమూరి అభిమానుల్లో జోష్ డబుల్ అయింది. బాలయ్య మరోసారి బాక్సాఫీస్ ను షేక్ చేస్తారని అంతా ఫిక్స్ అయిపోయారు!




## స్వయంభు డబుల్ సర్ ప్రైజ్.. దాచారట!



యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ్ ఇప్పుడు బాక్సాఫీస్ వద్ద వరుస ప్రయోగాలతో దూసుకుపోతున్నారు. 'కార్తికేయ 2' తో పాన్ ఇండియా రేంజ్‌లో తన సత్తా చాటిన నిఖిల్, ఇప్పుడు 'స్వయంభు' అనే భారీ పీరియడ్ డ్రామాతో రావడానికి సిద్ధమయ్యారు. ఈ సినిమాకు సంబంధించి ఇప్పటివరకు వచ్చిన ప్రతీ అప్‌డేట్ ఆడియన్స్‌లో పాజిటివ్ గా అంచనాలను పెంచుతూనే ఉంది. ముఖ్యంగా ఈ మూవీ టీజర్ లాంచ్ ఈవెంట్ ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. హైదరాబాద్‌లోని ప్రసాద్స్ మల్టీప్లెక్స్‌లో జరిగిన ఈ ఈవెంట్‌లో సినిమా టీజర్‌ను గ్రాండ్‌గా లాంచ్ చేశారు. రాజుల కాలానికి తీసుకెళ్లే సెట్స్, రాజదండం చుట్టూ తిరిగే కథ, రవి బస్రూర్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్.. ఇలా టీజర్‌లో ప్రతీ ఫ్రేమ్ హై రేంజ్‌లో ఉందనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. అయితే టీజర్ కంటే కూడా ఈ వేదికపై హీరో నిఖిల్ చేసిన ఒక ఇంట్రెస్టింగ్ కామెంట్ ఇప్పుడు సినిమాపై అంచనాలను రెట్టింపు చేసింది. అదేమిటంటే, ఈ సినిమా రెండు భాగాలుగా ఉండబోతుందనే విషయాన్ని నిఖిల్ టీజర్ లాంచ్ ఈవెంట్‌లో డైరెక్ట్‌గా లీక్ చేసేశారు. సంయుక్త మీనన్ క్యారెక్టర్ గురించి మాట్లాడుతున్న ఫ్లోలో, "రెండు పార్టుల్లోనూ ఆవిడ పాత్ర ఉంటుంది, షీ ఈజ్ డూయింగ్ ఆన్ అమేజింగ్ థింగ్" అని నిఖిల్ పేర్కొన్నారు. ఇప్పటివరకు 'స్వయంభూ' రెండు భాగాలుగా వస్తుందనే దానిపై కొన్ని రూమర్స్ వినిపించినా, మేకర్స్ నుండి ఎలాంటి క్లారిటీ లేదు. కానీ నిఖిల్ ఇలా డైరెక్ట్‌గా చెప్పేయడంతో సినిమా స్పాన్ ఎంత పెద్దదో అర్థమవుతోంది. సినిమాలో ఇంకా చాలా సర్ప్రైజ్ ఎలిమెంట్స్ దాచి ఉంచామని, వాటన్నింటినీ మెల్లిమెల్లిగా బయటకు తీస్తామని నిఖిల్ హింట్ ఇచ్చారు. రాజదండం స్వాధీనం చేసుకునేందుకు జరిగే యుద్ధాల నేపథ్యంలో ఈ మూవీ కథ సాగనుందని టీజర్ ద్వారా క్లారిటీ వచ్చింది. నిఖిల్ ఒక పవర్ ఫుల్ వారియర్‌గా ఈ సినిమాలో సరికొత్త మేకోవర్‌లో కనిపించనున్నారు.

10 భాషల్లో రిలీజ్ కాబోతున్న ఈ ప్రాజెక్ట్‌ను పిక్సెల్ స్టూడియోస్ అత్యంత భారీగా నిర్మిస్తోంది. హీరోయిన్స్ సంయుక్త మీనన్, నభా నటేష్ పాత్రల విషయంలో కూడా నిఖిల్ చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నారు. టీజర్‌లో అందరినీ థ్రిల్ చేసిన విజువల్స్ కేవలం శాంపిల్ మాత్రమేనని, సినిమాలో ఇంకా అద్భుతమైన సీక్వెన్స్ లు ఉన్నాయని మేకర్స్ చెబుతున్నారు. రెండు పార్టుల వార్తతో ట్రేడ్ వర్గాల్లో కూడా ఈ సినిమాపై బిజినెస్ పరంగా క్రేజ్ పెరిగే అవకాశం ఉంది. ఈ వేసవి కానుకగా ఏప్రిల్ 10న 'స్వయంభూ' థియేటర్లలో సందడి చేయబోతోంది. ఒకే ఒక్క టీజర్‌తో సినిమా లెవల్ ఏంటో నిఖిల్ టీమ్ చూపించింది. రాజవంశాల గొడవలు, భారీ సెట్స్ చూస్తుంటే బాక్సాఫీస్ వద్ద మరోసారి నిఖిల్ మేజిక్ చేసేలా ఉన్నారు. నిఖిల్ నోటి నుంచి వచ్చిన 'టూ పార్ట్స్' అనే లీక్ ఇప్పుడు వైరల్ గా మారింది. మరి మొదటి భాగం ఏ స్థాయిలో మెప్పిస్తుందో, రెండో భాగం కోసం ఎలాంటి ఇంట్రెస్ట్ క్రియేట్ చేస్తుందో చూడాలి.

## సితార ఘట్టమనేని.. దేశంలోని నేపో కిడ్స్ అందరికీ సవాల్!



క్యూట్ అమ్మాయి సితార ఘట్టమనేని ఏ ఇతర నేపోకిడ్స్ కంటే కూడా అత్యుత్తమమైన రూపం, ట్రెడిషన్ తో ఆకర్షిస్తోంది. టీనేజీ గాళ్ ఈ ప్రపంచాన్ని మంత్రముగ్ధం చేస్తోంది. అంతేకాదు.. తండ్రికి తగ్గ తనయగా సితార నటవారసత్వాన్ని ముందుకు తీసుకెళుతుందని అభిమానులు ఆశిస్తున్నారు. ఇలాంటి సమయంలో వాణిజ్య ప్రకటనల్లో సితార దూసుకెళుతోంది. సాంప్రదాయబద్ధంగా కనిపిస్తూనే ఘట్టమనేని స్టార్ కిడ్ ఇండస్ట్రీని ఏల్తారా? నటనారంగంలోకి వెళతారా? అనే ప్రశ్నకు సమాధానం కోసం అభిమానులు ఆసక్తిగా వేచి చూస్తున్నారు.మహేష్ బాబు గారాల పట్టి సితార ఘట్టమనేని తన క్యూట్‌నెస్, కాన్ఫిడెన్స్, సంప్రదాయబద్ధమైన శైలితో ఇప్పటికే ఒక చిన్నపాటి స్టార్‌డమ్ సంపాదించుకుంది. సోషల్ మీడియాలో సితార డ్యాన్స్ వీడియోలు, ఫోటో షూట్స్ చూస్తుంటే భవిష్యత్తులో భారతీయ సినీపరిశ్రమను ఏలే స్టార్ అవుతుందని అభిమానులు గట్టిగా నమ్ముతున్నారు. భవిష్యత్తులో ఏం కావాలనుకుంటున్నారు? అనే ప్రశ్నకు సితార చాలా పరిణతితో సమాధానమిచ్చారు. నేను ఇంకా చాలా చిన్నదాన్ని.. ఇప్పుడే ప్రతిదీ అర్థం చేసుకుంటున్నాను. భవిష్యత్తులో ఏం జరుగుతుందో చూడాలని ఉత్సాహంగా ఉన్నాను. నేను ఏ మార్గాన్ని ఎంచుకున్నా మా అమ్మనాన్నలు నాకు మార్గదర్శకత్వం వహిస్తారని, మద్దతుగా నిలుస్తారని నాకు తెలుసు. ప్రస్తుతానికి నేను ఈ ప్రయాణాన్ని ఆస్వాధిస్తున్నాను-- అని సితార అన్నారు. నేరుగా నటిని అవుతానని చెప్పకపోయినా కెమెరా ముందు ఉన్న ఈజ్, డ్యాన్స్‌పై ఉన్న మక్కువ చూసినప్పుడు సితార వెండితెరపై మెరవడం ఖాయమని అభిమానులు భావిస్తున్నారు. బాలీవుడ్ నేపో కిడ్స్ అనన్య, సారా, సుహానా ఖాన్ వంటి వారికి సితార ఘట్టమనేని పోటీ ఇస్తారా? అంటే.. కచ్చితంగా అందుకు అవకాశం ఉంది. నిజానికి సితారకు ఒక ప్రత్యేకమైన ఆకర్షణ ఉంది. తన నేచురల్ లుక్ ఎంతో ముచ్చటగొలుపుతుంది. నేపో కిడ్స్ అనన్య, సారా తరచుగా గ్లామర్ పరమైన విషయాలలో వెస్ట్రన్ లుక్స్‌పై దృష్టి పెడతారు. కానీ సితార తన సాంప్రదాయబద్ధమైన రూపంతోనూ, పద్ధతైన ఆహార్యంతోనూ దేశ వ్యాప్తంగా అభిమానులకు బాగా దగ్గరైంది. టీనేజ్‌లోనే ఒక ప్రముఖ జువెలరీ బ్రాండ్‌కు అంబాసిడర్‌గా మారి, న్యూయార్క్ టైమ్స్ స్క్వేర్‌పై కనిపించిన తొలి స్టార్ కిడ్‌గా రికార్డు సృష్టించింది. ఇది సితారకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చింది. ఏపీ తెలంగాణలో చాలా హోర్డింగులలో, షాపుల ముందు ఫ్లెక్సీల్లో సితార దివ్యమైన రూపం కట్టి పడేస్తోంది. తనకు భారీగా అభిమానుల సంఖ్య కూడా పెరుగుతోంది. ఇది సితార బ్రాండ్ వ్యాల్యూని అమాంతం పెంచుతోంది. ఇటీవలి ఇంటర్వ్యూలో తన స్టైల్ మంత్ర గురించి సితార చెబుతూ..నా స్టైల్ మంత్ర క్లాసీగా ఉండాలి కానీ అతిగా ఉండకూడదు. సౌకర్యవంతంగా, చూడగానే ఆకట్టుకునేలా ఉండటం నాకు ఇష్టం అని అన్నారు. అలాగే ఆభరణాలపై తన ఆసక్తి గురించి మాట్లాడుతూ.. నగలు అనేవి మన డ్రెస్సింగ్‌ను ఎలివేట్ చేయాలి తప్ప, మనల్ని డామినేట్ చేయకూడదు. అందుకే నాకు -సితార కలెక్షన్- అంటే ఇష్టం. ఇది చాలా ఫెమినిన్, ఎలిగెంట్‌గా ఉంటుందని అన్నారు. తనను మోటివేట్ చేసేది ఏది? అని ప్రశ్నిస్తే, .. చాలా మంది జీవితాలపై సానుకూల ప్రభావం చూపడం, సమాజంలో మార్పు తీసుకురావడానికి లభించే అవకాశమే నన్ను ఎప్పుడూ మోటివేట్ చేస్తుందని సితార పరిణతితో మాట్లాడారు. కేవలం మహేష్ బాబు కూతురు అనే ట్యాగ్‌తోనే కాకుండా, తనకంటూ ఒక సొంత గుర్తింపును క్రియేట్ చేసుకుంటోంది. తండ్రిలోని క్రమశిక్షణ, తల్లి నమ్రతకు ఉన్న మేనేజ్‌మెంట్ స్కిల్స్ పుష్కలంగా కనిపిస్తున్నాయి. భవిష్యత్తులో సితార ఘట్టమనేని వారసత్వాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్లడం ఖాయం.

## ఎల్లో శారీతో పిచ్చెక్కిస్తున్న ఫరియా అబ్దుల్లా!

ఫరియా అబ్దుల్లా.. ఆరడుగుల ఈ అందగత్తె గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. ఒకే ఒక్క సినిమాతో తెలుగు కుర్రాళ్ల గుండెల్లో 'చిట్టి'గా గూడు కట్టుకున్న ఈ హైదరాబాదీ ముద్దుగుమ్మ 'జాతి రత్నాలు' సినిమాతో అభిమానుల హృదయాలను దోచుకుంది. అమాయకమైన నటనతో ఆకట్టుకునే డాన్స్ తో తెలుగు ఇండస్ట్రీలో క్రేజీ హీరోయిన్ గా మారిపోయింది ఈ ముద్దుగుమ్మ. ఇకపోతే ఆరడుగుల అందం ఈమెకు కెరియర్ మొదట్లో అవకాశాలను అందించలేదు. కారణం ఈమె హైట్ కు తగ్గట్టు హీరోలు దొరకకపోవడం. రెబల్ స్టార్ ప్రభాస్, సూపర్ స్టార్ మహేష్ బాబు మినహా ఈమె హైట్ ని సరితూగే హీరోలు లేకపోవడం వల్ల ఈమెకు ఆ అవకాశాలు లభించలేదని వార్తలు కూడా వినిపించాయి. అయితే ఇప్పుడు యంగ్ హీరోలు ఈమె హైట్ ను బ్యాలెన్స్ చేస్తూ ఈమె నటనను ఉపయోగించుకుంటూ తమ సినిమాలతో సక్సెస్ అందుకోవడమే కాకుండా చిట్టికి కూడా మంచి అవకాశాలు కల్పిస్తున్నారు.ఇక తన అద్భుతమైన డాన్స్ పెర్ఫార్మెన్స్ తో భారీ పాపులారిటీ సొంతం చేసుకున్న ఫరియా అబ్దుల్లా ఇటీవల తిరువీర్ హీరోగా వస్తున్న 'భగవంతుడు' సినిమాలో తొలిసారి పల్లెటూరి అమ్మాయి పాత్రలో చాలా అద్భుతంగా ఒదిగిపోయి ప్రేక్షకులను ఆకట్టుకోబోతోంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన టీజర్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్న విషయం తెలిసిందే. ఇక మరొకవైపు ప్రముఖ డైరెక్టర్ కం హీరో తరుణ్ భాస్కర్ హీరోగా



వస్తున్న 'గాయపడ్డ సింహం' అనే సినిమాలో హీరోయిన్ గా నటిస్తోంది. తాజాగా ఈ టీజర్ కం ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించగా ఈ వేదికపై ఫరియా అబ్దుల్లా తన అందాలతో అభిమానులను మంత్రముగ్ధుల్ని చేసింది. ఎల్లో కలర్ చీర కట్టుకొని వచ్చిన ఈమె తన అందాలతో అభిమానులను ఉక్కిరిబిక్కిరి చేసింది. అమ్మడి అందానికి అభిమానులు ఫిదా అవ్వడమే కాకుండా ఈ పొడుగు కాళ్ళ సుందరి అందానికి దాసోహం అంటూ కామెంట్ చేస్తున్నారు. మొత్తానికైతే ఫరియా అబ్దుల్లా లుక్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటుంది అని చెప్పవచ్చు. ఇదిలా ఉండగా ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈమె తాను ప్రేమలో పడ్డ విషయాన్ని కూడా అభిమానులతో పంచుకుంది. సాధారణంగా హీరోయిన్లు తమ రిలేషన్షిప్ ను బహిరంగంగా బయట పెట్టడానికి ఆసక్తి కనబరచరు. కానీ ఫరియా అబ్దుల్లా మాత్రం తాను రిలేషన్ లో ఉన్న విషయాన్ని బాహాటంగా బయటకి చెప్పి అందరిని ఆశ్చర్యపరిచిందిచాశ్రీంశీ =ఝు - చీరకట్టులో గిలిగింతలు పెడుతున్న మానస వారణాసి.. ఆ స్టైల్ కే ఫిదా గురూ! ఇటీవల ఆమె మాట్లాడుతూ.." నేను ఒక వ్యక్తితో ప్రస్తుతం గాఢమైన ప్రేమలో ఉన్నాను.ఇక నా ప్రియుడి విషయానికొస్తే నేను ప్రేమిస్తున్న వ్యక్తి ముస్లిం కాదు.ఆయన ఒక హిందువు. వృత్తిపరంగా కొరియోగ్రాఫర్ గా పనిచేస్తున్నారు. నా సినిమాల్లో నా డాన్స్ ఇంత బాగా రావడానికి.. నేను నా డాన్స్ ను ఇంప్రూవ్ చేసుకోవడానికి ప్రధాన కారణం ఆయనే ప్రస్తుతం మేము ప్రేమికులుగానే కాకుండా ఇద్దరం ఒక టీం లాగా కలిసి పనిచేస్తున్నాము" అంటూ ఫరియా చెప్పుకొచ్చింది.

## మళ్లీ రేస్‌కు రెడీ అవుతున్న కళ్యాణ్‌రామ్!

కెరీర్ ప్రారంభం నుంచి న్యూ టాలెంట్‌ని ఎంకరేజ్ చేస్తూ వస్తున్నారు హీరో నందమూరి కళ్యాణ్ రామ్. ఈ ప్రయాణంలో బ్లాక్ బస్టర్ హిట్‌లతో పాటు భారీ డిజాస్టర్లని కూడా చవి చూశారు. అయినా సరే కొత్త టాలెంట్‌ని ఎంకరేజ్ చేయడం మాత్రం ఆపలేదు. అతనొక్కడే, హరే రామ్, పటాస్ వంటి సినిమాలతో టాలెంటెడ్ డైరెక్టర్స్‌ని ఇండస్ట్రీకి అందించారు. కళ్యాణ్ రామ్ పరిచయం చేసిన అనిల్ రావిపూడి ఇప్పుడు వరుస బ్లాక్ బస్టర్లని సొంతం చేసుకుంటూ హిట్ మెషీన్ అనిపించుకుంటున్నారు.ఇదే తరహాలో మరి కొంత మంది డైరెక్టర్లని పరిచయం చేశారు కానీ పెద్దగా ఉపయోగం లేకుండా పోయింది. దీంతో ఫ్లాపులు ఎదుర్కోవాల్సి వచ్చింది. -బింబిసార-తో వశిష్టని దర్శకుడిగా పరిచయం చేసి సూపర్ హిట్ అందుకున్నారు. మళ్లీ ట్రాక్‌లోకి వచ్చారు. ఆ తరువాత కూడా ముగ్గురు కొత్త డైరెక్టర్లని పరిచయం చేస్తూ కళ్యాణ్ రామ్ చేసిన ప్రయోగాలు -అమిగోస్-, ది డెవిల్, అర్జున్ సన్నాఫ్ వైజయంతీ తీవ్ర నిరాశకు గురి చేశాయి. సక్సెస్ అవుతాయని కళ్యాణ్ రామ్ పెట్టుకున్న నమ్మకాన్ని



నిలబెట్టలేకపోయాయి. దీంతో దాదాపు ఏడాది బ్రేక్ ఇచ్చిన కళ్యాణ్ రామ్ మళ్లీ రేస్‌కు రెడీ అవుతున్నాడు. ఈ సారి కూడా మరో కొత్త దర్శకుడికి అవకాశం ఇవ్వడానికి సిద్ధమవుతున్నాడు. కళ్యాణ్ రామ్ దర్శకుడిగా పరిచయం చేయబోతున్నది మరెవరినో కాదు పాన్ ఇండియా స్థాయిలో సంచలనం సృష్టించి రికార్డు స్థాయి వసూళ్లని రాబట్టిన -పుష్ప-, -పుష్ప 2- చిత్రాలకు డైలాగ్స్ అందించిన రైటర్ శ్రీకాంత్ విస్సా ని దర్శకుడిగా పరిచయం చేయబోతున్నాడు. దీనికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ ఆల్ రెడీ స్టార్ట్ అయింది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ని -అర్జున్ సన్నాఫ్ వైజయంతీ- ముప్పా అశోక్ వర్ధన్ నిర్మించబోతున్నాడని తెలిసింది. పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ -పుష్ప-తో పాటు పలు హిట్ సినిమాలకు డైలాగ్స్ అందించిన శ్రీకాంత్ విస్సా చెప్పిన కథ నందమూరి కళ్యాణ్‌రామ్‌కు ఎంతగానో నచ్చిందట. గత ఏడాది ఎండింగ్‌లోనే ఈ ప్రాజెక్ట్‌కు ఓకే చెప్పినా షూటింగ్‌ని మాత్రం 2026లోనే మొదలు పెట్టాలని ఇన్ని రోజులు ఆగారట. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక అప్ డేట్‌ని రిలీజ్ చేయబోతున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. హిట్ సినిమాల రైటర్గా పేరు తెచ్చుకున్న శ్రీకాంత్ విస్సా ఈ సినిమాతో నందమూరి కళ్యాణ్ రామ్‌ని మళ్లీ రేస్‌లోకి తీసుకొస్తాడా అన్నది వేచి చూడాల్సిందే.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536